# ప్రజాశక్తి

## సైద్ధాంతిక బులెటిన్

భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు)

18వ అఖిల భారత మహాసభ ఆమోదించిన

రాజకీయ, నిర్మాణ నివేదికలు...

పశ్చిమబెంగాల్, త్రిపుర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్

ముస్లిం రిజర్వేషన్లు.. పరిశీలించాల్సిన అంశాలు

భూపోరాట వీరుడు విన్‌స్టాన్లీ

తప్పులు ఒప్పుకోకుండా విమర్శలా!?

మహానాడు తీరుపై రాఘవులు

జూన్ 2005

వెల. రు 5/-

# భూపోరాట వీరుడు విన్‌స్టాన్లీ

అది 1649 ఏప్రిల్...శరీరంపై సరైన ఆచ్ఛాదన కూడా లేని ఒక నిరుపేద బృందం సర్రేలోని సెయింట్ జార్జ్ కొండ పాదం దగ్గర డేరాలు వేసుకున్నారు. వాళ్లు తమకి‘ సిసలైన సమానత్వ వాదులు’ అనీ, డిగ్గర్లు అనీ పేరు పెట్టుకున్నారు. ఇంగ్లీషులో డిగ్గర్లు అంటే తవ్వేవాళ్లు . ఆ పేరుకి తగినట్లుగా ఈ చిన్న శిబిరం వాళ్లు తెల్లవారు జాము నుంచి సాయంత్రం దాకా పొలంలో పనిచేయసాగారు. మధ్యమధ్య ఆ బృందంలోని సభ్యులు పొరుగు గ్రామానికి వెళ్లి, గ్రామస్థులను తమతో చేరమని విజ్ఞప్తి చేస్తుండేవారు. సిసలైన న్యాయాన్ని పునరుద్ధరించి, ఉమ్మడి శ్రమ, పంపిణీ, స్వామ్యాలను ప్రవేశపెట్టాలని వాళ్లు కలలు కన్నారు.

అయితే ఈ విజ్ఞప్తులు అందరికీ నచ్చలేదు. ఉమ్మడి పొలం దున్నడమా? ఉమ్మడి స్వామ్యాన్ని పునరుద్ధరించడమా? ఈ కబుర్లు ఆ నోటా ఈ నోటా లండన్ చేరుకున్నాయి. మంత్రి మండలి సభ్యుల్లో కలవరం చెలరేగింది. రాజుకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తాము కొంత సొంత ఆస్తిని, ప్రాణాలనూ ఒడ్డి నది, సెంట్‌జార్జి కొండ మీది భూమిని, అది బీడు భూమే అయినప్పటికీ, బిచ్చగాళ్ల బృందం ఆక్రమించుకోగలిగేందుకా? అయితే విషయం దీనితోనే ముగిసి పోలేదు. ఇది ఆస్తి దురాక్రమణ. ఈ వ్యవస్థని ఆదిలోనే అణచేసి, తిరుగుబాటుదారుల్ని చెదరగొట్టమని నూతన సైన్యాధిపతి లార్డ్ ఫెయిర్‌ఫాక్స్‌కి ఆజ్ఞ జారీ చేయబడింది. లార్డ్ ఫెయిర్‌ఫాక్స్ హుటాహుటిగా కెప్టెన్ గ్లాడ్‌మన్ నాయకత్వాన ఒక అశ్విక దళాన్ని కల్లోల కేంద్రానికి పంపాడు. ఆ అశ్విక సైనికులు చితచితలాడే రోడ్ల వెంట తమ గుర్రాలను దౌడు తీయిస్తూ శాంతి భద్రతల పునరుద్ధరణ కోసం కల్లోల కేంద్రానికి చేరుకున్నారు. అయితే ఏమిటిది? అక్కడ వాళ్లకి గలాటాదారుల బృందానికి బదులు శాంతియుతంగా భూమిని దున్నుకుంటున్న మనుష్యులు కన్పించారు. క్రుద్ధ వదనాలు కాక ఎండకీ చలికి కగ్గిన ముఖాలు వాళ్లకి కానవచ్చాయి. వాళ్ల చేతుల్లో తుపాకులకూ, ఈటెలకూ బదులూ పారలూ, పలుగులు ఉన్నాయి. కెప్టెన్ గ్లాడ్‌మెన్ కంగుతిన్నాడు. పోరాడేందుకు అక్కడ ఎవరూ లేరు.

లండన్‌లో ఉన్న లార్డ్ ఫెయిర్‌ఫాక్స్‌కి హుటాహుటిగా ఈ కింది వార్త పంపబడింది. ఇక్కడ ఇరవై మంది ‘డిగ్గర్లు’ మాత్రమే ఉన్నారు. వారి కార్యకలాపాలలో ప్రమాదకరమైనది ఏమీ లేదు.

ఈ వార్త లండన్‌కి చేరిన కొద్ది రోజుల తర్వాత, ఆ ఉద్యమ కార్యక్రమాన్ని వివరించేందుకు విన్‌స్టాన్లీ లండన్‌కి వెళ్లాడు. అయితే లండన్‌లోని ఉన్నత వర్గీయుల , వ్యాపారస్తుల విలాసవంతమైన స్వాగత శాలల్లో పేదల పట్ల కనికరానికి తావుండదు. అంచేత ‘సిసలైన సమానత్వవాదుల నాయకుడైన విన్‌స్టాన్లీ స్వేచ్ఛా, న్యాయాల అసలైన నియమాలను ప్రపంచానికి తెలియచేసేందుకు కలం చేతపట్టాడు.

జెరార్డ్ విన్‌స్టాన్లీ జీవితానికి సంబంధించిన సమాచారం అతి తక్కువగా ఉంది. ఆయన బాహ్య రూపం గురించిన సమగ్ర వివరణ వర్ణన మాట అటుంచి, క్లుప్తమైన వర్ణన కూడా లేదు. ఆయన జీవిత చరిత్ర కర్తలు ఆయన రచనల ప్రాతిపదిక మీద ఖాళీ భాగాలు పూడ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ప్రయత్నాలలో చాలా మటుకు విఫలమే అయ్యాయి.

జెరార్డ్ విన్‌స్టాన్లీ లాంక్‌షైర్‌లో జన్మించారు. 1609 అక్టోబర్ 10న లాంక్‌షైర్ పారిష్ చర్చిలో ఆయన నామకరణోత్సవం జరిగినట్లు నమోదైఉంది. ఆయన తండ్రి నూలు, వస్త్రాల వర్తకుడు. జెరార్డ్‌కి కూడా అదే వృత్తి రాసిపెట్టి ఉంది. ఆ రోజులలో ఒక చిన్న అంగడి యజమాని తన బిడ్డలకు ఇవ్వగలిగినంతపాటి బహు స్వల్ప విద్య మాత్రమే గ్రామీణ పాఠశాలలో కొద్ది సంవత్సరాలు- విన్‌స్టాన్లీకి లభించింది. ఏదేమైనప్పటికీ ఆయన తన చిరు పుస్తకాలలో ఉల్లేఖించిన ఏకైక గ్రంథం బైబిలే. ఆ రోజులలో బైబిల్ ఒక కరదీపికగా, తరచూ గ్రామీణ ఉపాధ్యాయుడి బల్లమీది ఏకైక గ్రంథంగా ఉండేది. కానైతే ‘ఇంగ్లండ్ ఒక జైలు’ అంటూ ఆయన చేసిన ప్రకటనను బట్టి ఆయన జీవిత చరిత్రకర్తలు ఆయనకి షెక్స్‌పియర్ రచనలతో పరిచయం ఉన్నట్లు భావించారు. థామస్ మూర్ ‘ఉటోపియా’తో కూడా ఆయనకు పరిచయం ఉండిఉంటుంది. అయితే ఇదంతా ఊహ మాత్రమే. పూర్తి ఖచ్చితంగా మనకి తెలిసిన విషయమల్లా ఆయనకి క్రమబద్ధమైన విద్య లేదని మాత్రమే.

1630 దశకంలో విన్‌స్టాన్లీ లండన్‌లో వ్యాపారం నేర్చుకుంటూ ఉండేవాడు. అంతర్యుద్ధం చెలరేగేనాటికి అంటే 1640 దశకంలో ఆయన లండన్ నగరంలో తన సొంత వ్యాపారం ప్రారంభించాడు. 1640లో ఆయన స్యూసన్‌కింగ్‌ని పెళ్లి చేసుకున్నాడు. ఆమె పేరు తప్ప ఆమె గురించి మనకి మరేమీ తెలియదు. యుద్ధం మూలంగా ఆయన వ్యాపారం దివాళా తీసింది. జీవనాధారం కోల్పోయిన విన్‌స్టాన్లీ సర్రేలోని తన మిత్రుల ఆశ్రయం పొందాల్సివచ్చింది. తన ఉదరపోషణ కోసం ఆయన తన పొరుగువాడి పశువుల కాపరిగా పనిచేశాడు. 1643 నుంచి 1648 దాకా, అంటే ఆయన మొదటి చిన్న పుస్తకం వెలువడేదాకా , ఆయన నిరుపేద ఆంగ్లేయుడిగా జీవితం గడిపాడు. ఆ దశలో నిరుపేద ఆంగ్లేయుల కష్టాలనూ, ఆకాంక్షలనూ తెలుసుకున్నాడు.

17వ శతాబ్ది మధ్య కాలం నాటి ఆంగ్ల బూర్జువా విప్లవం మూలంగా దేశం రెండు శిబిరాలుగా చీలిపోయింది. ఫ్యూడల్ ప్రభువర్గంతో, సాంప్రదాయిక చర్చితో కూడిన మొదటి శిబిరం రాజు అధికారం చుట్టూ సమీకృతమైంది. కాగా దాని ప్రత్యర్థి శిబిరం, పార్లమెంటు నాయకత్వాన పట్టణాలకూ, గ్రామాలకూ చెందిన వర్తక, పారిశ్రామిక బూర్జువా వర్గాన్నీ , చేతివృత్తుల వాళ్లనీ, రైతాంగాన్ని తమ ఆర్థిక కార్యకలాపాలలో అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ సంబంధాలకు తమని తాము సరిపెట్టుకున్న ‘కొత్త కులీనుల్ని’ కూడగట్టుకుంది. రాజరికానికి వ్యతిరేకులైన జనబాహుళ్యపు తోడ్పాటు కలిగిఉన్న పార్లమెంటు రాజును ఓడించింది. ఫ్యూడల్ వ్యవస్థను అట్టే ఉంచడం కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛాయుత పెరుగుదల శ్రామిక ప్రజలకు బాగా మేలైనది.

కొత్త ఆదర్శ సైన్య నిర్మాత అయిన ఆలివర్ క్రామ్‌వెల్ పార్లమెంట్ నాయకుడు. ఈ సైన్యంలో మనుషులు కులీన వంశాన్ని బట్టికాక వాళ్ల యోగ్యతని బట్టి ఉన్నత పదవులు పొందేవారు. ఆ సైన్యం సాధించిన విజయాల ఫలితంగా బూర్జువా వర్గం తన లక్ష్యాలను సాధించుకుంది. మొదటి చార్లెస్ రాజు అరెస్టు చేయబడ్డాడు. ఆయన పొలాలు, ఆయన సన్నిహిత సమర్థకుల పొలాలు, అలాగే చర్చి పొలాలూ జప్తుచేయబడ్డాయి. ఆ పొలాల్లో అధికాంశం బూర్జువా వర్గపు చేతుల్లోకి, కులీనుల

(మిగతా 27వ పేజీలో)

లోపలిపేజీల్లో...



ప్రజాశక్తి సాహితీసంస్థ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు : వి.కృష్ణయ్య
సంపాదకులు : వి. శ్రీనివాసరావు
ముద్రణ :
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 1-1-60/2, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, హైదరాబాద్ -20
ఫోన్ : ఎడిటోరియల్ 27665420, 27663761
మేనేజర్: 27673787
ఫ్యాక్స్ : 27639921
EMail: editor@prajashakti.com
PRAJASAKTI,Hyderabad,
RNI,Regd.No.52973/94
visit PRAJASAKTI at : www.prajasakti.com

# మానవ ముఖం

సంస్కరణలకు మానవముఖం కప్పుతున్నట్లుగా పాలకులు పదేపదే ప్రకటిస్తున్నారు. దీన్నే ఇంగ్లీషులో "రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్" (మానవత్వంతో కూడిన సంస్కరణలని అర్థం. అంతేకానీ కనీసం మానవతావాద సంస్కరణలని కూడా అనడం లేదు) అంటున్నారు. అంటే ఇప్పటిదాకా సంస్కరణలకు మానవత్వం లేదని అంగీకరించినట్లే. సంస్కరణల్లో మానవత్వాన్ని ఆశించడమంటే నేతిబీరకాయలో నెయ్యిని వెతికినట్లే. లేని మొఖాన్ని కప్పడమంటే జనాన్ని మోసం చేయడమే. పాలకులెంతకైనా తగుదురు. ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు, విదేశీ బహుళజాతి కంపెనీలకు తెగనమ్మేసి వారినే సామాజిక న్యాయం అమలు జరపమని బతిమిలాడుకుంటున్నారు. ప్రైవేటురంగంలోనూ రిజర్వేషన్లు కావాలని వస్తున్న డిమాండుకి తలొగ్గిన కాంగ్రెసు ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం ఆఖరికి దాన్ని కార్పొరేట్ కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. వారు దాన్ని మినహా ఏమైనా అడగండంటున్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం సంస్కరణల పుణ్యమైతే అందులో రిజర్వేషన్లు అమలు చేయమని అడగటం మానవత్వం కిందకు వస్తుంది. సామాజికంగా వెనుకబడినవారి పట్ల కాస్త దయ చూపండని పాలకులు దేబిరిస్తుంటే కాదు పొమ్మని వారన్నారంటే అదే అమానవీయత. అందులో మానవత్వాన్ని ఆశించడం అంటే తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు...నన్న పద్యం గుర్తుకు రాకమానదు. పాలకులు నిజంగా సంస్కరణలకు మానవత్వాన్ని కల్పించాలనుకుంటే ప్రభుత్వరంగాన్ని కాపాడటం ద్వారానే అది సాధ్యమవుతుంది. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడమే సంస్కరణల అర్థం, పరమార్థమని చెపుతున్నారు. ప్రభుత్వరంగంలోనే ఉంచి దాన్ని సంస్కరించలేమా? దీనికి పాలకుల నుండి సమాధానం లభించదు. ఈ పాలకులపై విశ్వాసముంచి ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్నారు. ఇంత పెద్ద ప్రభుత్వరంగాన్ని కాపాడలేని పాలకులు నిజంగా సమర్థులేనా? అన్న సందేహం రాకమానదు. ప్రైవేటీకరించడంలో చూపిస్తున్న సమర్థతను దాన్ని కాపాడటంలో, లాభాలను పెంచడంలోనూ చూపెడితే దేశప్రజలు సంతోషిస్తారు. ప్రభుత్వరంగానికి లాభాలొస్తే అది సామాజికాభివృద్ధికి ఉపయోగపడుతుంది. అదే ప్రైవేటురంగానికి లాభాలొస్తే జనం మూల్గులు మరింత పీల్చడానికి, స్వీయసౌకర్యాలు అనుభవించడానికి తోడ్పడుతుంది. మొదటిది సమాజహితం. రెండోది వ్యక్తిప్రయోజనం. ఈ రెంటిలో ఏది నిజమైన మానవత?

సంస్కరణలకు మానవత్వ ముఖం కప్పి ఆర్టీసీ ఆస్తులమ్ముకొని నష్టాలు పూడ్చుకోమని వైయస్ చెపుతున్నారు. లాభమో, నష్టమో మీదే బాధ్యత అంటున్నారు. దానితో తనకేమీ సంబంధం లేనట్లుగా అటు కార్మికులకు, ఇటు యాజమాన్యానికి ఆయన హితవు చెపుతున్నారు. యాజమాన్యం ఎవరు? ప్రభుత్వమా? వారు నియమించిన ఉద్యోగులా? యండీలు, జీయంలూ ఈరోజు ఉంటారు రేపు పోతారు. కాని ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ఉంటుంది. పార్టీలు మారినా ప్రభుత్వం ఉంటుంది. ప్రజలకు వాగ్దానాలు చేసింది వారే, బాధ్యత వహించాల్సిందీ వారే. అలాంటి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి అనవలసిన మాటలేనా ఇవి. అలాగైతే వారెందుకు పోటీలు చేసి ప్రజల ఓట్లు దండుకోవడం? ఈ సలహాలు ఇవ్వడానికేనా? వారి కన్నా ఆ యండీలకు, జీయంలకే ఓట్లేసి వారినే శాశ్వతంగా అధికారంలో ఉంచుకుంటే ఇంతకన్నా మెరుగైన పాలన అందిస్తారుగా. ఇప్పటికే అధికారులు సైతం ఏదో విధంగా ఆర్టీసీని కాపాడాలని కార్మికులు, ఉద్యోగులతో పాటు తపన పడుతున్నారు. కనీసం వారికున్నపాటి చిత్తశుద్ధి పాలకులకుంటే ఆర్టీసీ ఈ దౌర్భాగ్యకరమైన పరిస్థితిని ఎదుర్కొని ఉండేది కాదు. దేశంలోనే అత్యున్నత రవాణా సంస్థగా దాన్ని సమిష్టి కృషితో రూపొందించారు. నేటి ఈ దుస్థితికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. గత ప్రభుత్వం చేసుకున్న ప్రపంచబ్యాంకు ఒప్పందాలను కొనసాగిస్తానంటున్న ప్రభుత్వం వారు చేసిన అప్పులను తీర్చే బాధ్యత మాత్రం లేదనడం బాధ్యతారాహిత్యం కాదా? నష్టాలకు తెలుగుదేశాన్ని నిందిస్తున్న కాంగ్రెసు తాను లాభాలతో నడిపి చూపిస్తే ఆదర్శప్రాయంగా ఉంటుంది. దానికి బదులుగా ప్రజలోడించిన ప్రభుత్వాన్ని నిందిస్తూ కూర్చోవడం వల్ల ఏమి లాభం? దానికోసం ప్రజలు కష్టపడి ప్రభుత్వాన్ని మార్చుకోవాలా? ఏ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలు గత ఎన్నికల్లో తీర్పునిచ్చారో అదే సంస్కరణలను అమలు జరపబూనుకోవడం ప్రజాతీర్పును వమ్ముచేయడం కాక మరేమవుతుంది? పెట్టుబడిదారీ వ్యవస్థలో సంస్కరణలంటే దాన్ని మరింత మెరుగుపర్చడం. పెట్టుబడిదారీ వ్యవస్థను మెరుగుపర్చడమంటే దోపిడీకి ఎదురులేకుండా చేయడమే. ఇంకా బాగా ప్రజల్ని పీల్చిపిప్పి చేయడమే. సంస్కరణల సారం ఇదే. అసలు పెట్టుబడిదారీ వ్యవస్థలోనే మానవత్వం లేదు. దాన్ని మరింత బాగుచేసే సంస్కరణలకు మానవత్వం ఎక్కడ నుండి వస్తుంది. పైగా కాస్తోకూస్తో మానవత్వం మిగిలి ఉంటే దాన్ని కూడా హరిస్తుంది. నేడదే జరుగుతోంది. ఏ కారణాల చేతనైతేనేం గతంలో బడుగువర్గాలకు, సామాజికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు, సబ్సిడీలు, సంక్షేమకార్యక్రమాలు వంటి సౌకర్యాలు కల్పించారు. దోపిడీ చేస్తున్నా కాస్త జాలి చూపించారు. నేడు సంస్కరణల పేరుతో వాటిని తొలగిస్తున్నారు. ఇక మానవత్వం ఎక్కడ? సంస్కరణలకు మానవత్వ ముఖం కప్పడమంటే బలివ్వబోయే ముందు నొప్పి తెలియకుండా మత్తుమందిచ్చినట్లే. అందుకే సంస్కరణల కన్నా మానవీయ సంస్కరణలు మరింత ప్రమాదకరమైనవి. కనీసం నొప్పి తెలిస్తే ప్రతిఘటన చేస్తారు. కాని మత్తిచ్చి లొంగదీసుకోడానికే ఈ మానవీయ నాటకాన్ని ఆడుతున్నారు.


**వి. శ్రీనివాసరావు**
ఎడిటర్

# రాజకీయ నిర్మాణ నివేదిక....

# పశ్చిమబెంగాల్

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 18వ అఖిల భారత మహాసభలు ఆమోదించిన రాజకీయ నిర్మాణ నివేదికలో వివిధ రాష్ట్రాల వివరాలను మార్క్సిస్టు పత్రిక ప్రచురించింది. వాటిని పాఠకుల సౌకర్యార్థం అందిస్తున్నాం**

**..... సంపాదకులు**



జాతీయంగా పెద్ద మార్పు వచ్చిన నేపథ్యంలో మనం 21 వ మహాసభ జరుపుకొంటున్నాము. 2003 పంచాయితీ ఎన్నికల్లోనూ,2004 లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ పాత్ర బాగా రుజువైంది. లోక్‌సభ ఎన్నికలలో బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వానికి స్వస్తిచెప్పి ఒక లౌకిక ప్రభుత్వాన్ని నెలకొల్పడం జరిగింది.

ఈ కాలంలో ప్రధాన పోరాటం కేంద్ర ప్రభుత్వ వినాశకర ఆర్థిక విధానాలకు, మతతత్వం, వేర్పాటు వాదాలకు వ్యతిరేకంగా సాగింది. బెంగాల్‌లో అరాచకం సంక్షోభం సృష్టించే ప్రయత్నాలను కూడా ఎదుర్కోవడం జరిగింది.

కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద ఆదేశాలతో అమలు జరిపే ఆర్థిక విధానాల ప్రభావాన్ని వామపక్ష ప్రభుత్వం తప్పించుకోలేకపోయింది. ఈ ఆర్థిక విధానాల సారాంశం ఏమంటే ఫెడరల్ విధానంపైన, కేంద్ర రాష్ట్ర సంబంధాలపైన పథకం ప్రకారం దాడి చేయడమే. ప్రభుత్వ జోక్యానికి, ప్రజలకు జవాబుదారీగా వుండే పాత్రను దిగ్బంధనం చేయడమే. అన్నివిషయాలను స్వేచ్ఛామార్కెట్ శక్తులకు వదిలేయడం జరిగింది. ఈ ఆర్థిక విధానం ఒకటిన్నర దశాబ్దాల పాటు అమలైంది. సరళీకరణ విధానాలు పెట్టుబడిదారీ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేశాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విధానాన్ని చాటిచెప్పడం, వర్గ దృక్పథాన్ని సరైన దిశలో నెలకొల్పడం మన కర్తవ్యమని సూత్రబద్ధమైఖరి చేపట్టాము.తన కార్యక్రమాన్ని అమలు జరపడం కోసం ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోంది.ఈ సంక్లిష్టమైన ఈ వాస్తవ పరిస్థితుల మధ్య ప్రజలను సమైక్యంగా వుంచే కర్తవ్యంలో పార్టీ ,వామపక్ష సంఘటన నిమగ్నమై వున్నాయి. 20 వ మహాసభలో ఆమోదించిన వామపక్ష ప్రభుత్వం- మన కర్తవ్యాలు అనే పత్రం ఆధారంగా పార్టీ గత మూడేళ్ల రాజకీయ నిర్మాణ కర్తవ్యాలను రూపొందించుకుంది.

వామపక్ష ప్రభుత్వ విధానం అమలు కాకుండా విచ్ఛిన్నం చేసేందుకై వివిధ రకాల వామపక్ష వ్యతిరేక శక్తులు అనేక పద్ధతులు అనుసరించాయి. ప్రచారాలకు పాల్పడ్డాయి. గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించాయి. ప్రజల్లో అత్యంత నిరుపేదలైన వారికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం, పార్టీ తమ కార్యక్రమాలను అమలు జరిపాయి. సరళీకరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు, ఉద్యమాలు కూడా ఈ మూడేళ్ళ కాలంలో జరిగాయి. ప్రత్యామ్నాయ విధానాలు, కార్యక్రమాల గురించి ప్రజలను మరింత చైతన్యవంతం చేసే కర్తవ్యం నెరవేర్చే కృషి ఈ కాలంలో మరింత వేగంగా జరిగింది.

20వ రాష్ట్ర మహాసభ తరువాత కాలంలో గుజరాత్ మతమారణకాండ సాగింది. మనం ఆ పరిణామాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. సంఘ్‌పరివార్ పథకం ప్రకారం నిర్వహించిన పాత్రను దానికి వాజ్‌పేయి ప్రభుత్వ పరోక్ష మద్దతుకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో ప్రచారోద్యమం సాగింది. తృణమూల్ కాంగ్రెస్ ఏకాకి అయ్యింది. మోడి ప్రభుత్వం తొలగింపు కోసం సాగిన ఉద్యమం బలం పుంజుకోవడంతో తృణమూల్ కాంగ్రెస్ వెనుకంజ వేయాల్సి వచ్చింది. అయితే వారు కొన్ని అప్రధాన సమస్యలు పట్టుకొని ఉన్మాదపూరితంగా వ్యవహరించారు. ఆ క్రమంలో మరింతగా ఏకాకులయ్యారు. తూర్పు ప్రాంతంలో రైల్వే విభజన సమస్యపై మనం ఉద్యమం నిర్వహించాం. అఖిలపక్ష తీర్మానం ప్రాతిపదికగా సాగిన ఉద్యమం తృణమూల్ కాంగ్రెస్ ఉద్యమాన్ని బాగా బలహీనపర్చింది. అయినప్పటికీ వారు విచ్ఛిన్న మార్గాన్ని వదిలిపెట్టలేదు.

ఆఫ్ఘనిస్తాన్‌లో సామ్రాజ్యవాద చర్యలు, ఇరాక్‌లో దాడి, పాలస్తీనా ప్రజలపై దాడి, ఇండియాలో హిందూ మతఛాందస ఫాసిస్టు శక్తుల కార్యకలాపాలు వాటికి కేంద్ర ప్రభుత్వ మద్దతు ఇదంతా బీభత్స పరిస్థితిని సృష్టించాయి. మన పొరుగున బంగ్లాదేశ్‌లో ముస్లిం ఛాందసవాద కార్యకలాపాలుపెరిగాయి. కొంత వరకు ఇది పశ్చిమ బెంగాల్‌కు కూడా వర్తిస్తుంది. మత ఛాందస మద్దతు, సిద్ధాంతం విషయంలో పార్టీ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. గత మూడేళ్ళలో దానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యపరిచ్చేందుకు ఎంతగానో కృషి చేసింది. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం ఆరేళ్ళు అధికారంలో ఉండటంవల్ల మతతత్వం లోతుగా వెళ్లానుకోవడానికి అవకాశం కల్గింది. కేంద్రంలోని కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వ బలహీనత మతతత్వంతో దాని రాజీ కారణంగా

ఛాందసవాదులు మరోసారి వత్తాసు లభించింది. తన అనుబంధ సంస్థల ద్వారా పాఠశాలలు నడిపే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ఇమిడి ఉన్న ప్రమాదాన్ని గురించి మనం అప్రమత్తంగా ఉండాలి. వాటి ప్రభావాన్ని పెంచుకొనేందుకు గిరిజనుల్లో, పేదల్లో పని చేసేందుకు అవి ప్రయత్నిస్తున్నాయి. నిరాశ్రయులైన వారిలో పని చేసేందుకు ఎన్జివో సంస్థలను వాడుకొనేందుకు మత సంస్థలను ఉపయోగించుకొనేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి. వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. మతతత్వ వ్యతిరేక ఉద్యమం ఏమాత్రం మందగించకూడదు.

2003లో పంచాయితీ ఎన్నికల్లో వామపక్ష సంఘటనను ఓడించేందుకై కాంగ్రెస్, తృణమూల్, బిజెపిలు ఒకటయ్యాయి. ప్రజానుకూల విధానాల విషయంలో కూడా విచ్ఛిన్నకర చర్యలకు తృణమూల్ పాల్పడింది. మన ప్రతిఘటన ప్రచారంవల్ల ఆ ప్రయత్నాలు సాగలేదు.

పంచాయతీ ఎన్నికల్లో పార్టీ ముషీరాబాద్, మాల్దాలలో పట్టు కోల్పోయింది. కాంగ్రెస్ మతతత్వ శక్తులతో రాజీ పడడాన్ని ఈ ఫలితాలు వెల్లడించాయి. దాగి ఉన్న ప్రమాదాలను ఎత్తి చూపాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన మెతక వైఖరి బిజెపికి సహాయపడింది. మనం కాంగ్రెస్‌తో రాజీ విధానంపై నిరంతరాయంగా దృష్టి పెట్టాల్సి వచ్చింది.

గత మూడేళ్ళ కాలంలో కెఎల్ఓ వంటి వేర్పాటు వాద సంస్థలు చెలరేగాయి. వాటి దాడుల్లో జల్పాయిగురి జిల్లా కమిటీ సభ్యుడు గోపాల్ చాకీతో సహా పలువురు పార్టీ కార్యకర్తలు చనిపోయారు. మొత్తంగా వారు ఒక మహిళా సభ్యురాలితో సహా 22 మంది మన పార్టీ సభ్యులను చంపివేశారు. కూచ్‌బిహార్‌లో, డార్జిలింగ్‌లో కూడా దాడులు జరిపి 35 మందిని చంపివేశారు.

డార్జిలింగ్ హిల్ కౌన్సిల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. జిఎన్ఎల్ఎఫ్ 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపర్చింది. ఇది మనకు ఇబ్బంది కలిగించింది. జిఎన్ఎల్ఎఫ్‌లో అంతర్గత కలతలున్నాయి. ఆ అవినీతికర సంస్థకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం పెరిగింది. ప్రజాస్వామ్యం కోసం మనం సకాలంలో ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. మనం మన సానుకూల దృక్పథాన్ని ప్రజల ముందు ఉంచాల్సి వచ్చింది. కొన్ని స్థానిక పార్టీలతో పొత్తు పెట్టుకొని ఆ విధంగా మన వైఖరిని వివరించాం.

వేర్పాటువాదులు తమ దాడిని ప్రధానంగా సిపిఐ(ఎం) ఎక్కుపెట్టారు. జాతీయ సమైక్యతను నిలబెట్టడంలో అది గొప్ప పాత్ర నిర్వహించడం ఇందుకు కారణం. కాంగ్రెస్, తృణమూల్, బిజెపిలు వేర్పాటువాద శక్తులతో, అవకాశవాద రాజకీయ రాజీ కుదుర్చుకున్నాయి. వారిచ్చిన రాజకీయ ఆశ్రయంవల్లనే కెఎల్ఓ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ మనుగడ కొనసాగించగల్గింది. కెఎల్ఓకు ఈశాన్య ప్రాంతంలోని వేర్పాటువాదులతో సంబంధాలున్నాయి. వేర్పాటువాదానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే చర్యలతోపాటు మనం సైద్ధాంతిక ప్రచారాన్ని కూడా సాగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ పాత్రను ఎండగట్టాల్సి ఉంటుంది.

దక్షిణ బెంగాల్ పశ్చిమ భాగాల్లో సిపిఐ(మావోయిస్ట్) తీవ్రవాద కార్యకలాపాలు ముమ్మరం చేసింది. అత్యాధునిక ఆయుధాలతో వారు పోలీసులను చంపివేశారు. వారు ప్రధానంగా సిపిఐ(ఎం)ను లక్ష్యంగా పెట్టుకున్నారు. కాంగ్రెస్, తృణమూల్, బిజెపిలు అలాగే జార్ఖండీయులు ఈ చర్యలను బలపరుస్తున్నారు. తీవ్రవాదులు హత్యలు దోపిడీలు వరుసగా సాగించారు. ఉత్తర బెంగాల్‌లోను అలాగే నేపాల్‌లో ఉన్న తమలాంటి వారితో సంబంధాలు పెట్టుకున్నారు.

అలాంటి వేర్పాటువాద ప్రయత్నాలకు వ్యతిరేకంగా పార్టీ పోషించిన మహత్తర పాత్ర ప్రశంసనీయమైంది. విశాల ప్రజాసమీకరణ ద్వారా పార్టీ ఈ చర్యలను ప్రతిఘటించింది. పేద ప్రజలు బెదిరింపులను పట్టించుకోకుండా పార్టీకి ఎన్నికల మద్దతు అందించారు. మనం ఆత్మసంతృప్తి చెందడానికి ఆస్కారంలేదు. ప్రజలను సంఘటిత పర్చడంలోనూ మరింత చైతన్యవంతం చేయడంలోనూ నిమగ్నం కావాలి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రదేశాల్లో త్వరితంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం నొక్కి చెప్పాలి.


మతతత్వ సమస్యపై పార్టీ, వామపక్ష ఫ్రంట్ నికరంగా నిలబడటంవల్ల సామ్రాజ్యవాదులు అభివృద్ధి నిరోధక శక్తులు దాన్ని శత్రువుగా చూస్తున్నారు. గత 28 ఏళ్ళ నుంచి వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర సాగుతున్నది. ఈ ప్రయత్నాల మధ్యనే మనం మన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాం. దేశం ఇతర ప్రాంతాల్లోలాగానే బెంగాల్‌లో కూడా తమ వికృత పాత్ర నిర్వహించేందుకు కులతత్వ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. మనం ఆర్థిక, సామాజిక న్యాయం కోసం చేసే పోరాటానికి నాయకత్వం వహించారు. శ్రామిక జన బాహుళ్యంతో, వర్గ ప్రజాతంత్ర ఉద్యమాలలో భాగస్వాములను చేయాలి.

పశుసంపద అభివృద్ధికి సంబంధించిన విషయంలో సరిహద్దు జిల్లాల్లో ఒక ప్రత్యేక సమస్య తలెత్తుతున్నది. బిఎస్ఎఫ్ ఎప్పుడూ మానవతా పూరితంగా ఉండడంలేదు.

ఆనంద్‌మార్గ్, ఇస్కాన్, కొన్ని చర్చీలు, కొన్ని ఎన్జిఓలు సాగిస్తున్న రాజకీయ కార్యకలాపాలపై కన్నువేసి ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ సంస్థలను అభివృద్ధి నిరోధక కార్యకలాపాలకు సాధనాలుగా మార్చే ప్రయత్నాలను మనం వ్యతిరేకించాలి. మీడియాలో ఒక భాగం సిపిఐ(ఎం)పై విద్వేషపూరితంగా ఉండటం కొనసాగుతున్నది. ప్రత్యేకించి కొన్ని పత్రికలు, టి.వి. ఛానల్స్ మనపై దుష్ప్రచారాన్ని ప్రోత్సహించడంలో ముందుంటున్నాయి. మన రాజకీయ నిర్మాణ పునాది, కార్యకలాపాలు బలపడేకొద్దీ దుష్ప్రచారం కూడా పెరుగుతున్నది. మనం ప్రజాబాహుళ్యంలో రాజకీయ సంబంధాలు మరింత పెంచుకోవాలి. వారి చైతన్య స్థాయి పెంచాలి. ఆ విధంగానే ఈ దాడులను తిప్పి కొట్టగలం.

**పోరాటాలు ఉద్యమాలు**

20, 21 రాష్ట్ర మహాసభల మధ్యకాలంలో రాష్ట్ర వ్యాపితంగా ఎన్నికల పోరాటాలతోపాటు ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాం. మోడీ నాయకత్వంలో సాగిన గుజరాత్ మారణహోమాన్ని తీవ్రంగా నిరసిస్తూ సమావేశాలు, ప్రదర్శనలు, సదస్సులు జరిగాయి. అందుకు తోడు 2002లో



కేంద్ర ట్రేడ్ యూనియన్లు బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఇచ్చిన బంద్ పిలుపు గొప్పగా విజయవంతమయ్యింది. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా కూడా ఉద్యమాలు జయప్రదంగా సాగాయి. కేంద్ర ఆర్థిక విధానాలను మతోన్మాదాన్ని, ఛాందస వాదాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ 2003 (జనవరి 12న) బ్రిగేడ్ పెరేడ్ మైదానంలో చారిత్రాత్మకమైన సభ నిర్వహించింది.. ఈ సభ రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, హక్కులు కూడా డిమాండ్ చేసింది. 2003 విద్యుచ్ఛక్తి బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం సాగించబడింది.

ప్రైవేటీకరణ తూర్పు రైల్వే విభజన, కెఎల్ఓ, మావోయిస్ట్‌ల అమానుష దాడులు త్రిపురకు సంఘీభావం, సభలు ప్రదర్శనలు, సమ్మెలు చేసే హక్కు వంటి అంశాలపై పోరాటాలు, ఉద్యమాలు సాగాయి. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపుపై సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం ముమ్మరంగా నడిచింది.

**ఎన్నికల పోరాటం**

ప్రస్తుతం సమీక్షిస్తున్న కాలంలో పశ్చిమ బెంగాల్ సిపిఐ(ఎం) పంచాయతీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలలో పాల్గొంది. మావోయిస్ట్ గ్రూపులతో సహా ఒక మితవాద సంఘటన వామపక్ష ఫ్రంట్‌ను ఎదుర్కొన్నది. మీడియా మొత్తం మీద సిపిఐ(ఎం)కు, వామపక్ష ఫ్రంట్‌కు వ్యతిరేకంగా వ్యవహరించింది. ఎన్నికలకు ముందు దశలో 42 మంది సిపిఐ(ఎం) కార్యకర్తలు హత్య గావించబడ్డారు. వామపక్ష ఫ్రంట్ సమైక్యంగా పోరాడింది. గ్రామీణ ప్రాంతాల్లో విజయం సాధించి 67.28 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. ఇది 1998లో ఫ్రంట్‌కు వచ్చిన ఓట్లకన్నా 9 శాతం అధికం. సిపిఐ(ఎం) కూడా 9 శాతం ఓట్లు పెంచుకుంది.

లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్ సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన మూడు నినాదాలు – బిజెపిని దాని మిత్రులను ఓడించడం, కేంద్రంలో లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పరచడం, లోక్‌సభలో సిపిఐ(ఎం) బలం పెంచడం – అన్న వాటిపై ఎన్నికల ప్రచారం సాగించింది. సిపిఐ(ఎం) కార్యకర్తలతో వేలాది జనరల్ బాడీ సభలు జరిగాయి. వాటిని అనుసరించి పెద్దవి, చిన్నవి ఎన్నికల ర్యాలీలు జరిగాయి. వామపక్ష ఫ్రంట్ ప్రతిపక్షాల కవ్వింపు ప్రచారాలను, ధనబలాన్ని, గుండాయిజాన్ని, మతతత్వ శక్తుల పాత్రను, మీడియా పాత్రను, వామపక్ష వ్యతిరేక ఓట్లన్నింటినీ ఒక చోటకు చేర్చే ప్రయత్నాలన్నింటినీ వామపక్ష వ్యతిరేకులైన కొందరి ఎన్నికల పరిశీలకుల పాత్రలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

సిపిఐ(ఎం) వామపక్ష ఫ్రంట్ బలహీనతలను అధిగమించి తమ ఎంపిల సంఖ్యను 29 నుంచి 35కు పెంచుకోగల్గింది. బిజెపి ఒక్క స్థానం కూడా పొందలేకపోయింది. తృణమూల్‌కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానానికి క్షీణించింది. అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఫ్రంట్ ఇంతే స్థాయిలో విజయం సాధించింది.

దీర్ఘకాలిక ప్రజాతంత్ర ఉద్యమ పథం, వామపక్ష పార్టీలలో పోరాటం – ఐక్యత సూత్రాన్ని అనుసరించి వామపక్ష ఫ్రంట్ అభివృద్ధి చెందింది. ఫ్రంట్ పశ్చిమ బెంగాల్‌లో 28 ఏళ్ళుగా అధికారంలో ఉంది. అయితే భారతదేశంలో బడా పెట్టుబడిదారుల నాయకత్వాన బూర్జువా, భూస్వామ్యరాజ్యం సాగుతున్నది. వామపక్ష ఫ్రంట్ ఐక్యత దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదం, మతోన్మాదం, వేర్పాటువాదాలకు వ్యతిరేకతలపైనా, జాతీయ సమైక్యత సమగ్రతల కోసం పోరాడటంపైనా ఐక్యత ఆధారపడి ఉంది. అనేక సమస్యల విషయంలో వామపక్ష ఫ్రంట్ భాగస్వాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఏమైనప్పటికీ ప్రజలు వామపక్ష ఫ్రంట్‌లో ఎలాంటి చీలికలను చూడటానికి సిద్ధంగా లేరు. పాలక వర్గాలు ఫ్రంట్ విచ్ఛిన్నం కావాలని కోరుకుంటున్నాయి. మనం వామపక్ష ఫ్రంట్ ఐక్యతను మరింత పటిష్టం చేయాలి. ప్రత్యామ్నాయ విధానాల దిశగా పోరాటాలు నడిపించాలి. అదే సమయంలో జన బాహుళ్యం ప్రయోజనాలను పట్టించుకుని పరిరక్షించాలి.

**పార్టీ సభ్యత్వం**

రాష్ట్ర కార్యాలయానికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం రాష్ట్రంలో పార్టీ సభ్యత్వం 11.25 శాతం పెరిగింది. కొన్ని జిల్లాల్లో పెరుగుదల రేటు పడిపోయింది. కొన్నిచోట్ల పెరుగుదల అంచనాలకు మించింది. ఈ రెండింటికి మధ్య కారణాలను లోతుగా తెలుసుకోవాలి.

**వర్గ పొందిక**

20వ పార్టీ మహాసభలో పార్టీ సభ్యత్వంలో కార్మికవర్గం నుంచి వచ్చిన వారు 13.49 శాతంగా ఉన్నారు. సంఘటిత రంగంలో పార్టీ సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. 20వ మహాసభ నాటితో పోలిస్తే పెరుగుదల రెండు శాతం ఉంది.

**సామాజిక పొందిక**

పార్టీ సభ్యుల్లో మహిళల సంఖ్య 2001 కన్నా 8.2 శాతం పెరిగింది. 2001లో ఈ శాతం 7.72 ఉంటే ఇప్పుడు 9.37 ఉంది. పార్టీలో మహిళా సభ్యుల సంఖ్యను పెంచేందుకు మరింత ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

షెడ్యూల్డ్ కులాలకు సంబంధించినంత వరకు వారి సంఖ్య 21.27 శాతం పెరిగింది. షెడ్యూల్డ్ తెగలలో పార్టీ సభ్యుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. దీన్ని పరిశీలించాలి.

మతపరమైన మైనారిటీలు పార్టీ సభ్యత్వం 19.55 శాతం పెరిగింది. భాషాపరమైన మైనారిటీలలో పార్టీ సభ్యత్వం గణనీయంగా పెరిగింది. పార్టీలో విద్యార్థి యువజనులు చురుగ్గా పని చేస్తున్నారు. వారి చొరవ భాగస్వామ్యం మొత్తంమీద పెరిగింది.

**పార్టీ నిర్మాణం**

రాష్ట్రంలో 25,650 పార్టీ శాఖలు, 1771 స్థానిక కమిటీలు, 309 జోనల్ కమిటీలు ఉన్నాయి. 20వ మహాసభతో పోలిస్తే వీటి సంఖ్య వరుసగా 2,695, 288, 27 చొప్పున పెరిగింది. మొత్తం 19 జిల్లాల్లో జిల్లా కమిటీలు సకాలంలో సమావేశమవుతున్నాయి. జిల్లాల్లో పార్టీ కార్యదర్శివర్గాలు వారానికి ఒకసారిగానీ కనీసం నెలకు రెండుసార్లు కానీ సమావేశమవుతుంది. రాష్ట్ర కమిటీ సమావేశాలు సగటున నెలకు రెండు సార్లు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో కార్యదర్శివర్గ నివేదికలు, అజెండా నోట్సు

ద్వారా కార్యక్రమాలు ముందుకు పోతున్నాయి. సభ్యులు క్రమపద్ధతిలో హాజరవుతున్నారు. జ్యోతిబసు, వామపక్ష ఫ్రంట్ మంత్రులతోసహా సమీక్షిస్తున్న కాలంలో రాష్ట్ర కార్యదర్శివర్గం పని మెరుగుపడింది. అది పార్టీ ఐక్యతను మరింత పెంపొందించేందుకు దోహద పడింది.

పార్టీ విద్యాబోధనకు సంబంధించినంత వరకు పొలిట్‌బ్యూరో నోట్స్ ఆధారంగా ఒక బోధనా శిబిరం నడిచింది. అలాగే రాష్ట్ర కేంద్రంలో సులభతరమైన ఉపన్యాసాలతో మూడు శిబిరాలు నడిచాయి. అన్ని జిల్లాల్లోనూ పార్టీ బోధనా శిబిరాలు నిర్వహించాయి.

ఈ పర్యాయం పార్టీ మహాసభల అనుభవాలు చూస్తే స్థానిక కమిటీ మహాసభల్లో పాల్గొనేందుకు శాఖల సభ్యులను ఎన్నుకొనే విధానంపై స్థాయిలోనూ, దిగువ కూడా తీవ్రమైన విభేదాలకు దారి తీస్తున్నాయని అర్థమైంది. కేంద్ర కమిటీ ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించవచ్చు. 5 శాతం సందర్భాల్లో స్థానిక, జోనల్ స్థాయిల్లో పోటీ జరిగింది. కమిటీలలో ఎక్కువ మంది మహిళా కామ్రేడ్స్ ఎన్నికయ్యారు. మహాసభల్లో చర్చ లోతైన రాజకీయ నిర్మాణ విషయాలతో సాగింది. ఏమైనప్పటికీ రాజకీయ చైతన్యాన్ని పెంచే కర్తవ్యాన్ని వేగంగా సాగించాలి.

గత రాష్ట్ర మహాసభ తరువాత మన కామ్రేడ్స్ 129 మంది అమరులయ్యారు.

గత రాష్ట్ర మహాసభనాటికి హోల్‌టైమర్లు 3,350 మంది ఉన్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య 3,219 ఈ తగ్గుదలకు కారణమేమిటో పరిశీలించాలి.

ఒక కామ్రేడ్ రెండు ముఖ్యమైన పదవులలో ఉండరాదన్న రాష్ట్ర కమిటీ నిర్ణయం పూర్తిగా అమలు జరగలేదు. దీన్ని పరిశీలించాలి.

దిద్దుబాటు కార్యక్రమం నిర్వహణలో కొనసాగింపు చాలా ముఖ్యం. నానా రకాలైన ప్రలోభాలు ముంచుకొస్తూనే ఉన్నాయి. ఈ తరుణంలో అందుకు వ్యతిరేకంగా ఉపయోగపడాల్సిన సైద్ధాంతిక ఆయుధాలకు తుప్పుపట్టడాన్ని పరిశీలించి గట్టిగా సరిదిద్దాలి. జిల్లాలో పార్టీ సభ్యులకు సంబంధించి ప్రతి మూడు నెలలకొకసారి తనిఖీ చేసే విషయంలో అనుకున్నంత ఆసక్తి చూపడంలేదు. ఈ ధోరణిని సరిదిద్దాలి.

**పార్టీ పత్రికలు**

మొత్తం మీద పార్టీ ప్రచురణలైన గణశక్తి దినపత్రిక, దేశహితైషీ, మార్క్సువాదీ పథ్, హిందీ స్వాధీనత వారపత్రికలు సర్క్యులేషన్ పెంచుకోగలిగాయి. ఏమైనా ఇంకా కొనసాగుతున్న సమస్యలను మనం అధిగమించాల్సి ఉంది. సర్క్యులేషన్ పెంచేందుకు, పార్టీ ప్రచురణల పఠనాన్ని మెరుగు పరిచేందుకు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుపోవాల్సి ఉంది.

**రాజకీయ నిర్మాణ కర్తవ్యాలు**

1. 21వ రాష్ట్ర మహాసభ, 18వ పార్టీ మహాసభల నిర్ణయాల ప్రకారం మొత్తం పార్టీని మరింతగా సమైక్య పర్చాలి.

2. ప్రతి స్థాయిలో పార్టీ కామ్రేడ్స్‌కు విద్య, విద్యాబోధన, పునర్విద్యాబోధన, రాష్ట్ర కమిటీలు, జిల్లా కమిటీలు, పార్టీ విద్యాబోధన క్యాలెండర్ తయారు చేయాలి. ఇప్పుడున్న శాశ్వత పార్టీ బోధనా కేంద్రాలను కొనసాగించేందుకు జిల్లాల్లో మరిన్ని కేంద్రాలు నెలకొల్పాలి. విద్యావంతుల కాని వారి కోసం రాష్ట్ర కమిటీ ప్రత్యేక సిలబస్‌ను, పాఠ్యాంశాలను రూపొందించాలి. తమకు తాము విజ్ఞానవంతులను చేసుకునే విధంగా కామ్రేడ్స్‌ను ప్రోత్సహించాలి. రీడర్స్ సర్కిల్స్ పాత్ర ఇక్కడ ప్రాముఖ్యం వహిస్తున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సమాజ మౌలిక సమస్యలను పరిష్కరించలేదని సోషలిజం ఒక్కటే ప్రత్యామ్నాయమని ఒక సైద్ధాంతిక ప్రచారాన్ని ప్రజల ముందుకు తీసుకుపోవాలి.

3. సామ్రాజ్యవాదం సాగిస్తున్న బహుముఖ దాడికి వ్యతిరేకంగా ప్రచారాన్ని, ఉద్యమాన్ని అలాగే నిలబెట్టాలి. సరళీకరణ, ప్రైవేటీకరణ, పరిశ్రమల మూత, శ్రామిక ప్రజలపై దాడులు, సాంస్కృతిక రంగంలో దురాక్రమణలు వంటి సమస్యలకు వ్యతిరేకంగా పోరాటాన్ని శక్తివంతంగా కొనసాగించాలి.

4. మైనారిటీ, మెజారిటీ ఛాందసవాదాల నుంచి ఉత్పన్నమవుతున్న ప్రమాదాల గురించి ప్రజలకు తెలియజెప్పాలి. కులతత్వ, రాజకీయాలకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన ఉద్యమాలు ప్రారంభించాలి. శ్రామిక ప్రజల సమైక్యతను నిలబెట్టాలి. మతఛాందసానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనేందుకు లౌకిక భావాలుగల ప్రజలను కదిలించాలి.


5. సిఎంపిలోని సానుకూల అంశాల అమలు కోసం, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు నిర్దేశిత ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించేందుకు ప్రచారాన్ని, ఉద్యమాన్ని తీవ్రం చేయాలి. యుపిఎ ప్రభుత్వానికి ఎన్నికల అనంతర పరిస్థితిలో మద్దతునివ్వడానికి దారితీసిన పరిస్థితులను వివరించాలి.

6. కేంద్ర, రాష్ట్ర సంబంధాల పునర్వ్యవస్థీకరణ, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, రాష్ట్రాలపై అప్పుల భారం తగ్గింపు సమస్యలపై ప్రచారం, ఉద్యమం నిర్వహించాలి. కేంద్ర పన్నుల ఆదాయాన్ని న్యాయంగా పునఃపంపిణీ చేయాలన్న డిమాండ్‌ను చేపట్టాలి. జాతీయ అభివృద్ధి మండలి అంతర్ రాష్ట్ర మండలి వంటి సంస్థలను బలోపేతం చేయాలి.

7. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేసేందుకుగాను ఉద్యమాలను ప్రజాభిప్రాయాన్ని పెంపొందించాలి.

8. చట్టసభలు, పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థల స్వతంత్ర పాత్రను పరిరక్షించేందుకు న్యాయ వ్యవస్థ చట్టసభల్లో అవాంఛిత జోక్యం చేసుకోవడంపట్ల అప్రమత్తతను పెంచేందుకై చొరవ తీసుకోవాలి.

9. మహిళలతోసహా ప్రజలందరినీ సమైక్య పరచి బాల్య వివాహాలను నిరోధించే కర్తవ్యానికి కదిలించాలి. వరకట్న వ్యవస్థను, మహిళలపై హింసాకాండను నిరోధించాలి. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ ఆలోచనా విధానం కోసం



విస్తారమైన కృషి జరగాలి.

10.మీడియాలో ఒక భాగం, పాలకవర్గాల రాజకీయ సంస్థలు, విచ్ఛిన్నకర వేర్పాటువాద శక్తులు నిరంతరంగా సాగించే దుష్ప్రచారాలకు, కవ్వింపు చర్యలకు వ్యతిరేకంగా అప్రమత్తత ప్రదర్శించాలి. ప్రజలను సమైక్యం చేయడం ద్వారా మనం ఈ శక్తులను తిప్పికొట్టాలి. కుహనా వామపక్ష రాజకీయాల వెనక దాక్కునే ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని బలోపేతం చేయాలి. ఈ శక్తులకు, వాటి కార్యకలాపాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, నిర్మాణ, పాలనా పరమైన చొరవ పెంచుకోవాలి. పార్టీ, వామపక్ష ఫ్రంట్‌లకు భద్రత కాపాడుకోవాలి.

11.వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వ విజయాలను ఎలుగెత్తిచాటాలి. అదే సమయంలో పార్టీ, ప్రజా రంగాలు కేవలం ప్రజారంజక ప్రయోజన పథకాలవైపుగానే గాక స్వయం సహాయక బృందాల వంటి వాటి వైపు కూడా దృష్టి పెంచుకోవాలి. సంపూర్ణ అక్షరాస్యత, సంపూర్ణ ఆరోగ్యం, స్వయం ఉపాధి వంటి కర్తవ్యాలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వంలోనూ, స్వయం పాలక సంస్థల్లోనూ వుండే కామ్రేడ్స్ పనిపై సమీక్షలు జరపాలి. వాటి ఆధారంగా ఆయా సంస్థల్లో వర్గ దృక్పథం గురించి, ప్రాధాన్యతల నిర్ణయం గురించి ప్రజానుకూల విధానాల గురించి ఆలోచించాలి. ప్రజా చొరవను పెంపొందించడంలో గ్రామాభివృద్ధి కమిటీలు, వార్డు కమిటీలు భాగం పంచుకోవాలి. విశాల వికేంద్రీకరణను పెంపొందించాలి. ప్రజలలో అత్యంత నిరుపేదలైన వారికి, నగరాలు గ్రామాల్లో అందరికన్నా పేదలైన వారికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి. పనిలో ప్రజానుకూల విధానాలు, పారదర్శకత పాటించాలి. జవాబుదారీతనంతోనూ, చెప్పే మాటల పట్ల అంకితభావంతోనూ పని చేయడం ద్వారా మనం ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నించాలి.

12.వామపక్ష ఐక్యత బలోపేతం కావాలి. మనం వామపక్ష రాజకీయాల పరిధికి వెలుపల వున్న శ్రామిక జనతను, ప్రజాతంత్ర జన బాహుళ్యాన్ని మనవైపును తిప్పుకోగలగాలి. వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలను వమ్ము చేసేందుకై రాజకీయంగా, సైద్ధాంతికంగా సన్నద్ధమైన పార్టీని విశాల ప్రజా సంబంధాలతో సహా నిర్మించాలి.

13. మార్క్సిస్టు సాహిత్యాన్ని అందజేసేందుకు జిల్లా కమిటీలు నిర్దిష్టమైన పథకాలు రూపొందించాలి. ప్రతి గ్రామంలో, సందులో గణశక్తి దినపత్రిక సర్క్యులేషన్ పెంచేందుకు కార్యక్రమాలు చేపట్టాలి. పత్రికను రోజూ అంటించేందుకై బోర్డులు, బల్లలు ఏర్పాటు చేయాలి. దేశ్‌హితైషి, మార్క్సిస్టు ప్రచారం, హిందీ స్వాధీనత, పీపుల్స్ డెమోక్రసీ, మార్క్సిస్టు పత్రికల సర్క్యులేషన్ ఎప్పటికప్పుడు పెంచేందుకై చొరవ తీసుకోవాలి. వీటికి సంబంధించిన బకాయిలు పేరుకుపోకుండా జాగ్రత్తపడాలి. శాఖలలో సాహిత్య బాధ్యునికి జిల్లా జోనల్ స్థానిక సబ్ కమిటీలతో సంబంధం వుండాలి. చందాదారుల సమావేశాలు జరపాలి.


14. ప్రజా సంఘాలను పెంపొందించడంలో, నిర్వహించడంలో కేంద్ర కమిటీ పత్రాన్ని అనుసరించాలి. ప్రజా రంగాల స్వతంత్రతను కాపాడడంలో మనం చురుకైన పాత్ర వహించాలి. ప్రజాతంత్ర పనివిధానం అనేది నిరంతర ప్రక్రియగా వుండాలి. ప్రజా పునాది విస్తరించుకుంటూ వుండాలి. ప్రతిరంగంలో లక్ష్యాలను శాతాలలో నిర్ణయించుకోవాలి. సంఘటితం కాని రంగాలలో, అసంఘటిత రంగాలలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యతనివ్వాలి. మహిళలు, శ్రామిక మహిళలు, యువజనులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగాలలో పథకం ప్రకారం చొరవ చూపడం అవసరం. వర్గ ప్రజా ఉద్యమాలను కొనసాగించాలి.

15. ప్రజా విప్లవ పార్టీ లక్షణాలను నిలబెట్టుకోవడానికి ఎనిమిది అంశాల పత్రాన్ని కొలబద్దగా పెట్టుకుని పార్టీలో చేర్చుకోవాలనే సూత్రాన్ని కచ్చితంగా పాటించాలి. ఏజీలను నిర్వహించడంలో మనం మరింత జాగ్రత్త వహించాలి. శాఖా సమావేశాలు నెలకు రెండు సార్లయినా జరగాలి. సబ్ కమిటీలు, ఫ్రాక్షన్ కమిటీలు మరింత క్రమబద్ధంగా సమావేశమవ్వాలి. స్థానిక జోనల్ జిల్లా కమిటీల స్థాయిలో సభ్యుల బాధ్యతలు మరింత నిర్దిష్టంగా రూపొందించాలి. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. దిద్దుబాటు కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడు నెలలకోసారి ఫారాలు పూర్తిచేస్తుండాలి. రాష్ట్ర స్థాయిలో సబ్‌కమిటీ సమావేశాలు మరింత క్రమబద్ధంగా జరగాలి. రాష్ట్ర కమిటీ సభ్యుల కర్తవ్యాలపై నిర్దిష్టమైన తనిఖీ వుండాలి.స్థానిక కమిటీల వరకూ కూడా ఆదాయం, ఆస్తుల ప్రకటనలు సభ్యత్వ పునరుద్ధరణ సమయంలో అందజేయాలి.

16. లెవీని నిర్ణీత లెక్కల ప్రకారం నిర్ణయించాలి. లెవీ క్రమం తప్పకుండా చెల్లించబడేలా చూడాలి. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకై సామూహిక వసూళ్లు సాగించాలి. అలాగే అమరులైన కామ్రేడ్స్ కుటుంబాలకు సహాయపడేపని కూడా వేగంగా జరగాలి. ప్రతిఏటా మేనెలలో ప్రతి కామ్రేడ్ సహాయనిధి కింద కనీసం అయిదు రూపాయలు డిపాజిట్ చేయాలి. సామూహిక వసూళ్లద్వారా పార్టీ నిధులు సేకరించే పద్ధతిని కొనసాగించాలి.

17.దిద్దుబాటు కార్యక్రమం సైద్ధాంతిక, రాజకీయ నిర్మాణ రంగాలలో కొనసాగించాలి. కమ్యూనిస్టేతర ధోరణులకు, వినియోగదారీ తత్వానికి, మురాతత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలి. పార్టీ క్రమశిక్షణను, ఐక్యతను మరింత బలోపేతం చేయాలి.

18. పార్టీలో, ప్రజా రంగాలలో హోల్‌టైమర్ల సంఖ్యను పెంచేందుకై ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి. వారికి కనీస వేతనాలు నిర్ణయించి క్రమబద్ధంగా చెల్లించాలి. శ్రామికులు, మహిళలు, షెడ్యూల్డు కులాల తెగల వారు, భాషా, మతపరమైన మైనారిటీలలో పనికి దోహదపడేందుకై ఆ తరగతుల నుంచి మరింత మంది హోల్‌టైమర్లను చేర్చుకోవాలి. అదే సమయంలో యువత నుంచి హోల్‌టైమర్లను రాబట్టే విషయమై గట్టి శ్రద్ధ పెట్టాలి. సమర్థులైన వృత్తి విప్లవకారులను తయారు చేసేందుకు వీలుగా వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలి, తీర్చిదిద్దాలి.




# రాజకీయ నిర్మాణ నివేదిక....

## త్రిపుర

త్రిపుర శాసనసభకు 2003వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో వామపక్ష సంఘటన ఘన విజయాన్ని సాధించింది. మార్క్సిస్టు పార్టీ 17వ రాష్ట్ర మహాసభ అనంతరం చోటు చేసుకున్న అత్యంత ప్రధానమైన సంఘటన ఇది. కేంద్రంలో బిజెపి నేతృత్వాన సంకీర్ణ ప్రభుత్వం ఉండటంతో పాటు రాష్ట్రంలో నిరాశతో బరితెగించిన తీవ్రవాదుల హింసాయుత అత్యాచారా లొకవైపున, అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికై కాంగ్రెస్ పార్టీ ఉన్మత్త ప్రయత్నాలొకవైపున రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. గతంలో ఐ.పి.ఎఫ్.టి.గా ఉన్న ఐ.ఎన్.పి.టి.తో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకున్నది. నిషేధానికి గురైన ఎన్.ఎల్.ఎఫ్.టి.కి ఈ సంస్థ రాజకీయ ముసుగు తప్ప మరొకటి కాదు. ఇంతకుముందు అంటే 2000వ సంవత్సరంలో ఓటర్లను తుపాకులతో బెదిరించి త్రిపుర గిరిజన ప్రాంతాల స్వయం ప్రతిపత్తి జిల్లా మండలిని ఐ.ఎన్.పి.టి. హస్తగతం చేసుకున్నది. ఇదే పద్ధతిలో శాసనసభను కూడా చేజిక్కించుకోవడానికి పథకం వేసింది. అనేకరకాలైన తప్పుడు ఆరోపణలను చేయడం ద్వారా రక్షణ దళాలను, ప్రభుత్వ ఉద్యోగులను నైతికంగా దెబ్బతీయడానికి కాంగ్రెస్- ఐ.ఎన్.పి.టి. కూటమి ప్రయత్నించింది. ఎన్నికల తరుణంలో మార్క్సిస్టు పార్టీకి చెందిన అనేక మంది కార్యకర్తలు, నాయకులు హత్యకు గురయ్యారు. తీవ్రవాదులు అనేకమంది ఆదివాసీ మహిళలను మానభంగం చేసి హత్యచేశారు. ఐ.ఎన్.పి.టి. నాయకుడు బిజయ్ హ్రాంఖ్వాల్ తన జెనీవా ప్రసంగం ద్వారా జాతి వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాడు.

ఏది ఏమైనప్పటికీ గిరిజన, గిరిజనేతర ప్రజలు వీరి అపవిత్ర పొత్తును ఆమోదించలేదు. కాగా పార్టీ తరపున త్రిపుర ఉపజాతి గణముక్తి పరిషత్ తదితర ప్రజాసంఘాలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించాయి. వామపక్ష ప్రభుత్వం చేపట్టిన విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కనుకనే వారు తిరిగి వామపక్ష ప్రభుత్వాన్నే ఎన్నుకున్నారు. చొరబాటుదారులను రక్షణదళాలు సమర్ధవంతంగా అడ్డుకోవడంతో పాటు కొత్తగా ఎస్.పి.ఓ.ను ఏర్పాటు చేయడంతో ప్రజలలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కాంగ్రెస్-ఐ.ఎన్.పి.టి.ల అపవిత్ర పొత్తు నచ్చని ఆ పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు కొందరు వామపక్ష శిబిరంలో చేరారు. బిజయ్ హ్రాంఖ్వాల్ చేసిన జాతి వ్యతిరేక జెనీవా ప్రసంగం యావత్ రాష్ట్ర ప్రజలకు ఆగ్రహాన్ని కల్గించింది. అంతేకాక 1988 నాటి శాసనసభ ఎన్నికలలో అప్పటి వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించేందుకై రాజీవ్‌గాంధీ-హ్రాంఖ్వాల్ మధ్య కుదిరిన రహస్య ఒప్పందాన్ని కూడా ఈ ప్రసంగం గుర్తుకు తెచ్చింది. ఈ విషయంలో పార్టీ, వామపక్ష ప్రభుత్వమూ, ప్రజాసంఘాలు చేసిన విస్తృత ప్రచారం ప్రధానమైన పాత్రను నిర్వహించింది. తత్ఫలితంగా అణగారిన ప్రజలు కూడా నిశ్చల విశ్వాసంతో ఎన్నికల బరిలోకి దిగారు. 2002 సెప్టెంబరు 14న జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శన ఈ విషయాన్ని నిరూపించింది. ఈ ప్రదర్శనలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పోడు వ్యవసాయదారులు, మధ్యతరగతి జనులు వేలాదిగా పాల్గొన్నారు. పార్టీ కేంద్రకమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా త్రిపుర సంఘీభావ దినాన్ని ప్రజలు పాటించారు.

వామపక్ష సంఘటన 41 స్థానాలను గెలుచుకొని 50.9 శాతం ఓట్లను సంపాదించుకొన్నది. పార్టీల వారీగా చూస్తే మార్క్సిస్టు పార్టీకి 38, సిపిఐకి 1, ఆర్ఎస్‌పికి 2 స్థానాలు దక్కాయి. కాగా కాంగ్రెస్‌కు 13, ఐ.ఎన్.పి.టి.కి 6 స్థానాలు లభించగా, బిజెపి-తృణమూల్ కాంగ్రెసు కూటమికి కేవలం 1.75 శాతం ఓట్లు లభించాయి. ఎస్.టి., ఎస్.సి.లకు రిజర్వు చేసిన మొత్తం 27 స్థానాలు కాంగ్రెస్-ఐ.ఎన్.పి.టి.కే లభించగలవని తీవ్రవాదులు, వారి పోషకులు చెప్పుకొచ్చినప్పటికి వీటిలో 19 స్థానాలు వామపక్ష సంఘటనకు దక్కాయి. వీటిలో 13 స్థానాలు ఎస్.టి.లకు రిజర్వు చేసినవి. మరో 4 ఎస్.టి. స్థానాలలో కొద్దిపాటి తేడాతో పార్టీ ఓడిపోయింది. కాగా ఎస్.సి.లకు రిజర్వుచేసిన 7 స్థానాలలో వామపక్ష సంఘటనకు 6 స్థానాలు లభించాయి.



శాసనసభ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర పరిస్థితిలో బ్రహ్మాండమైన మార్పును తెచ్చాయి. కాంగ్రెస్ - ఐ.ఎన్.పి.టి. కూటమి ఓడిపోవడంతో దాదాపు 25,000 కుటుంబాలు ఈ కూటమిని విడిచిపెట్టి వామపక్ష సంఘటన వైపుకు వచ్చాయి. తీవ్రవాదులలో నిరాశా నిస్పృహలు పెరగటంతో లొంగుబాటులు ఎక్కువయ్యాయి. దీనికి తోడు రక్షణ దళాలు సరిహద్దు చొరబాట్లను తిప్పికొట్టగలిగాయి.


ఇలాంటి పరిస్థితిలో స్వయం ప్రతిపత్తి మండలిలో ఐ.ఎన్.పి.టి. కూటమి మారింది. ఏడుగురు సభ్యులు దానికి రాజీనామాను ఇచ్చి ఎన్.ఎస్.పి.టి.ని ఏర్పాటు చేసుకున్నారు. స్వయంప్రతిపత్తి మండలి ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికీ, అవినీతిని పారద్రోలడానికీ, పారదర్శక పరిపాలనను సాగించటానికీ తోడ్పాటునందించవలసిందిగా వీరు వామపక్ష

సంఘటనను కోరారు. రాష్ట్రంలో శాంతి-అభివృద్ధి సాధన నిమిత్తం ఎన్.ఎస్.పి.టి.కి వామపక్ష సంఘటన తోడ్పాటునందించింది.

శాంతి, సామరస్యం, జాతీయ సమగ్రతలకు అనుకూలంగా మార్క్సిస్టు పార్టీ, ప్రజాసంఘాలు విస్తృత ప్రచారాన్ని చేశాయి. ఈ రకమైన ప్రచారం గిరిజన ప్రాంతాలన్నింటా సాగింది. గిరిజనుల అభివృద్ధి కోసం వామపక్ష సంఘటన ప్రత్యేకమైన చర్యలను చేపట్టింది. ఇదే సమయంలో భూటాన్ దళాలు తమ భూభాగంలోని భారత తీవ్రవాదుల స్థావరాలపై పెద్దఎత్తున దాడిచేశాయి. దీనివల్ల త్రిపుర తీవ్రవాదులకు గట్టి దెబ్బే తగిలింది. త్రిపురలో వున్న రక్షణ దళాలు కూడా తీవ్రవాదులకు వ్యతిరేకంగా చర్యలను చేపట్టాయి. త్రిపురతో సహా ఈశాన్య ప్రాంతాలలోని తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్ పత్రికలలో సైతం ఇలాంటి డిమాండ్లే వచ్చాయి. బంగ్లా శిబిరాలలో తీవ్రవాదుల మధ్య సాయుధ సంఘర్షణలు జరిగాయి. ఎన్.ఎల్.ఎఫ్.టి. (ఎన్.బి.గ్రూపు) తో ఆర్నెల్ల కాల్పుల విరమణ ఒప్పందాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుదుర్చుకున్నాయి. మంతు కొలోయ్ నేతృత్వంలోని ఎన్.ఎల్.ఎఫ్.టి. (బి.ఎం.గ్రూపు) రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయింది. పార్లమెంటు ఎన్నికల అనంతరం నయనబాషి మినహా మిగిలిన వారు తమ వద్ద వున్న ఆయుధాలను ప్రభుత్వానికి అప్పచెప్పారు. నిషేధిత ఎ.టి.టి.ఎఫ్ (టైగర్) గ్రూపుకు చెందినవారు సైతం ఆయుధాలను అప్పచెప్పారు. ఈ క్రమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది.

త్రిపురలోని రెండు పార్లమెంట్ స్థానాలలోనూ మార్క్సిస్టు పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలిచారు. పశ్చిమ త్రిపుర నియోజకవర్గంలో 70.86 శాతం ఓట్లు , తూర్పు త్రిపుర నియోజకవర్గంలో 66.48 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇప్పటి వరకు త్రిపురలో జరిగిన పార్లమెంట్ స్థానాలలో వామపక్ష సంఘటనకు మునుపెన్నడూ ఇన్ని ఓట్లు పోలు కాలేదు. మిగిలిన పార్టీల అభ్యర్థులకు డిపాజిట్‌లు కూడా దక్కలేదు. కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్న ఐ.ఎన్.పి.టి. ఈ ఎన్నికలలో బిజెపితో పొత్తు పెట్టుకొన్నది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మూడంచెల పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. కేంద్రంలోని యు.పి.ఎ. ప్రభుత్వంలో తనకున్న నాయకత్వ స్థానాన్ని ఉపయోగించి ఈ ఎన్నికలలో ప్రయోజనం పొందటానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని స్వార్థపరశక్తులు వామపక్ష వ్యతిరేక పార్టీలకు ఏదో ఒక విధంగా మద్దతును ప్రకటించాయి. ఎన్నికల సందర్భంగా వామపక్ష వ్యతిరేక శక్తుల మద్దతు లభించడంతో సరిహద్దు ప్రాంతంలో బెదిరింపులు, దొంగతనాలు పెరిగాయి. పశ్చిమ త్రిపురలోని సోనమురి డివిజన్‌కు చెందిన వెలూర్చర్ పంచాయతీ సమితికి పోటీ చేస్తున్న వామపక్ష సంఘటన అభ్యర్థిని హతమార్చే ఉద్దేశంతో బందిపోటు దొంగలు ఆయన ఇంటిపై దాడి చేశారు. సదర్ సబ్ డివిజన్‌లోని బర్కతల్ ప్రాంతంలో టైగర్ మురాకు చెందిన తీవ్రవాదులు హంతక దాడులను సాగించారు. అయినా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే ఉత్తర త్రిపురలోని కైలాసహర వార్డుకు జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు తన రక్షణ సిబ్బందితో కలసి చేసిన దాడిలో మార్క్సిస్టు పార్టీ కార్యకర్తతో పాటు ఒక పోలీసు అధికారి కూడా మరణించారు. దానివల్ల కైలాస్‌హరలో ఉద్రిక్తత ఏర్పడింది. దీనితో కాంగ్రెస్ అధ్యక్షుడిని పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానాలు తిరస్కరించడంతో కైలాసహర, అగర్తలలో అల్లర్లను సృష్టించేందుకు కాంగ్రెస్‌లోని ఒక గ్రూపు ప్రయత్నించింది.

1999 నాటి ఎన్నికలలో కన్నా వామపక్ష సంఘటనకు అదనపు స్థానాలు లభించగా కాంగ్రెస్‌కు తగ్గాయి. రాష్ట్రంలో మొత్తం 5,252 గ్రామ పంచాయతీ స్థానాలు ఉండగా వామపక్ష సంఘటనకు 4,816 స్థానాలు, కాంగ్రెస్‌కు 487 స్థానాలు లభించాయి. 513 పంచాయతీలకు గాను వామపక్ష సంఘటనకు 476, కాంగ్రెస్ పార్టీకి 27 పంచాయతీలు దక్కాయి. మొత్తం 299 పంచాయతీ సమితి స్థానాలకు గాను వామపక్ష సంఘటనకు 285, కాంగ్రెస్‌కు 13 లభించాయి. రాష్ట్రంలోని మొత్తం 23 పంచాయతీ సమితుల్లోనూ వామపక్ష సంఘటనే గెలిచింది. అదేవిధంగా మొత్తం నాలుగు జిల్లా మండళ్ళను వామపక్ష సంఘటన చేజిక్కించుకొన్నది. మండలి స్థానాలు 82 కాగా వాటిల్లో ఒకటి మాత్రం కాంగ్రెస్‌కు దక్కింది, మిగిలిన 81 స్థానాలు వామపక్ష సంఘటనకు దక్కాయి.



మునుపటి బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక దాడుల కారణంగా త్రిపుర బాగా దెబ్బతిన్నది. సామాజిక సంక్షేమ పథకాల కత్తిరింపు, ప్రజా పంపిణీ వ్యవస్థకు తూట్లు పొడవటం, గ్రామీణ - వ్యవసాయ రంగాలకు కేంద్ర ప్రభుత్వ కేటాయింపులు తగ్గటం, వ్యవసాయ - సేవా రంగాలలో సబ్సిడీలను రద్దు చేయటం లేదా తగ్గించడం వంటి కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడింది. రాష్ట్రంపై కఠినమైన షరతులు వచ్చి పడ్డాయి. రాష్ట్రం తన ఆదాయాన్ని పెంచుకొని, వ్యయాన్ని తగ్గించుకొనవలసి వచ్చింది. ప్రభుత్వ విభాగాలలో నియామకాలు ఆగిపోయాయి. త్రాగునీరు, విద్యుత్, విద్యా రంగాలకు సబ్సిడీ తొలగిపోయింది. దానికి తోడు కేంద్ర పథకాలకు రాష్ట్రాల మ్యాచింగ్ గ్రాంట్స్ పెరిగాయి. గ్రాంట్లకు బదులు అధిక వడ్డీకి రాష్ట్రాలు అప్పు తీసుకోవలసి రావడం అనివార్యమైంది. రాష్ట్ర ఖజానాకు గణనీయమైన ఆదాయంగా ఉండే చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీ రేటు తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితిలో ఎంతగా ఆర్థిక క్రమశిక్షణను పాటించినప్పటికీ ఇతర రాష్ట్రాల విషయంలో వలెనే త్రిపురకు కూడా రుణభారం పెరిగింది. వీటికి తోడు చొరబాట్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు, అలానే వరదలను, అంటువ్యాధులను నివారించేటందుకు చాలా ఎక్కువగా ఖర్చు చేయవలసి వస్తున్నది. కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. తద్విరుద్ధంగా పదే పదే పెట్రోలియం, డీసెల్, వంట గ్యాసు వంటి వాటి ధరలు పెరగడంతో రాష్ట్రంపై మరింత భారం పడుతున్నది.

పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో ఐ.ఎస్ ఐ. మద్దతు ఉన్న మత ఛాందసవాద, తీవ్రవాద కార్యకలాపాలు పెచ్చు మీరుతున్నాయి. లౌకిక ప్రజాస్వామ్య శక్తులపై దాడులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రగతిశీల, సాంస్కృతిక కార్యకర్తలపై బాంబు దాడులు జరిగాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షం నిర్వహించే బహిరంగ సభపై గ్రెనేడ్

దాడులు సాగాయి. అనేక ఆయుధాలను పోలీసులు చేజిక్కించుకున్నారు. అయితే ఇలాంటి ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఈశాన్య భారత ప్రాంతానికి రవాణా అవుతున్నట్లు బంగ్లాదేశ్ పత్రికలు పేర్కొన్నాయి. బంగ్లా రక్షణ దళాలు అనేకమంది తీవ్రవాదులను నిర్బంధించాయి. అయినప్పటికీ తమ భూభాగంలో భారతదేశ తీవ్రవాదుల స్థావరాలేవీ లేవని బంగ్లా ప్రభుత్వం చెపుతున్నది. ఇటీవలి కాలంలో త్రిపురతో సహా పలు ఈశాన్య రాష్ట్రాలలో తీవ్రవాదులు దాడి చేసి అనేక మందిని కిరాతకంగా హత్య చేశారు.

బంగ్లాదేశ్‌లో ఉంటూ త్రిపురలోకి చొరబడుతున్న తీవ్రవాదులను నిరోధించేటందుకై బంగ్లాదేశ్ – త్రిపురల మధ్య ఉన్న 856 కిలోమీటర్ల సరిహద్దులో ఇనుప కంచెను నిర్మించవలసిందిగా మన పార్టీతో పాటు వామపక్ష సంఘటన కేంద్రానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా అన్ని కాలాలలోనూ వాహనాల రాకపోకలకు వీలుగా సరిహద్దు ప్రక్కన రహదారిని నిర్మించాలని కూడా వామపక్ష సంఘటన ప్రభుత్వం ఎప్పటి నుండో కోరుతున్నది. ఎంతోకాలం జాప్యం తరువాత రెండేళ్ళ క్రితం కంచె నిర్మాణం ప్రారంభమైంది. అయితే భారత భూభాగంలో ఈ కంచె దాదాపు 150 మీటర్ల లోపలికి ఉండటంతో అనేక ఇళ్ళు, గృహాలు కంచెకు వెలుపల ఉండిపోయాయి. కేంద్ర ప్రభుత్వ దృష్టికి దానిని తేవడం జరిగింది. శాసనసభ కూడా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఢిల్లీకి అఖిల పక్ష బృందాన్ని పంపాలని కూడా నిర్ణయమైంది. కంచె నిర్మాణం కారణంగా దెబ్బతిన్న వారికి పునరావాస సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ వామపక్ష సంఘటనకు చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే వామపక్ష వ్యతిరేక శక్తులు కొన్ని ఈ వ్యవహారంలో దుష్ప్రచారాన్ని చేస్తున్నాయి.

సామ్రాజ్యవాద శక్తుల విద్రోహ కార్యకలాపాలను నిరోధించేలా మన పొరుగునే ఉన్న బంగ్లాదేశ్‌లోని అన్ని పార్టీలకు, ప్రజలకు నచ్చచెప్పేందుకు మనం అన్ని రకాల ప్రయత్నాలు చేశాము. బంగ్లాదేశ్, భారత్‌ల మధ్య, ప్రత్యేకించి ఈశాన్య భారత ప్రజలతో సాంస్కృతిక, వాణిజ్య, ఆర్థిక రంగాలలో పరస్పర సహకారాన్ని, ఇచ్చిపుచ్చుకోవడాన్ని పటిష్టం చేయవలసి ఉంది. భారతీయ పౌరులకు డబుల్ – ఎంట్రీ వీసాను మంజూరు చేయాలని నిర్ణయించడం ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వం సానుకూల చర్యను చేపట్టింది. భారత్ – బంగ్లా ప్రజల మధ్య ఎంత ప్రగాఢ సంబంధాలు ఏర్పడితే అంతగా సామ్రాజ్యవాద శక్తుల విద్రోహ చర్యలు తగ్గుతాయి.


పదిహేడవ రాష్ట్ర మహాసభ, పార్టీ మహాసభ, 2003 నాటి శాసనసభ ఎన్నికల అనంతరం తీసుకున్న నిర్ణయాలను 2004 మే 4 – 5 తేదీలలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సమీక్షించి రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ, పాలక రంగాలలో నిర్దిష్టమైన బాధ్యతల అమలుకు సంబంధించి ఒక తీర్మానాన్ని ఆమోదించటం జరిగింది. రాష్ట్ర 18వ మహాసభ దానిని సమీక్షించవలసి వుంది.

రాజకీయ రంగం

**సామ్రాజ్యవాద వ్యతిరేకత :** గత మూడేళ్ళ కాలంలో వివిధ ప్రజాసంఘాలు సామ్రాజ్యవాద వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక నిరసన కార్యక్రమాలను చేపట్టాయి. ఇలాంటి వాటిల్లో హిరోషిమా – నాగసాకి దినం పాటింపు, ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ దాడిని, ఇరాక్‌కు భారత సైన్యాన్ని పంపించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కార్యక్రమాలు చేపట్టడం, వెనిజులాలో అమెరికా జోక్యానికి వ్యతిరేకత, పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి మద్దతుకు, షరోన్ భారత పర్యటనకు వ్యతిరేకత, కేంద్రప్రభుత్వం చేపడుతున్న అమెరికా అనుకూల, ఇజ్రాయెల్ అనుకూల విధానాలకు నిరసన వంటి కార్యక్రమాలను ప్రజాసంఘాలు చేపట్టాయి. ముందుగా సన్నాహాలు చేయకపోవడం వలన 2004వ సంవత్సరంలో అన్ని చోట్లా హిరోషిమా – నాగసాకి దినాన్ని పాటించ లేకపోయాము. అంతకు రెండేళ్ళ ముందు ప్రభుత్వ మద్దతుతో ఈ దినాన్ని పాటించాము.

అక్షరాస్యతా ఉద్యమంతో ముడిపేసి కొనసాగిస్తున్న విద్యా కార్యక్రమం ఇప్పటికింకా ఉద్యమ రూపాన్ని సంతరించుకోలేదు. ఈ విషయంలో పార్టీ, ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న పాత్ర విభిన్నమైనది. 2005 ఆగస్టు నాటికి సంపూర్ణ అక్షరాస్యతను సాధించే లక్ష్యంతో ప్రభుత్వ స్థాయిలో ఒక ప్రత్యేక కార్యక్రమం రూపు దాల్చింది. పూర్తి స్థాయిలో నిర్మాణాన్ని క్రింది నుంచి పై వరకు సరిదిద్దటం జరిగింది. కొన్ని చోట్ల కార్యక్రమాలు సంతృప్తికరంగా అమలు జరుగుతున్నప్పటికీ ప్రత్యేకించి గిరిజన ప్రాంతాలలో చెప్పుకోదగిన అభివృద్ధి లేదు.

చొరబాట్లకు వ్యతిరేకంగాను శాంతి – సామరస్యాలకు అనుకూలంగాను రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఉపజాతి గణముక్తి పరిషత్ పిలుపు మేరకు గిరిజన ప్రాంతంలో పెద్ద ఎత్తున బహిరంగ సభలు జరిగాయి. చొరబాట్లకు వ్యతిరేకంగాను, శాంతి – సామరస్యాల సాధన కోసం మహిళా సంఘాల చొరవతో అనేక కార్యక్రమాలు చోటుచేసుకొన్నాయి. మైదాన ప్రాంతాలలో కూడా పలు కార్యక్రమాలు సాగాయి. పార్టీ, ప్రజాసంఘాలు చేసిన ప్రచారం కారణంగా తీవ్రవాదులు ఏకాకులుగా మారారు.



వామపక్ష ప్రభుత్వం నిర్వహించిన బ్లాక్‌ల వారీ శాంతి సమావేశాలు జయప్రదంకావటం వెనుక పార్టీ కృషి ఎంతో ఉంది. ప్రజల మధ్య ఐక్యతను భగ్నం చేయాలని చూసిన స్వార్థపరశక్తుల ప్రయత్నాలు ఫలించలేదు. జాతుల మధ్య ఐక్యత కూడా స్థిరంగా నిలిచింది.


ప్రజా మద్దతును పెంచాలన్న రాష్ట్ర కమిటీ పిలుపుకు స్పందించి పార్టీ యావత్తు తత్సంబంధిత కృషిలో నిమగ్నమైంది. దిగువ స్థాయి ప్రజల వరకు పార్టీ కార్యకర్తలు వెళ్ళారు. ప్రతి కుటుంబాన్ని కలుసుకొన్నారు. పార్టీకి పోలయిన ఓట్లు, అలానే ప్రజా సంఘాల సభ్యత్వమూ బాగా పెరిగింది. సాధారణ ప్రజలు ప్రతిపక్షాన్ని తిరస్కరించి పార్టీతో కలిసి వచ్చారు. పనిలో కొంతమేరకు మందకొడితనం ఉన్నది. రాజకీయ నిర్మాణ నివేదికలో ఈ లోపాన్ని గురించి వివరణ వున్నది. పార్టీ పటిష్టతకు మన ప్రయత్నాలను పునరుజ్జీవింప చేయడానికి ఇదొక కారణం.

# రాజకీయ నిర్మాణ నివేదిక...

# తమిళనాడు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తమిళనాడు రాష్ట్ర 17వ మహాసభ రాష్ట్రంలోని పరిస్థితులను ఈ విధంగా పేర్కొంటోంది. "కేంద్రప్రభుత్వ అనుసరిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశిత విధానాల కారణంగా దేశంలోని పరిశ్రమ, సర్వీస్ సెక్టార్, వ్యవసాయం, వాణిజ్యం... ఇలా అన్ని రంగాలూ తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారీ, చిన్న తరహా పరిశ్రమలు, ప్రభుత్వ రంగం, సంప్రదాయిక రంగాల్లోని లక్షలాది కార్మికలోకం, చిన్న చిన్న వ్యాపారాలు భారీగా నష్టపోయాయి. సామాన్య ప్రజలు వాడుకునే, ఉపయోగించే అన్ని రకాల వస్తువులు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న అన్నా డిఎంకె ప్రభుత్వం ఎన్నికలప్పుడు ప్రజలకిచ్చిన వాగ్దానాల నుండి వెనక్కు మళ్లుతోంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలనే జయలలిత ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది". కోయంబత్తూరులో 2002లో జరిగిన పార్టీ మహాసభ గుర్తించిన ఆ విధానాల నష్టాలపై ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉన్నాము. గత మూడేళ్ల కాలంలో ప్రభుత్వ తీరులో ఎలాంటి మార్పూ లేదు.

భారీ పరిశ్రమల విషయానికొస్తే, ఆ రంగంలో సంక్షోభం అదే విధంగా పురోగతి మిళితమై కన్పిస్తాయి. ప్రత్యేకించి తమిళనాడులోని బలంగా ఉన్న వస్త్ర పరిశ్రమ, ఇంజనీరింగ్, సిమెంట్, సుగర్ వంటి రంగాల్లో ప్రగతి చూడవచ్చు. ఆధునిక, సంప్రదాయక రంగాల్లో ఈ ధోరణి ప్రదర్శితమవుతోంది. ఆధునిక సదుపాయాలు ఉన్న యూనిట్లు లాభాలు ఆర్జిస్తున్నాయి. ఎందుకంటే అదనపు పెట్టుబడి, ఆధునిక యంత్ర సామగ్రి, తక్కువ కార్మిక శక్తి, తక్కువ వేతనాలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు... తదితర కారణాలతో కార్మిక వ్యయం గణనీయంగా తగ్గిపోతోంది. మొత్తం మీద ఎక్కువగా ఉపాధి కల్పించకుండానే ఈ రంగాలు అభివృద్ధి సాధిస్తున్నాయి. పాత యంత్రాలు వాడుతున్న యూనిట్లు కొన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఖాయిలా పడటం, రిట్రెంచ్‌మెంట్లు, మూసివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రాష్ట్రంలోని సహకార సంస్థలు ప్రయివేటీకరణను చవిచూస్తున్నాయి. వాటి ప్రజాస్వామిక నిర్మాణరూపం దెబ్బ తింటోంది. అవినీతి, అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ప్రాపకం వాటిపై దుష్ప్రభావాలు చూపుతోంది. లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధి చూపుతున్న చిన్నతరహా పరిశ్రమ రంగం నియంత్రణల ఎత్తివేత, రక్షణ లేమి వంటి కారణాలతో దారుణ పరిస్థితులను చవిచూస్తోంది. సంప్రదాయక రంగాలైన చేనేత, అగ్గిపెట్టెల పరిశ్రమ, ఉప్పు తయారీ పరిశ్రమ, నిర్మాణరంగం గురించి మాట్లాడుకునేటప్పుడు కూడా ఇవే చెప్పుకోవాలి.



తమిళనాడులో వస్త్ర పరిశ్రమ ఒక ప్రధానమైన రంగం. 2005 జనవరిలో కోటా వ్యవస్థను రద్దు చేస్తూ తీసుకు వచ్చిన మార్పుల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయడం ఇప్పటికీ కష్టంగానే ఉంది. అయితే మారిన వ్యవస్థ ఎంతో కొంత లబ్ధి పొందేందుకు రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమ వర్గాలు సిద్ధమవుతున్నాయి. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ రంగాలు ఇటీవలి కాలంలో పురోగతి సాధించాయి. అనేక మందికి అవి ఉపాధి కల్పించాయి. అయితే అంతర్జాతీయ ఒడి దుడుకుల ప్రభావం వీటి మీద ఎక్కువగా ఉంటోంది. సర్వీస్ సెక్టార్‌లో విప్లవాత్మకమార్పులు చిల్లర వ్యాపారాల్లోని పెద్ద కంపెనీలకు ఉపయోగకరంగా ఉంటున్నాయి. పోలీసు, ఫైర్ సర్వీసుల్లో మినహాయించి అన్ని ప్రభుత్వ సర్వీసులలో నియామకాలు నిలిపివేశారు. మొత్తంగా చూసినప్పుడు ఉపాధి రహిత అభివృద్ధి రాష్ట్రంలో కన్పిస్తోంది. సామాజిక రంగం నుండి ప్రభుత్వం వెనక్కు తగ్గిన కారణంగా ముందుకొచ్చిన సమస్యలు వీటికి అదనం.

ఒక వైపు వరుస కరువులు, మరోవైపు కావేరీ డెల్టా రైతులకు వరద దెబ్బ కారణంగా రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టున్నారు. అపసవ్యంగా ఉన్న సేకరణ విధానాలు, ముడి చెరుకు దిగుమతి చేసుకోవడం, ఉత్పాదకాల వ్యయం పెరగటం కారణంగా చెరకు, పత్తి రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. అప్పులు, వడ్డీ భారం వంటివి చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికుల నడ్డి విరుస్తున్నాయి. ఫలితంగా వలస పోవడం తప్ప వాళ్ల మనుగడకు మరో మార్గం లేకపోయింది. మరోవైపు ప్రభుత్వం కూడా సాగుదార్లను తరిమేయడం, పెద్ద పెద్ద కంపెనీలకు ఆ భూములను అప్పగించడం వంటి చర్యలకు పాల్పడుతోంది. ఇవి

రైతుల పాలిట శాపాలయ్యాయి. రెక్కల కష్టం నమ్ముకుని బతికే శ్రామికులకు ఎలాంటి సంక్షేమ పథకాలూ అందుబాటులో లేవు. ఇటీవల సంబవించిన సునామీ మత్స్యకారులు, భూమిలేని పేదల జీవితాలను అతలాకుతలం చేసింది.

విద్యా, వైద్యం, తాగునీటి రంగాల్లో ప్రయివేటీకరణను ప్రోత్సహించడం జరుగుతోంది. విద్యారంగం మొత్తంగా ప్రయివేటు చేతుల్లోకి పోతోంది. తమ పౌర బాధ్యతలను ప్రయివేటు సంస్థలకు అప్పగించేలా పంచాయితీ సంస్థలపై ఒత్తిళ్లు పెరుగు తున్నాయి. వీటన్నిటికి తోడుగా నిరుద్యోగం పెరుగు తోంది. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ప్రజాతంత్ర హక్కులపై దాడులు జరుగుతున్నాయి. మత, కుల భావనలు పెరగడం, మహిళలపై దాడులు పెచ్చరిల్లడం, బాల కార్మిక వ్యవస్థ, వినియోగదారితత్వం పెరగడం వంటి దుర్లక్షణాలు తమిళనాడు ప్రజలు ఎదుర్కొం టున్నారు. వ్యవసాయ కార్మికులు సహా ఇతర అసంఘటిత రంగ కార్మికులు కూడా సంక్షోభంలో ఉన్నారు. కొద్దిపాటిగా ఉన్న సంఘటిత రంగంలో కార్మికుల ప్రజాతంత్ర హక్కుల మనుగడకు ప్రమాదం ఏర్పడింది. గతంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేసిన సందర్భంగా ఈ విషయం మరింత స్పష్టమైంది. రాజకీయ పార్టీల నాయకులు, శాసనసభ్యులు, పాత్రికేయులపై దాడులు జరుగుతున్నాయి. న్యాయవ్యవస్థ కూడా ప్రభుత్వంతో చేతులు కలిపి ప్రజాస్వామిక హక్కులను అణిచివేస్తున్న పరిస్థితి. ఇదంతా ప్రపంచీకరణ అసలు స్వరూపం.

**పర్యావరణ ఆందోళనలు**


సుస్థిర అభివృద్ధిని ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తారు. అయితే, తమిళనాడులో జల, చమురు వనరులకు తీవ్ర నష్టం జరుగుతోంది. జల వనరులు పెద్ద ఎత్తున కాలుష్యమవుతున్నాయి. సాగు భూములు పాడవుతున్నాయి. తీరం వెంబడి రొయ్యల సాగుకు సుప్రీం కోర్టు అనుమతించడం ఇన్‌ల్యాండ్ రైతులకు పెద్ద దెబ్బ. ఈ సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం ప్రయివేటీకరణపట్ల ఉత్సుకతను ప్రదర్శిస్తోంది.

**రాజకీయ పరిస్థితి**

గత మహాసభ తర్వాతి కాలంలో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి వేగంగా మారిపోయింది. అన్నా డిఎంకె ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి ప్రజల హక్కులు కాపాడుకోవాల్సి ఉందని గత మహాసభ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం ఏవైతే ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందో అవే విధానాలను ఇక్కడ జయలలిత ప్రభుత్వం అమలు చేస్తోందని గత మహాసభ రాజకీయ తీర్మానం పేర్కొంది. డిఎంకె రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. కేంద్ర ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా కూడా ఉంది. అయితే డిఎంకె విధానాలు కూడా ఇవే. కోయంబత్తూరులో జరిగిన మహాసభ రాష్ట్ర ప్రజల ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాటాలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తోటి వామపక్ష పార్టీ అయిన సిపిఐని, కాంగ్రెస్‌పార్టీని, కలిసొచ్చే ఇతర ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులను సమీకరించాలని పేర్కొంది. దేశ ఆర్థిక వ్యవస్థను, సార్వభౌమత్వానికి భంగకరంగా ఉన్న వేదికల్లో డిఎంకె, ఎండిఎంకె, పిఎంకె లాంటి శక్తులు ఉండకూడదని, ఆ పార్టీలు ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం నుండి వైదొలగాలని అదే తీర్మానం పేర్కొంది. ఇదంతా జరిగి మూడేళ్లు గడిచాయి. పార్టీల వైఖరుల్లో స్పష్టమైన మార్పును ఇప్పుడు గమనించవచ్చు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడంలో ప్రస్తుతం జయలలిత ప్రభుత్వం అగ్రభాగాన ఉంది. విస్తృత జనబాహుళ్యం నుండి వేరుపడింది. డిఎంకె, ఎండిఎంకె, పిఎంకె 2003 డిసెంబర్‌లో ఎన్డీయే నుండి బయటకు వచ్చాయి. ఆ కాలంలో మన పార్టీ కీలక పాత్రను పోషించింది. "విధానపరమైన అంశాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షాలతో కలిసి పనిచేయడం సాధ్యం కాదు" అనేది మన దృఢవైఖరి. కేంద్రంలోని సంకీర్ణ కూటమిలో భాగస్వామిగా ఉంటూనే డిఎంకె రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు నాయకత్వం వహించింది. ఆర్థిక అంశాలపై డిఎంకెతో కలిసి పోరాడేందుకు మనం వ్యతిరేకించినా మత మార్పిడి బిల్లు, ప్రజాప్రతినిధులపై దౌర్జన్యాలు, పత్రికాస్వేచ్ఛపై దాడి వంటి ప్రత్యేక అంశాలపై జరిగిన పోరాటాల్లో వాళ్లతో కలిసేందుకు మనం వెనుకాడలేదు. డిఎంకె కోరినా ముందు మీరు ఎన్డీయే కూటమి నుండి బయటకు వస్తేనే మీతో కలిసి పోరాటాలు చేయడం సాధ్యమవుతుందని స్పష్టంగా చెప్పాము.

అయితే, అందుకు డిఎంకె సుముఖంగా లేదు. తమను విమర్శించడాన్ని సిపిఎం మానుకుంటే తప్ప కార్మికసంబంధ పోరాటాల్లో తాము కలిసి వచ్చేందుకు సిద్ధం కామని డిఎంకె చెప్పింది. అంతే కాకుండా సిఐటియు, ఏఐటియుసి, ఎల్‌పిఎఫ్, ఐఎన్‌టియుసిల సంయుక్త పోరాట కూటమికి వెన్నుపోటు పొడిచింది. డిఎంకె అవకాశవాద వైఖరిని మనం ఎప్పుడూ విమర్శిస్తూనే ఉన్నాం. ఐక్య కార్యాచరణకు డిఎంకె ఎప్పుడూ సుముఖంగా లేదు. 2003 డిసెంబర్ వరకూ మనం స్వతంత్రంగా ఆందోళనలు చేశాం. సిపిఐని కూడా కలుపుకున్నాం. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో కాంగ్రెస్‌తో కూడా కలిసి పనిచేశాం. యుద్ధ వ్యతిరేక ప్రచార, ఆందోళనా కార్యక్రమాల్లో కూడా కలిసొచ్చేందుకు సిద్ధంగా ఉన్న శక్తులతో కూడి పనిచేశాం. వీటన్నింటి నేపథ్యంలో మనం అచ్చిరపక్కం, సైదాపేట్, సత్తంకుళం, వనియంబాడి ఉప ఎన్నికల్లో సిపిఐ మద్దతుతో స్వతంత్రంగా పోటీ చేశాం. కొన్ని చోట్ల కాంగ్రెస్, నేషనల్ లీగ్ అభ్యర్థులకు మద్దతిచ్చాం.

2001 మే నెలలో అధికారంలోకి వచ్చిన



అన్నా డిఎంకె ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడం ప్రారంభించింది. రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయించింది. పత్రికాస్వేచ్ఛపై దాడులు చేసింది. ప్రదర్శనలు, సభల నిర్వహణపై నిషేధం విధించింది. మానవహక్కులు ఉల్లంఘించింది. గూండాయిజం, పెరిగిపోయిన బూటకపు ఎన్‌కౌంటర్లు రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిరంకుశంగా మారిందో విశదం చేస్తున్నాయి. బిజెపి, డిఎంకె మధ్య కొన్ని విభేధాలున్నా సంకీర్ణ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందీ కలుగలేదు. 2002 నవంబర్‌లో కరుణానిధి పోటా కింద అరెస్టయి జైల్లో ఉన్న వైగోను కలిసి వచ్చిన తర్వాత డిఎంకె, ఎండిఎంకె మధ్య స్నేహసంబంధాలు మొదలయ్యాయి.

అవినీతి ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోనూ పేరుకుపోయింది. సహకార సంస్థలు, పోలీస్ వ్యవస్థ, ప్రజా పంపిణీ వ్యవస్థ, సంక్షేమ కార్యక్రమాలు... ఇలా అన్ని రంగాల్లోనూ అవినీతి పెరిగిపోయింది. ఇసుక క్వారీల్లో బహిరంగ దోపిడీ....జల వనరుల స్వాహా... పనికి ఆహారం పథకంలో రోజూ దోపిడీలే. న్యాయ వ్యవస్థలో అవినీతిపై న్యాయవాదులు చేసిన పోరాటం ప్రాముఖ్యం కలిగింది. పోటా వ్యతిరేక చట్టంపై డిఎంకె, ఎండిఎంకె, కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సదస్సులో మనం పాల్గొనలేదు. డిఎంకెతో సంబంధాల విషయంలో సిపిఐ మనంతో నికరంగా నిలబడలేదు. 2003లో డిఎంకె ఎన్డీయేతో తన సంబంధాలు తెంచుకునే విషయాన్ని పరిశీలించింది. పిఎంకె మాత్రం ఎన్డీయేతోనే కొనసాగింది.

ఈ కాలంలో, జయలలితను భవిష్యత్ ప్రధానిగా చూపిస్తూ అన్నాడిఎంకె దేశ స్థాయిలో మూడో ఫ్రంట్ ఏర్పాటుచేసే ఉద్దేశంతో ఒక సదస్సు ఏర్పాటు చేసింది. కాంగ్రెస్‌ను, సోనియాను తీవ్రంగా విమర్శిస్తూ బిజెపితో సంబంధాలు ఏర్పర్చుకుంది. 2003 డిసెంబర్‌లో ఎన్డీయే నుండి డిఎంకె బయటకు వచ్చింది. ఎండిఎంకె, పిఎంకె కూడా డిఎంకెను అనుసరించాయి. దీన్ని మనం హర్షించాము. ఎందుకంటే ఈ పరిణామం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని బలహీన పరిచి, రాష్ట్రంలో అన్నాడిఎంకె వ్యతిరేక శక్తులకు బలం చేకూర్చుతుంది. మన అంచనా నిజమైంది. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి-అన్నాడిఎంకె కూటమి దారుణంగా ఓడిపోయింది. రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో ఒక్క స్థానంలో కూడా ఈ కూటమి అభ్యర్థులు గెలవలేకపోయారు. డిఎంకెపై మన విమర్శలు ఆ పార్టీ ఎన్డీయేని వదిలి రావడానికి, రాష్ట్రంలో ఒక విస్తృత కూటమి ఏర్పాటుకు దోహదం చేశాయని కేంద్ర కమిటీ తీర్మానం పేర్కొంది. ఆ విధంగా కోయంబత్తూరు మహాసభ, పార్లమెంట్ ఎన్నికల మధ్య కాలంలో మన మహాసభ తీర్మానాలు, కేంద్ర కమిటీ మార్గదర్శకాలు తమిళనాడు రాజకీయాల్లో సిపిఎంను ఒక బలీయమైన శక్తిగా రూపొందించడానికి దోహదం చేశాయి.

**పార్లమెంట్ ఎన్నికల తర్వాత పరిస్థితి**

ఎన్నికల అనంతరం కేంద్ర కమిటీ తీర్మానాన్ని అనుసరించి రాష్ట్ర కార్యదర్శివర్గం కొన్ని అంశాపై నిర్ణయాలు తీసుకుంది.

అన్నాడిఎంకె ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూనే కనీస ఉమ్మడి కార్యక్రమం అమలు కోసం కృషి చేయాలి.

ప్రజా సమస్యలపై స్థానిక ప్రజలతో, ప్రజాసంఘాలతో స్వతంత్రంగా పోరాటాలు చేయాలి.

డిఎంకెతో వివిధ అంశాలపై మనకున్న అభిప్రాయ బేధాలను కొనసాగిస్తూనే కనీస ఉమ్మడి కార్యక్రమం అమలు కోసం, వివిధ ప్రత్యేక అంశాలపై ఉమ్మడి కార్యాచరణకు సిద్ధం కావాలి.

కేంద్రంలో యుపిఎ ప్రభుత్వాన్ని బలపరుస్తూనేవారి వినాశకర విధానాలను మనం విమర్శించాలి. అదే సందర్భంలో వివిధ పార్టీల్లో మన స్వతంత్ర వైఖరిని కొనసాగించాలి. రాజకీయంగా పటిష్టమవ్వాలి. మన గుర్తింపును కాపాడుకోవాలి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కూడా మనతో పొత్తును కొనసాగించాలని డిఎంకె కోరుకుంటోంది. అయితే మనం మన ఎన్నికల వ్యూహాలను ఎన్నికల సమయంలోనే రూపొందించుకోవాలి. ఈ నేపథ్యంలోనే మనం శంకరాచార్య కేసు విషయంలోనూ, సునామీ సహాయ చర్యల విషయంలోనూ వ్యవహరించాము. డిఎంకెతో స్నేహంగా ఉంటూనే నిర్దిష్ట అంశాలపై వారిని విమర్శిస్తూనే ఉన్నాము. మతోన్మాదంపై పోరాటానికి డిఎంకె, ఎండిఎంకె, పిఎంకెతో ఉమ్మడి కార్యావరణను చేట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఒక్క ఎండిఎంకె మినహాయిస్తే మిగిలిన పార్టీలు కేంద్ర యుపిఎ సంకీర్ణంలో భాగస్వాములుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో సిపిఐని కూడా కలుపుకుపోయే అవకాశాలను పార్టీ పరిశీలించాలి. ఎన్నికల సందర్భంగా కుదిరిన ఒప్పందాలు ఎన్నికలయ్యాక ముగిసిపోయినప్పటికీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే శక్తులతో ఐక్యతను సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరాన్ని రాష్ట్ర కమిటీ గుర్తించింది.

దీన్ని అనుసరిస్తూనే గత ఏడు నెలలుగా విద్య, ఉపాధి, భాషా సమస్య, వస్త్ర పరిశ్రమ, అంటరానితనం, కార్మికులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మనం స్వతంత్రంగా పోరాటాలు చేశాం. పెట్రోలు ధరల పెంపుపైనా, కార్మిక సమస్యలపైనా సిపిఐతో కలిసి ఉమ్మడి పోరాటాలు చేశాం. బిజెపి పన్నాగాలకు వ్యతిరేకంగా కూడా పోరాడాం. శంకరాచార్య అంశంపై కూడా మనం అన్ని పార్టీలతో కలిసి పనిచేశాం. ఈ వైఖరిని కొనసాగించాల్సిన అవసరం ఉంది.

# రాజకీయ నిర్మాణ నివేదిక....

# ఆంధ్రప్రదేశ్

### రాష్ట్ర పరిస్థితి

గత దశాబ్దంలో ప్రపంచబ్యాంకు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం సరళీకరణ సంస్కరణలను అమలు జరిపింది. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, అగ్ర రాష్ట్రాల సరసన నిలబెడతామని, పేదరిక నిర్మూలనే సంస్కరణల లక్ష్యమని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసిన ప్రచారం ఒట్టి ఆర్భాటమని, ఒక ముసుగని దశాబ్ద అనుభవం తేల్చింది. రాష్ట్రం సంస్కరణలలో "ముందు", అభివృద్ధిలో "వెనుక"ని ప్రపంచబ్యాంకే అంగీకరించాల్సి వచ్చింది.

**స్థూల ఉత్పత్తి:** స్థూల ఉత్పత్తిలో అఖిల భారత స్థాయి కన్నా వెనుకబడే వున్నాం. రాష్ట్ర స్థూల ఉత్పత్తి 1995-96 మరియు 1999-2000 సం॥ మధ్య 5.3% అభివృద్ధి చెందితే అఖిల భారతస్థాయిలో 6.2% పెరుగుదల వుంది. 80వ దశకంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో మనం 2వ స్థానంలో వున్నాం. 90వ దశకంలో ఇతర రాష్ట్రాలకన్నా వెనుకబడి పోయాం. మనకన్నా పశ్చిమబెంగాల్ ఒకటిన్నర రెట్లు వేగంగా పెరిగింది.

**తలసరి ఆదాయం:** తలసరి ఆదాయ విషయంలో కూడా అదే పరిస్థితి. అఖిల భారతస్థాయిలో 4.2% అభివృద్ధి వుంటే రాష్ట్రంలో 4.1% మాత్రమే వున్నది. జనాభా పెరుగుదల దేశ సగటులో (2.4%) మన సగటు సగమైనప్పటికీ (1.3%) తలసరి ఆదాయం పెరుగుదల తక్కువగా వుందంటే మన పరిస్థితి ఎంత హీనంగా వుందో అర్థమవుతుంది. 2000-01 నాటికి 8వ స్థానం నుండి 9వ స్థానానికి పడిపోయాము. దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల అభివృద్ధి రేటు 5.5%తో పోల్చితే మన దీన స్థితి కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది.

**అప్పులు:** అభివృద్ధిలో కాకపోయినా రాష్ట్రం అప్పులో అగ్రభాగాన వున్నది. 2003-04 సం॥రానికి అప్పు రు. 55,508 కోట్లకు చేరింది. ఈ సం॥రానికి రు. 66 వేల కోట్లకు చేరుతుంది. వడ్డీ చెల్లింపులకే ఈ సం॥ రు. 8,443 కోట్లు, అంటే స్థూల ఉత్పత్తిలో 31.15% వెచ్చించాల్సి వస్తున్నది.

**పరిశ్రమలు- సేవలు:** పెట్టుబడులకు సానుకూల వాతావరణం వుందని ఎన్ని కబుర్లు చెప్పినప్పటికీ ఈ కాలంలో పారిశ్రామికాభివృద్ధి కూడా బలహీనపడింది. పారిశ్రామికాభివృద్ధి రేటు 80వ దశకంలో 7.36% వుంటే 90వ దశకంలో 6.2%నికి పడిపోయింది. ఉత్పత్తి రంగంలో ఉత్పాదకత పెరుగుదల కూడా అఖిల భారత స్థాయిలో 1.5% వుంటే మనరాష్ట్రంలో 0.2% మాత్రమే వున్నది.

పారిశ్రామిక రంగం పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నది. హైదరాబాదులో, విశాఖలో కేంద్రీకృతమైన ప్రభుత్వరంగ పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మూత, ఖాయిలా పెరిగిపోయింది. కొన్ని పెద్ద కర్మాగారాలు కూడా మూత పడ్డాయి. వస్తు ఉత్పత్తి పరిశ్రమలు కొత్తగా చాలా కొద్దిగా మాత్రమే వచ్చాయి.



ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం జరుగుతున్నది. గత ప్రభుత్వం నిజాం షుగర్ మిల్లును, సహకార చక్కెర మిల్లులను ప్రైవేటీకరించింది. కొన్ని పరిశ్రమలను మూతబెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలను వదిలించుకొనేందుకు ప్రత్యేకంగా ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్ అనే విభాగాన్ని ఏర్పర్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విభాగాన్ని, విధానాన్ని కొనసాగిస్తున్నది.

ఐ.టి., రంగంలో ఈకాలంలో క్రొత్త పెట్టుబడులు వచ్చాయి. 2003-04 సం॥ నాటికి 1060 సంస్థలలో 85,940 ఉద్యోగులు పని చేస్తున్నారు. సెల్‌ఫోన్ కంపెనీలు విస్తరించాయి. ప్రైవేట్ ఫైనాన్స్ రంగం పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, భవన నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరిగాయి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కూడా విస్తరించింది.

**విద్యుత్:** గత ప్రభుత్వం అమలు జరిపిన సంస్కరణలు విద్యుత్ రంగంలో తీవ్ర మార్పులు తెచ్చాయి. విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయి. ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయింది. ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు లాభాలు కట్టబెట్టబడ్డాయి. జెన్‌కో ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. రెగ్యులేటరీ కమిషన్ వినియోగదారుల ప్రయోజనాల కన్నా, ప్రయివేటు కంపెనీల కొమ్ముకాయడానికే పని చేస్తున్నది. ప్రయివేటు విద్యుత్ కంపెనీల ప్రయోజనాల కోసం విద్యుత్ రంగాన్ని ఫణంగా పెట్టే విధానం కొత్త ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నది. ప్రపంచబ్యాంకు చెప్పిన సంస్కరణల బాటను కొత్త ప్రభుత్వం అనుసరించడానికి సిద్ధపడుతున్నది.

**విద్య:** రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో నిష్పత్తిగా చూసినప్పుడు విద్యపై ప్రభుత్వ ఖర్చు 1985-86లో 3.3 శాతం ఉంటే, 1996-96 నాటికి 2.1 శాతానికి పడిపోయింది. 2000-01 నాటికి కొద్దిగా పెరిగినా, పూర్వ స్థితికి చేరలేదు. విద్యా రంగంలో కూడా వ్యవస్థాగత మార్పులు ఈ కాలంలో స్థిరపడ్డాయి. ప్రభుత్వ రంగం తగ్గిపోతుంటే ప్రయివేటు రంగం వేగంగా పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోనూ డబ్బు పోసి కొనుక్కోవలసిన విద్యే ప్రోత్సహించబడింది. ప్రైవేటు విద్యా కోటీశ్వరులు ప్రభుత్వాన్నే ప్రభావితం చెయ్యగల్గుతున్నారు.

**వైద్యం:** ప్రభుత్వ వైద్య రంగం క్షీణిస్తున్నది.

బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆరోగ్య వ్యయం 1%నికి మించడం లేదు. డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మందుల సరఫరా తగినంతగా లేదు. ఆధునిక యంత్రాల కొరత, ఉన్న యంత్రాల నిర్వహణ లోపం తీవ్రంగా ఉన్నది. ప్రభుత్వ టీచింగ్ హాస్పటల్స్ పరిస్థితి కూడా దిగజారిపోయింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. మారుమూల ప్రాంతాలలో ఆరోగ్య కేంద్రాలు, డాక్టర్లు, సిబ్బంది లేకుండా ఉన్నాయి. అందువలన గ్రామీణ పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతున్నది. ప్రభుత్వం ప్రయివేటు కార్పోరేట్ వైద్యాన్ని ప్రోత్సహిస్తూ సామాన్యులకు వైద్యం అందుబాటులో లేకుండా చేస్తున్నది.

**మానవ అభివృద్ధి సూచిక:** విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రం పురోగమించకపోవడంతో మానవాభివృద్ధి సూచికల్లో రాష్ట్రం వెనుకబడి ఉన్నది. దక్షిణాది రాష్ట్రాల్లో మన రాష్ట్రం అట్టడుగున ఉన్నది. 9వ స్థానంలో ఉన్న మనం 2001 సం॥లో 10వ స్థానానికి పడిపోయాం.

**వ్యవసాయం:** రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో పడింది. 90వ దశకంలో అఖిల భారత స్థాయిలో వ్యవసాయాభివృద్ధి రేటు 3.1% వుంటే రాష్ట్రంలో 2.2% మాత్రమే వున్నది. ఉత్పాదకత అఖిల భారత స్థాయిలో 1.3% వుంటే రాష్ట్రంలో 0.8% మాత్రమే వున్నది. వ్యవసాయంలో అభివృద్ధి మందగించడానికి ప్రభుత్వ ప్రైవేటు పెట్టుబడులు తగ్గడమే కారణం. 1980వ దశకంలో 6%గా ఉన్న ప్రభుత్వ పెట్టుబడులు, 1990వ దశకంలో 1.5%కన్నా తక్కువకు పడిపోయాయి. ప్రైవేటు పెట్టుబడి కూడా రాష్ట్రంలో 80వ దశకంలో 4.7% వంతున పెరిగితే 90వ దశకంలో −3.8%నికి పడిపోయింది. అంటే వ్యవసాయం నుండి పెట్టుబడులు ఉపసంహరించ బడుతున్నట్లు స్పష్టమవుతుంది.

దీని మూలంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు పూర్తిగా అశ్రద్ధకు గురయ్యాయి. ప్రాజెక్టుల నిర్మాణం, నీటివనరుల నిర్వహణ నిర్లక్ష్యం చేయబడ్డాయి. సరళీకరణ విధానాల మూలంగా సబ్సిడీలకు కోతపెట్టబడింది. ఫలితంగా ఉత్పాదకతల ధరలు పెరిగాయి. విత్తనాలు, పురుగు మందుల అమ్మకంలో, పంటల కొనుగోలులో ప్రైవేట్ కంపెనీలు విస్తృతంగా ప్రవేశించి దోపిడీకి, అక్రమాలకు పాల్పడుతున్నాయి. కమీషన్ ఏజెంటు అప్పులిచ్చి, తక్కువ ధరలకు కొంటూ, మోసాలకు పాల్పడుతూ రైతులను పీల్చుకుతింటున్నారు. డబ్ల్యుటిఓ ఒత్తిడి వలన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు సరళం చేయడంతో పంటల ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ప్రాధాన్యతా రంగం నిబంధనలు సడలించడంతో వ్యవస్థీకృత బ్యాంకింగ్ సంస్థల నుండి పరపతి పడిపోయి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల బారిన రైతులు పడుతున్నారు. ఈ విషవలయంలో చిక్కుకొని రైతాంగం పూర్తిగా దెబ్బతిన్నది. రైతు ఆత్మహత్యలు రాష్ట్రంలోనే ఎక్కువ సంభవించడం యాదృచ్ఛికం కాదు.

వ్యవసాయ అనుబంధరంగాలలో కొంత పెరుగుదల లేకపోతే పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారై వుండేది.


ప్రజల పరిస్థితి

**అసమానతలు:** సంస్కరణల మూలంగా ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. జనాభాలో అతి కొద్దిమందిగా వుండే ధనవంతులు మరింత ధనవంతులయ్యారు. ప్రపంచ స్థాయిలోని సౌకర్యాలను వారనుభవించగల్గుతున్నారు. విలాసాలకు, వినోదాలకు విచ్చలవిడిగా, బహిరంగంగా ఖర్చు చేస్తున్నారు. కార్లు, భవనాలు, వివాహాలకు పెడుతున్న ఖర్చును చూస్తే క్రొత్త ధనవంతుల తరగతి ఎలా పెరిగిందో స్పష్టమవుతుంది. మరోవైపు పేదల, సామాన్యప్రజల పరిస్థితి దిగజారింది. నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. పేదరికం పెరిగింది. పేదల్లో కూడా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత దుర్భరమయ్యింది. ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, పోషకాహార లోపం, బాలశ్రామికులు పేదరిక తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

**ఉపాధి:** ఉపాధికల్పన తగ్గిపోయింది. 90వ దశకంలో మన రాష్ట్రంలో ఉపాధి అభివృద్ధి 0.35% మాత్రమే వున్నది. అఖిల భారత స్థాయిలో 1.07% వున్నది. 1993-94లో నిరుద్యోగం 6.6% వుంటే 2000 నాటికి 8.03%నికి పెరిగింది. అఖిల భారత స్థాయికన్నా (7.32%) ఇది చాలా ఎక్కువ. ప్రభుత్వ ఉపాధి లేకపోవడంతో రిజర్వేషన్లు నిరుపయోగమవుతున్నాయి.

**కార్మికులు:** సంస్కరణలు పారిశ్రామిక రంగంలో తీవ్రమైన మార్పులు తేవడంతో కార్మికుల పరిస్థితిలో కూడా పెద్ద మార్పులు సంభవించాయి. అసంఘటిత స్వభావం పెరిగింది. మహిళల, పిల్లల వినియోగం ఎక్కువైంది. తాత్కాలిక పనివారల (క్యాజువలైజేషన్) వినియోగం, కాంట్రాక్టు పద్ధతిలో పని, ఇంటివద్ద పని చేసే పద్ధతి విధానాలను పారిశ్రామిక వ్యాపార సంస్థలు ఎక్కువగా ప్రవేశపెడుతున్నాయి. దీని మూలంగా కార్మికులు, ఉద్యోగులలో అభద్రతా భావం ఎక్కువైంది. ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. పని తీవ్రత, ఆందోళన పెరిగింది. నిజ వేతనాలు తగ్గుతున్నాయి. సౌకర్యాలకు కోత పెడుతున్నారు. పెరుగుతున్న ధరలనుంచి రక్షణ లేకుండా పోయింది. కార్మిక చట్టాలు బలహీనం చేయబడుతున్నాయి. కార్మిక సంఘాలు జోక్యం చేసుకునే శక్తి తగ్గిపోయింది. భారీ పరిశ్రమలలో కూడా అసంఘటిత పనివారల సంఖ్య ఎక్కువ కావడంతో సంఘటిత యూనియన్ల బేరసారాల శక్తి కూడా పడిపోయింది. దీనికి తోడు ప్రభుత్వం సబ్సిడీలను ఉపసంహరించడం, నివాస ప్రాంతాల్లో సౌకర్యాల ఛార్జీలు పెంచడం, కార్మికులు తదితర పట్టణ ప్రజలకు భారమైంది.

**వ్యవసాయ కార్మికులు:** 2001జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు మొత్తం పనివాళ్లలో 40% ఉన్నారు. వీరిలో 65% మంది స్త్రీలే. రాష్ట్రంలో భూ కేంద్రీకరణ మూలంగా వ్యవసాయ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. అలాగే నమోదుకాని కౌలుదారి విధానం విస్తృతంగా పెరుగుతున్నది. వ్యవసాయ కార్మికుల పనిదినాలు బాగా తగ్గాయి. యాంత్రీకరణ, పంటల సరళిలో మార్పు మూలంగా పనిదినాలు పడిపోతున్నాయి. వలసలు బాగా పెరిగాయి. కనీసవేతనాలు అమలు జరగడం లేదు. కరువుకాటకాలొచ్చినప్పుడు వ్యవసాయ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. అనేక కుటుంబాలు అప్పులు,



పస్తుల పాలవుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పనికి ఆహార పథకం దళారీలకు లాభకరంగా మారుతున్నది. వ్యవసాయ కార్మిక సంఘాలు జోక్యం ఉన్న చోటే కొద్దోగొప్పో పేదలకు ఈ పథకం వల్ల మేలు జరుగుతున్నది. భూమి, కూలి, కౌలు, ఉపాధి కనీస అవసరాలు సమస్యలు వ్యవసాయ కార్మికులను కదిలిస్తాయి.

**చిన్న, సన్నకారు రైతులు:** చిన్న, సన్నకారు రైతుల సంఖ్య బాగా పెరిగింది. 2000-01 లెక్కల ప్రకారం 82.5శాతం (95.41లక్షలు) భూ కమతాలు చిన్న, సన్నకారు రైతువి. వారి చేతుల్లో 46.32 శాతం మాత్రమే భూమి ఉన్నది. వెనుకబడిన కులాలు, దళితులు, గిరిజనుల్లో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులున్నారు. ఉన్న భూమిమీద వచ్చే ఆదాయం చాలక వీరిలో ఎక్కువ మంది కూలికి కూడా వెళుతున్నారు. పంటలను కళ్లాల మీదనే అమ్ముకునే పరిస్థితి మూలంగా ధరలు బాగా ఉన్న సంవత్సరం కూడా వీరికి లాభం కలగడం లేదు. చిన్న కౌలుదారుల సంఖ్య కూడా పెరుగుతున్నది. చిన్న,సన్నకారు రైతులకు వర్తించే పథకాలు కూడా పెద్ద రైతులు ఎక్కువ అనుభవిస్తున్నారు. వ్యాపార బ్యాంకులు, సహకార సంఘాలు, పరపతి సౌకర్యం కల్పించడంలో వీరిని చిన్నచూపు చూస్తున్నాయి. అందువలన వీరు తమ పరపతి అవసరాల్లో 60% నుండి 80% వరకు ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధారపడుతున్నారు. సంఘటితం కానందువల్ల గ్రామాల్లో ఇప్పటికీ పెత్తందార్లకు లోబడి, వారి ప్రభావంలోనే ఎక్కువగా ఉంటున్నారు.

**దళితులు:** జనాభాలో దళితులు 16.19%. రాష్ట్ర సగటుకు మించి 653 మండలాల్లో ఉన్నారు. 25 శాతంకు పైన 158 మండలాల్లో ఉన్నారు. దళితుల్లో 85 శాతం వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. 8 శాతం మాత్రమే రైతులు. వీరిలో కూడా చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. సామాజిక వివక్షత కొనసాగుతున్నది. అంటరానితనం కొన్ని ప్రాంతాల్లో వికృతంగా కొనసాగుతున్నది. సమానత్వం కోసం దళితులు ప్రయత్నిస్తే వారిపై దాడులు, దౌర్జన్యాలు కూడా తీవ్రంగా ఉంటున్నాయి. దళితుల్లో సమానత్వం, ఆత్మగౌరవం సమస్యల పట్ల స్పందన ఎక్కువగానూ, విస్తృతంగానూ వున్నది.

సబ్సిడీలు, సాంఘిక సంక్షేమ పథకాలు బలహీనం అయ్యాయి. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య సదుపాయాలు దెబ్బతినడం వలన దళితులు ఎక్కువ నష్టపోతున్నారు. అనాథ మహిళల సంఖ్య కూడా దళితుల్లో ఎక్కువగా ఉంటున్నది. ఇళ్ల స్థలాలు, గృహ సదుపాయం, రేషన్‌కార్డులు, పని, భూమి కోసం దళితుల్లో తీవ్ర కాంక్ష కనపడుతున్నది. వీరిలో ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదన్న భావన రోజురోజుకు ఎక్కువవుతున్నది. సంస్కరణల ప్రభావం దళితుల మీద తీవ్రంగా ఉన్నది. రిజర్వేషన్లు వర్తించే ప్రభుత్వ ఉపాధి పూర్తిగా తగ్గిపోవడంతో దళితుల్లోని చదువుకున్న యువకుల్లో అసంతృప్తి పెరిగింది.

**గిరిజనులు:** జనాభాలో 6.9% గిరిజనులు. రాష్ట్ర సగటుకన్నా మించి 343 మండలాలలో ఉన్నారు. జనాభాలో 50 శాతంకు పైబడి 39 మండలాల్లో, 20శాతం పైబడి 123 మండలాల్లో ఉన్నారు. సంస్కరణల మూలంగా అందరికన్నా తీవ్రంగా నష్టపోయినవారు గిరిజనులు. వారిలో అసంతృప్తి పెరుగుతున్నది. గత రెండు దశాబ్దాల్లో చదువుకుని ముందుకు వచ్చిన యువకులు గిరిజన గ్రామాల్లో తగినంత సంఖ్యలో ఉన్నారు. సంస్కరణలు ప్రారంభం అయిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఉపాధి లేకపోవడం వలన రిజర్వేషన్‌లు నిరుపయోగంగా మారి వీరెక్కువగా నిరుద్యోగులుగా ఉండిపోయారు. గతంలో ఉద్యోగాలు పొందినవారు, పాలక రాజకీయ పార్టీలకు చెందిన కొద్ది మంది దళారీలు మధ్య తరగతిగా ఏర్పడ్డారు. విదేశీ నిధులతో నడిచే అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా గిరిజనుల్లో పని చేస్తున్నాయి. క్రైస్తవ మిషనరీ సంస్థలు ఒకవైపు, వాటికి పోటీగా ఆర్‌ఎస్‌ఎస్ ఉప సంస్థలు మరోవైపు గిరిజనుల్లో పని చేస్తున్నాయి. వీటి కార్యకలాపాల మూలంగా గిరిజన మధ్య తరగతిలో అసంతృప్తి, అస్థిత్వ ఆలోచనలు ప్రబలుతున్నాయి. రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య అభివృద్ధిలో వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకుని వర్గీకరణకు అనుకూలం, వ్యతిరేకంగా కూడా పని చేసే సంస్థలు ముందుకు వస్తున్నాయి. షెడ్యూల్డ్ ఏరియాలో కొన్ని ప్రాంతాల్లో గిరిజనేతరుల సంఖ్య గణనీయంగా ఉండడంతో గిరిజనేతర వ్యతిరేక ఆలోచనలు కూడా గిరిజన మధ్య తరగతిలో పెరుగుతున్నాయి. మైదాన ప్రాంతాలలోని గిరిజనులలో కూడా తమ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి జేయలేదన్న భావన పెరుగుతున్నది.

**మైనార్టీలు:** ముస్లింలు జనాభాలో 9శాతం వున్నారు. ముస్లింలు ఎక్కువగా పట్టణాలలో నివసిస్తున్నారు. పనిలో పాల్గొనే ముస్లింలలో 7.4% వ్యవసాయదారులు, 21.8% వ్యవసాయ కార్మికులు, గృహ పరిశ్రమలలో పని చేసేవారు 6.1%, ఇతర శ్రామికులు 64.6%. ముస్లింలలో పేదరికం ఎక్కువ.

ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రావడం, గుజరాత్ మారణకాండ జరగడం వంటి ఘటనల తర్వాత ముస్లింలలో అభద్రతా భావం పెరిగింది. మొన్న ఎన్నికల్లో అత్యధిక భాగం కాంగ్రెస్‌కు ఓటు చేశారు. మన కార్యకలాపాలకు కూడా స్పందన ఈ తరగతిలో వస్తున్నది. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలలో తమ పట్టును గట్టి చేసుకునేందుకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్‌ను తెచ్చింది. అయితే హైకోర్టు కొట్టి వేసింది. హైదరాబాదు, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి చోట్ల ముస్లిం మత ఛాందస సంస్థలు చురుకుగా ఉన్నాయి.

**వెనుకబడిన కులాలు, వృత్తులు:** గత రెండు దశాబ్దాలుగా జరిగిన మార్పుల కారణంగా వెనుకబడిన కులాల్లో ముఖ్యంగా ఉత్పత్తి కులాల్లో చదువురీత్యాను, సంపద రీత్యాను ఒక బలమైన ధనిక తరగతి ఏర్పడింది. పాలకవర్గ రాజకీయ పార్టీలు కూడా ఈ తరగతిని సమీకరించి ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశాయి. కుల సంఘాలు, బిసి సంఘాలు కూడా అనేకం ముందుకు వచ్చి పని చేస్తున్నాయి. వెనుకబడిన కులాల్లో ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిలోనూ చాలా వైవిధ్యం ఉన్నందున ఏకతాటిమీదకు తీసుకురావడం అంత సులభం కాకపోయినా, కొన్ని శక్తులు అటువంటి ప్రయత్నం కూడా చేస్తున్నాయి. ఈ కులాల నుండి వచ్చిన డబ్బున్న నాయకులు రాజకీయాల్లో పదవులు దక్కించుకోవడానికి కుల సంఘీభావాన్ని పెంచి ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ పార్టీలో వున్నా మన మందరం ఒకటేనన్న వాదనను కులసంఘాలు

ప్రోత్సహిస్తున్నాయి.

సంస్కరణలు దాదాపు అన్ని వృత్తులను నాశనం చేస్తున్నాయి. గీత, చేనేత, మత్స్య, పశుపోషణ, రజక, క్షౌర, కుమ్మరి, కమ్మరి వంటి చిన్న పెద్ద వృత్తులనన్నింటినీ ప్రభుత్వ విధానాలు బలహీనం చేస్తున్నాయి. ఆధునిక ఉత్పత్తులను, పద్ధతులను తట్టుకోలేక వృత్తులు దెబ్బతింటున్నాయి. సామూహిక సౌకర్యాలు కుదించుకు పోవడం, ప్రభుత్వ సహకారం తగ్గిపోవడం మూలంగా వృత్తులు నిలబడలేకపోతున్నాయి. కొత్త ఎక్సైజ్ పాలసీ గీత వృత్తిని దెబ్బ తీస్తున్నది. చేనేత రిజర్వేషన్ చట్ట ఉల్లంఘన యధేచ్ఛగా జరగడంతో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. చేనేత కార్మికుల ఆకలిచావులు పెరిగాయి. యాంత్రిక పడవలు, ట్రాలర్లు తీర ప్రాంతాల్లో చేపల వేట చేస్తుండడం వలన, టూరిజం పేరుతో తీర ప్రాంత మత్స్యకారులను ఖాళీ చేయిస్తుండడంతో కాలుష్యం మూలంగానూ చేపల వేట వృత్తి దెబ్బతిని మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. వృత్తి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కూడా దొరకడం లేదు. వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరగడానికి వృత్తులు క్షీణించడం కూడా ఒక ముఖ్య కారణం. పేదరైతులు, కౌలు రైతులు వెనుకబడిన కులాలలో ఎక్కువగా వున్నారు. వ్యవసాయ సంక్షోభం వారి మీద ఎక్కువగా పడుతున్నది.


**మహిళలు:** సంస్కరణల అమలు ప్రారంభం అయిన తర్వాత మహిళల పరిస్థితుల్లో ఆందోళన కరమైన ధోరణులు మరింత పెరిగాయి. సంస్కరణల ఒడిదుడుకులు మహిళల మీద తీవ్రంగా పడ్డాయి. పేదరికం, ధరల పెరుగుదల దుష్ప్రభావం మహిళల మీదనే ఎక్కువగా పడుతుంది. స్త్రీ-పురుష నిష్పత్తి పడిపోతున్నది.

వినిమయ సంస్కృతి ప్రభావం, వ్యాపారతత్వ ప్రభావం, మతతత్వ ప్రభావం, ఆధ్యాత్మిక, మూఢనమ్మకాల మీడియా ప్రభావం కూడా వీరిపై అధికంగా పడుతున్నది. మహిళల్లో ఎక్కువ శాతం గృహిణులుగా వుంటున్నందున వారి ప్రత్యేకతలను, ఆలోచనలను, సమస్యలను అధ్యయనం జేయాలి. వేధింపులు, అత్యాచారాలు, హింస పెరిగాయి. 2002-03 సంవత్సరంలో మహిళలపై అత్యాచారాల విషయంలో మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానం ఆక్రమించడం ఘోరమైన విషయం. వరకట్న సమస్య మధ్యతరగతి నుండి క్రింది తరగతులకు కూడా పాకింది. అలాగే మహిళల్లో సామాజిక స్పృహ కూడా పెరిగింది. ముఖ్యంగా మన రాష్ట్రంలో డ్వాక్రా బృందాలు మహిళలను సమీకరించి, వారి స్పృహను పెంచడంలో సానుకూల పాత్రను నిర్వహించాయి. రాజకీయ రంగంలో రిజర్వేషన్ మూలంగా, కొన్ని రంగాల్లో మహిళల ఉపాధి పెరగడం మూలంగా కూడా మహిళల్లో జాగరూకత పెరుగుతున్నది. అందువలనే మహిళా సమస్యలతో పాటు, వర్గ సమస్యలు, సాధారణ సమస్యలపై కూడా మహిళల కదలిక చురుకుగా ఉన్నది.

**యువత:** సంస్కరణల ప్రభావం యువతరంపై వైవిధ్యంగా ఉన్నది. సంపన్న, మధ్య తరగతి యువతీయువకులు వినిమయ సంస్కృతికి బాగా అలవాటు పడ్డారు. వినిమయ సంస్కృతిని అనుభవించే ఆర్థిక స్థితి లేని యువతీయువకులపై కూడా ఈ ప్రభావం ఉన్నది. కెరీరిజం కూడా యువతలో బలంగా వేళ్లూనుకుంటున్నది. సామాజిక స్పృహ తగ్గింది, వస్తు వ్యామోహం, వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి తప్ప ప్రక్కవారిని పట్టించుకోని ధోరణి యువకుల్లో వ్యాపిస్తున్నది. అరాచక ధోరణులపట్ల ఆకర్షించబడేవారి సంఖ్య కూడా పెరుగుతున్నది. యువతీయువకుల్లో రాజకీయాల పట్ల నిర్లిప్తత, వ్యతిరేకత వ్యాపించడం ఆందోళన కలిగించే విషయం. మీడియా, బహుళజాతి సంస్థల వ్యాపార ప్రకటనలు ఈ ధోరణి వ్యాప్తికి తోడ్పడుతున్నాయి. వీరిలో అభివృద్ధి నిరోధక భావాలు, మతతత్వ భావాలకు కూడా ఎక్కువ స్పందన ఉంటున్నది.

సంస్కరణల ప్రారంభ దినాల్లో ఉపాధి గురించి యువతలో ఎన్నో ఆశలు రేకెత్తాయి. ఇప్పుడు భ్రమలు తగ్గి వాస్తవాలను అర్థం చేసుకునే స్థితి పెరుగుతున్నది. పదులు, వందల సంఖ్యలో ఉన్న ఉద్యోగాలకు కూడా వేల దరఖాస్తులు వస్తున్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండడం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం యువతీయువకులను అసంతృప్తికి గురి చేస్తున్నది. ప్రభుత్వం ఉపాధి కల్పించదు, స్వయం ఉపాధి చూసుకోవాలి అన్న పాలక వర్గాల ప్రచారాన్ని జీర్ణించుకుని సిద్ధమై పోయిన పరిస్థితి కనిపిస్తున్నది. ప్రభుత్వం యువతీయువకులకు స్వయం ఉపాధి కల్పన కోసం అమలు జరుపుతున్న పథకాలన్నీ అవినీతిమయంగా ఉన్నాయి.

యువతరం సాంస్కృతిక, వైజ్ఞానిక అలవాట్లలో కూడా మార్పులు వస్తున్నాయి. సినిమా సంఘాల ప్రభావం కొనసాగుతూనే ఉన్నది. పండుగల్లో యువతీయువకులు పాల్గొనడం పెరుగుతున్నది. పాలక పార్టీలు, ముఖ్యంగా బి.జె.పి. యువకులకు డబ్బులిచ్చి ప్రోత్సహిస్తున్నారు. మతతత్వ సంస్థల జోక్యం కూడా ఇందుకు కారణం. టి.వి. ప్రసారాల మూలంగా క్రికెట్ అభిమానం కూడా పెరిగింది. గ్రామ సీమలకు కూడా ఇది విస్తరించింది.



**పథకాలు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ తరగతుల ప్రజలకు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఖర్చు చేసే మొత్తాలు స్వల్పంగా ఉన్నందున అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. ఫలితాలు నిజమైన లబ్దిదారులకు అందడం లేదు. అవినీతి విచ్చలవిడిగా ఉన్నది. అనర్హులు లాభం పొందుతున్నారు. పథకాల అమలు గురించి ప్రభుత్వం నిర్వహించిన అనేక అధ్యయనాలు ఈ విషయాలను వెల్లడి చేస్తున్నాయి. మన సంఘాలు జోక్యం జేసుకున్న చోటనే పథకాల అమలు కొంత మెరుగుగా వుంటున్నది.

**పునరావాస సమస్యలు:** అభివృద్ధి కార్యక్రమాల పేరుతో వేల సంఖ్యలో ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ప్రాజెక్టు ముంపు ప్రాంతాల నుండి ఖాళీ చేయించిన వారు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం తీసుకున్నందున భూములు కోల్పోయిన వారు తగిన నష్ట పరిహారం అందక, వాగ్దానాలు అమలు కాక చాలా యిబ్బందులు పడుతున్నారు. ఒకరి లాభం కోసం మరొకరు నష్టపోయే పద్ధతిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరపడం న్యాయం కాదు. నిర్వాసితులకు పూర్తి స్థాయి పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా వుండాలి. అందుకు స్పష్టమైన పునరావాస విధానం కావాలి.

**ప్రాంతీయ అసమానతలు:** సరళీకరణ సంస్కరణలు రాష్ట్రాల మధ్యనే కాదు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య కూడా అసమానతలను పెంచుతాయి. ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో సామాజిక అసమానతలు, ప్రాంతీయ అసమానతలు ఎక్కువగా ఉన్నాయి.

ఉత్తరాంధ్ర, తెలంగాణా, రాయలసీమ, ప్రకాశం జిల్లా మిగతా ప్రాంతాలతో పోల్చితే వెనుకబడి వున్నాయి. నీటివనరుల అభివృద్ధిలో,ప్రభుత్వ సౌకర్యాల కల్పన, స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచికలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. గిరిజనులు, దళితులు ఎక్కువగా వుండే ప్రాంతాలు, భూస్వామ్య వ్యవస్థ పట్టు కల్గిన ప్రాంతాలు మరింత వెనుకబడి వున్నాయి. అసమానతలు తొలగించేందుకు భూపంపకం, కౌలుదారీ రక్షణ, తెలంగాణా, రాయలసీమలకు కాలువ నీటి సౌకర్యాలు, ఉత్తరాంధ్రలో చెరువుల అభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాలలో ప్రభుత్వ సేవల ప్రత్యేక అభివృద్ధి వంటి చర్యలను అవసరం. అదనపు నిధులు కేటాయించి నిర్ణీత కాలంలో అమలు జరిపితే అసమానతలు తగ్గించే అవకాశం వుంటుంది.

మండలాల అభివృద్ధిని అధ్యయనం చేసి, దాని ప్రాతిపదికన మండల స్థాయి వరకు అభివృద్ధి ఇన్‌డెక్స్‌ను (సూచికలు) రూపొందించాలి. ఈ సూచికల ఆధారంగా వెనుకబడిన మండలాలు, జిల్లాలు, ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలి. ఈ ప్రణాళిక అమలుకు అవసరమైన నిధులను కేటాయించాలి. జిల్లా, మండల్ అభివృద్ధి ఇండెక్స్‌లు రూపొందించేందుకు నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. పార్టీ కూడా ప్రతి జిల్లాకు, రాష్ట్రానికి సమగ్రాభివృద్ధి ప్రణాళికను రూపొందించి వాటి ప్రచారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలి.

**పట్టణీకరణ:** 2001 సెన్సస్ ప్రకారం రాష్ట్రంలో పట్టణ జనాభా 27.08% వున్నది. ఈ దశాబ్దంలో ప్రధాన పట్టణాలలో జనాభా పెరుగుదల వేగం తగ్గింది. మండల కేంద్రాలలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి, జనాభా సాంద్రత పెరగడం దీనికి ఒక ముఖ్యమైన కారణం. గ్రామసీమల నుండి సంపద పట్టణాలకి చేరుతున్నందున రియల్ ఎస్టేట్, నిర్మాణం, వినోదం తదితర సేవా రంగాలు విస్తరించాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి పనివాళ్ళ వలసలు పట్టణాలకు పెరిగాయి. దీనితో పట్టణాలలో మురికివాడలు పెరగడం, గృహ సమస్య తీవ్రం కావడం, పౌర సౌకర్యాలు బలహీనం కావడం జరిగింది. పట్టణ పేదలలో పేదరికం కూడా పెరిగింది. మంచినీరు, రోడ్లు, మురుగుదొడ్లు సమస్యలు తీవ్రమయినాయి. చెత్త తొలగింపు అస్తవ్యస్తంగా వుంది. ముఖ్యంగా చిన్న మున్సిపాల్టీలలో పరిస్థితి మరింత తీవ్రంగా వుంది. నివాస ప్రాంత సమస్యలపై పట్టణ ప్రజలు ఎక్కువ స్పందిస్తున్నారు.

పట్టణ పరిపాలనను మెరుగుపర్చాలనే పేరుతో 1300 కోట్ల రూపాయల ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అర్బన్ సర్వీసెస్ ప్రాజెక్టు పేరుతో ఒక కార్యక్రమాన్ని 2002 సంవత్సరం నుండి 32 మున్సిపాల్టీలలో అమలు జరుపుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే గాక, ప్రపంచబ్యాంకు నుండి మరికొంత రుణం తీసుకొని అదనపు మున్సిపాల్టీలకు విస్తరించాలని నిర్ణయించింది. ప్రపంచబ్యాంకు రుణానికి ప్రతిఫలంగా నష్టకరమైన షరతులను అంగీకరించింది. నగర, పుర పాలక సంస్థలు అందించే సర్వీసుల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, వినియోగదారుల ఛార్జీల వసూళ్లు, పన్నుల పెంపు వగైరా విధానాలను పురపాలక సంస్థలు అమలు చేయాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నాయి.


**పర్యావరణం:** ఈ కాలంలో పర్యావరణ సమస్యలు కూడా ముందుకు వస్తున్నాయి. పర్యావరణ స్పృహ పెరగడం, సమస్యలు పెరగడం దీనికి కారణం. నల్గొండ జిల్లాలో యురేనియం త్రవ్వకాలు, శ్రీకాకుళంలో అణు విద్యుత్ ప్రాజెక్టు, కృష్ణ పట్టణం వద్ద ప్లాస్టిక్ పరిశ్రమ స్థాపన, హుస్సేన్‌సాగర్ చెరువు కైవారం కుదింపు, కొల్లేరు సరస్సు ఆక్రమణ, రొయ్యల, చేపల చెరువుల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థ పదార్థాల కాలుష్యం వంటి సమస్యలు ఈ కాలంలో చర్చనీయాంశాలు అయ్యాయి. ఈ సమస్యలలో కూడా మన అధ్యయనం, జోక్యం పెరగాలి.

**ప్రత్యామ్నాయం:** గతంలో టిడిపి-బిజెపి ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలనే ఇప్పుడు కాంగ్రెస్-టిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్నది. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడంలో, ప్రపంచబ్యాంకు ఆదేశాలను పాటించడంలో వీటి మధ్య పెద్ద వ్యత్యాసం లేదు. అందువలన ఈ పార్టీలు ఒకదానికొకటి నిజమైన ప్రత్యామ్నాయాలు కాజాలవు. ఒక కూటమి స్థానంలో మరో కూటమి వచ్చినంత మాత్రాన రాష్ట్రాభివృద్ధికి, ప్రజలకు సంబందించిన మౌలిక సమస్యలు పరిష్కారం కావు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు మాత్రమే నిజమైన ప్రత్యామ్నాయం కాగలవు. మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని, పరిపాలనను అందించగలవు. అటువంటి ప్రత్యామ్నాయం కోసం మార్క్సిస్టు పార్టీ నిరంతరం కృషి చేయాలి. ప్రత్యామ్నాయ విధానాలు నిరంతరం ప్రజల ముందు ఉంచడం అవసరం. ప్రత్యామ్నాయ శక్తి యొక్క అవసరాన్ని కూడా నిరంతరం ప్రచారం చేయాలి. ప్రజా ఉద్యమాల్లో విశాల ఐక్యతను పెంపొందించేందుకు నిరంతరం ప్రయత్నించాలి.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వెంటనే రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయానికి అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. అయినప్పటికీ అటువంటి ప్రత్యామ్నాయాన్ని ఉనికిలోకి తెచ్చేందుకు పార్టీ ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంది. అన్ని ప్రయత్నాలను చేస్తుంది. వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని సాధించాలంటే వామపక్ష ఐక్యత ఇంకా పటిష్టం కావాల్సి ఉంది. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్య కార్యాచరణ బలపరచుకోవాలి. ఐక్య ఉద్యమాలను అభివృద్ధి చేయాలి. ప్రజాసంఘాలు, సంస్థలు విశాలమైన ఐక్యత సాధించి అంగీకృత కార్యక్రమం ప్రాతిపదికమీద ఉద్యమాలను నిర్మించాలి. పాలక పార్టీల వెనుకున్న ప్రజలను ప్రభావితం చేయాలి.

ఈ కృషిలో పార్టీ తన వంతు కృషిని జయప్రదంగా చేయాలంటే ప్రస్తుతం ఉన్న బలం అటువంటి శక్తుల ఆవిర్భావానికి గానీ, ఆకర్షించడానికి గానీ చాలదు. మన స్వతంత్ర బలం అనేక రెట్లు పెరగాలి. ఇందుకోసం రాబోయే కాలంలో పార్టీ యావత్తు విప్లవ దీక్షతో కృషి చేయాలి.

**కర్తవ్యాలు:** నేడు పార్టీ ముందు ఐదు ప్రధానమైన కర్తవ్యాలు ఉన్నాయి. 1) రాష్ట్రంలో మతతత్వ శక్తులు బలపడకుండా చేయడం 2) సరళీకరణ, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను నిర్వహించడం. కాంగ్రెస్



ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడం, మన స్వతంత్రతను నిలబెట్టుకోవడం. కాంగ్రెస్‌తో, తెలుగుదేశంతో స్పష్టమైన డీమార్కేషన్‌ను నిలబెట్టుకోవడం. 3) పార్టీ స్వతంత్ర ప్రజా పునాదిని బలపరుచుకోవడం. 4) వామపక్ష ఐక్యతను మెరుగుపరచడం. 5) ఐక్య ఉద్యమాలను నిర్మించడం.

**కార్యకలాపాల సమీక్ష - గుణపాఠాలు**

ఈకాలంలో మనం వైవిధ్యమైన సమస్యలను తీసుకొని పని చేశాం. అనేక రూపాలను వినియోగించాం. నిరంతరం కార్యకలాపాలు సాగించాం. చిన్న జిల్లాలకు ఉక్కిరిబిక్కిరి అయ్యేంతగా పిలుపులు వున్నాయి. మొత్తం మన కృషి యొక్క సార్థకతకు కొలబద్ద ప్రజాపునాదిని పెంచుకోగల్గడం. ఈ కోణం నుంచి మన కృషిని బేరీజు వేసుకోవాలి.

**సమగ్ర కృషి:** ఈ పద్ధతి బహుళ ప్రయోజనాలు కల్గిన రూపమని మన అనుభవంలో రుజువయ్యింది. ప్రజా పునాది పెంచుకోవడానికి కీలకమైనది. (సమగ్ర కృషి: పట్టిక -2)

**ఎ) మండలాలు:** ప్రజాపునాది సాధించేందుకు మార్గంగా సమగ్ర కృషి పద్ధతిని ప్రయోగాత్మకంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో 2002 మే 10వ తేదీ నుండి 10 రోజులపాటు నిర్వహించాము. శాశ్వతంగా అవసరమైన నిర్మాణ ఏర్పాట్లు చేసుకోవడం, గ్రామ సభలు నిర్వహించడం, ప్రజలు తీవ్రంగా భావించే తక్షణ సమస్యలను గుర్తించడం, వాటిపై దరఖాస్తులు సిద్ధం చేయడం, ప్రజలను సమీకరించి సదస్సులు నిర్వహించడం, అధికారుల వద్దకు రాయబారం నడపడం, కృషి సందర్భంగా చురుకైన వ్యక్తులను గుర్తించడం, వారికి వెంటనే శిక్షణా తరగతులను నిర్వహించడం - ఈ కార్యక్రమాలన్నింటినీ ఒక గొలుసుకట్టుగా పూర్తిచేయడాన్ని సమగ్ర కృషి అంటున్నాం. సమగ్ర కృషి సందర్భంగా గుర్తించిన స్థానిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరంతరం కృషి చేయడం సమగ్ర కృషి కొనసాగింపు కార్యక్రమం. సమగ్రకృషి కనీసం మండల వ్యాపితంగానైనా జరిపితేనే ప్రయోజనం. ఇందుకు అవసరమైన కార్యకర్తలను శాశ్వతంగా కేటాయించడం కూడా ముఖ్యం. అంతర్గత కార్యకర్తలను ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం. ప్రజాసమస్యలపై వీరి కృషిని పర్యవేక్షించడం కూడా ప్రధానం. ఇటువంటి సమగ్ర దృక్పథంతో పనిచేసిన మండలాల్లో ప్రజాపునాది పెరిగింది. సక్రమంగా చేయని చోట, మధ్యలోనే ఆగిపోయిన చోట, పర్యవేక్షణ జరగనిచోట పెరగలేదు. సమగ్రకృషి అంటే ఒక సారి చేస్తే అయిపోయే కార్యక్రమం కాదు. వివిధ రంగాల్లో, వివిధ తరగతుల్లో నిరంతర కార్యక్రమంగా జరుగుతుండాలి.

2002 మేలో ప్రారంభమైన సమగ్రకృషి కార్యక్రమం 2003 ప్రారంభం వరకు కొనసాగుతూనే వున్నది. కొన్ని జిల్లాలు సమగ్ర కృషి ప్రాధాన్యతను గుర్తించకపోవడం, రాష్ట్ర కేంద్రం జిల్లా దృష్టికి తీసుకు వచ్చిన తర్వాతనే చేపట్టడం, ఈ కార్యక్రమాన్ని ఒకేసారి ఒక ఉద్యమ పద్ధతిలో చేపట్టాలనే అంశాన్ని అర్థం చేసుకోకపోవడం, ఈడికగా సాగడానికి ప్రధాన కారణం. మొత్తం మీద 250 మండలాల్లో సమగ్రకృషి జరిగింది. టి.యు. 7 మండలాల్లో, వ్యవసాయకార్మిక సంఘం 65 మండలాల్లో, రైతు సంఘం 6 మండలాల్లో, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం 46 మండలాల్లో, వృత్తి సంఘాలు ఒక మండలంలో, మహిళా సంఘం 68 మండలాల్లో, విద్యార్థి సంఘం 6 మండలాల్లో, యువజన సంఘం 19 మండలాల్లో సమగ్ర కృషి నిర్వహించాయి.

23 జిల్లాల్లో 250మండలాల్లో సమగ్ర కృషి జరిగింది. 242 మండలాల్లో ప్రజా పునాది పెరిగింది.


రాష్ట్ర కమిటీ సమగ్ర కృషిని ఎప్పటికప్పుడు సమీక్షించి, అనుభవాలను క్రోడీకరించి అవసరమైన సూచనలను చేసింది. **భవిష్యత్తులోను ప్రజాపునాదిని పెంచుకునేందుకు సమగ్రకృషి పద్ధతి ఒక ముఖ్యమైన సాధనంగా వినియోగించాలి.**

**బి) పట్టణాలు :** పట్టణాల్లో కూడా నివాస ప్రాంత సమస్యలపై సమగ్రకృషి చేయడం జరిగింది. 39 పట్టణాల్లో 517 వార్డుల్లో సమగ్రకృషి జరిగింది. యువజన సంఘం, టౌన్ డెవలప్‌మెంట్ కమిటీల ఆధ్వర్యాలలో సమగ్రకృషి చేసారు. ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. ప్రజల్లో పెద్ద స్పందన వచ్చింది. కొనసాగింపు చేసిన చోట ప్రజాబలం సంఘటితమైంది. 422 వార్డుల్లో ప్రజా పునాది పెరిగింది. అనేక చోట్ల ఈ కృషి మూలంగా అసంఘటిత రంగంలో ట్రేడ్ యూనియన్లు కూడా ఏర్పడ్డాయి. నివాస ప్రాంత సమస్యలపై కృషికి తోడ్పటం ట్రేడ్ యూనియన్ పనిలో ఒక ముఖ్య భాగంగా ఉండాలి. ఇది టి.యు. రంగం బలపడటానికి కూడా అవసరం.

**దీర్ఘ పాదయాత్రలు:** సమస్యలను ఫోకస్ చేయడానికి, ప్రజల దృష్టిని సమస్యలపై లగ్నం చేసేందుకు, రాజకీయ శక్తుల ముందు అజెండాను వుంచేందుకు, నాయకత్వం ప్రతిష్ట పొందేందుకు, కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్ళేందుకు ఈ రూపం బాగా తోడ్పడింది.

ఈ కాలంలో ఖమ్మం, విశాఖపట్నం జిల్లాల్లో పార్టీ నాయకత్వం సుదీర్ఘ పాదయాత్రలు నిర్వహించడం పేర్కొనదగిన అంశం. ఖమ్మం జిల్లాలో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వీరభద్రం 2003 ఆగస్టు 24 తేదీన ప్రారంభించి 100 రోజుల పాటు 2600 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. డిశంబరు 1వ తేదీన పాదయాత్ర ముగింపు సందర్భంగా పెద్ద బహిరంగ సభ జరిగింది. పాదయాత్ర 1125 గ్రామాలలో సాగింది. 1324 సభలు జరిగాయి. 13000 పైగా పిటిషన్లు అందాయి. జిల్లా అభివృద్ధి సమస్యలను, ప్రజా సమస్యలను అందరి దృష్టికి తేవడానికి, పార్టీ ప్రతిష్ట పెరగడానికి, జిల్లా సమగ్రాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించడానికి, జిల్లాలో మిగతా పార్టీలకు భిన్నంగా మన ప్రత్యేకతను ప్రజలముందుంచడానికి, పార్టీలో ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని పెంచడానికి ఈ పాదయాత్ర ఉపయోగపడింది.

విశాఖ జిల్లాలో గిరిజన ప్రాంతాలైన 11 మండలాల్లో మనం కేంద్రీకరించాలనుకున్నాం. క్రొత్తగా కృషి ప్రారంభించిన ప్రాంతంలో పార్టీ ప్రతిష్ట వేగంగా విస్తరించడానికి, గిరిజన సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, ప్రజల్లో పనిచేసే పద్ధతులను క్రొత్తగా వచ్చిన గిరిజన కార్యకర్తలకు నేర్పడానికి ఉపయోగపడే



విధంగా పాదయాత్రలను 2003 సంవత్సరం నవంబరు నెలలో నిర్వహించడం జరిగింది. జిల్లా కార్యదర్శి కామ్రేడ్ శర్మ కొండకోనల్లో 750 కిలోమీటర్లు 26 రోజులపాటు కాలినడకన పర్యటించారు. ఆయనతోపాటు ఇద్దరు కార్యకర్తలు చివర వరకు పాల్గొన్నారు. 525 గిరిజన గ్రామాల్లో పర్యటన సాగింది. ఏమాత్రం సంబంధం లేని ప్రాంతంలో కూడా ప్రజలు పాదయాత్రను ఆదరించారు.

ఇటువంటి పాదయాత్రా కార్యక్రమం మరికొన్ని జిల్లాల్లో జరిపితే ఉపయోగముంటుందని సూచించినప్పటికీ నాయకత్వాల వైపు నుండి తగిన స్పందన రాలేదు.

దీర్ఘ పాదయాత్ర రూపం కూడా పార్టీ అభివృద్ధికి తోడ్పడే రూపమని రెండు జిల్లాల అనుభవం స్పష్టం చేస్తున్నది.

**ప్రజాసమస్యలు: ఆందోళనా, సేవా కార్యక్రమాలు:**

**(ఎ) కరువుపై ఆందోళన:** గత మూడేళ్ళలో రాష్ట్రాన్ని కరువు పట్టి పీడించింది. 2001-02లో 995 మండలాలను, 2002-03లో 1041, 2003-04లో 451, 2004-05లో 755 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. కరువు సమస్యపై అనేక రూపాలలో నిరంతరాయంగా కార్యక్రమాలు నిర్వహించాము. 2003 మార్చి 6న మహబూబ్‌నగర్ జిల్లాలో బొందలపల్లి ఊరిలో గంజి కేంద్రాన్ని ప్రారంభించాము. తర్వాత 13 జిల్లాల్లో 128 కేంద్రాలు జూన్ మాసం వరకు నిర్వహించాము. తెలుగుదేశం పార్టీ, మరికొంత మంది గంజి కేంద్రాలను ఎగతాళి చేస్తూ విమర్శలు చేశారు. కరువు సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టే కార్యక్రమంగా గంజి కేంద్రాల సహాయం కోసం బిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టాం. రాష్ట్ర నాయకత్వం బిక్షాటనలో పాల్గొనడం వలన ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం వచ్చింది. ప్రజల నుండి రు. 20.35 లక్షలు మొత్తం విరాళాలు వచ్చాయి.

మార్చి 24-27 వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలోను, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలోను హంగర్‌స్ట్రైక్ నిర్వహించాము. ఫిబ్రవరి 24వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా కలెక్టర్ ఆఫీసు పికెటింగ్ కార్యక్రమం నిర్వహించాము. ఏప్రిల్ 28న కరువు సమస్యపై రాష్ట్ర సదస్సు నిర్వహించాము. మే 16, 17 తేదీలలో రెండురోజులపాటు కలెక్టర్ ఆఫీసుల దిగ్బంధనం వేలమందితో చేశాము.


**(బి) నిరసన పారిశుధ్య శ్రమదానం:** 2003 వర్షాకాల ప్రారంభంలో అంటువ్యాధులు, విషజ్వరాలు రాష్ట్రంలో ఎక్కువగా వ్యాపించాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా అనేక మరణాలు కూడా సంభవించాయి. అనేక పట్టణాలలో పారిశుద్ధ్యం బాగా దెబ్బతింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగాను, అలాగే సేవా కార్యక్రమంగాను ఉపయోగపడేట్లు పారిశుద్ధ్య శ్రమదానానికి పార్టీ పిలుపిచ్చింది. అన్ని ప్రాంతాల్లో ఈ శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించాం.

**(సి) స్థానిక సమస్యలు:** విశాఖ జిల్లాలో 37 రోజుల పాటు జరిగిన ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్ (ఇపిజడ్) కార్మికుల పోరాటం, 118 రోజులపాటు జరిగిన చిట్టివలస కార్మికుల సమ్మె, అనంతపురం రైతుల ఆందోళన, 2002 ఫిబ్రవరి 28న జిల్లా బంద్, 2003 జనవరిలో జరిగిన సింగరేణి సమ్మె, కృష్ణా జిల్లా కోస్తా రహదారి ఉద్యమం, ఖమ్మం జిల్లాలో తునికాకు ధరకై జరిగిన ఉద్యమం, మిర్యాలగూడెంలో సాగునీటి కోసం జరిగిన కామ్రేడ్ రంగారెడ్డి ఆమరణ నిరాహారదీక్ష, హైదరాబాద్‌లో బతుకమ్మకుంట ఇళ్ళ స్థలాల పోరాటం, కబేళా వృత్తిదారుల పోరాటం, అనంతపురం పట్టురైతుల ఆందోళన, హిందూపూర్ చేనేత పనివారల వుద్యమం, నెల్లూరు ఆక్వా రైతుల పోరాటం, కృష్ణా జిల్లా పెదతుమ్మిడి దళితుల పోరాటం, కడప, వరంగల్, ఏలూరు పట్టణాలలో పేదల ఇళ్ళ స్థలాల పోరాటం, సాగునీటి కోసం ప్రకాశం రైతులు నిర్వహించిన ఆందోళన, పోలవరం ఏజెన్సీలో గిరిజనుల భూపోరాటం మనం నిర్వహించిన స్థానిక పోరాట ఆందోళనలలో కొన్ని ముఖ్యమైనవి.

**(డి)** 2004 మే 14వ తేదీన క్రొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉన్న వాతావరణంలో ప్రజా సమస్యలపై రాయబారాల మీద కేంద్రీకరించాము. వివిధ ప్రజా సంఘాలు శాసనసభా సమావేశాల సందర్భంగా సదస్సులు, సభల ద్వారా చేసిన వాగ్దానాలను అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం జరిగింది.

**(ఇ) విద్యుత్ రంగ సమస్యలు:** ఈ మూడు సంవత్సరాల్లో కూడా విద్యుత్ రంగంలో జరిగిన పరిణామాలన్నింటిలోను మనం జోక్యం చేసుకొన్నాం. విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ ముందు విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనను పెట్టి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై, ఇంకా అనేక అంశాలపై జరిగిన బహిరంగ విచారణలో పార్టీ తరపున పాల్గొని వాదనలు వినిపించాము. విద్యుత్ ఉద్యమ సందర్భంలో మనం నిర్వహించిన పాత్రకు వచ్చిన గుర్తింపును కమీషన్ ముందు విచారణలో పాల్గొనడం ద్వారా కొనసాగించగల్గాము.

2003లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఫ్రాంచైజ్ పద్ధతిలో ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ఎండగట్టాము. వివిధ పంపిణీ కంపెనీల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించాము. జనవరి 20 వ తేదీన టెండర్లు ఓపెనింగ్ రోజున పికెటింగ్ కార్యక్రమం నిర్వహించి అడ్డుకున్నాం. ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోగల్గాము.



**వర్గపోరాటాలు: (ఎ) సింగరేణి సమ్మె:** 2003 ఫిబ్రవరిలో సింగరేణి బొగ్గు కార్మికుల సమ్మె 17 రోజులపాటు జరిగింది. ఈ సందర్భంగా మన సంఘం, సిఐటియు నాయకత్వం, పార్టీ సంఘీభావ కార్యక్రమంలో చురుకైన పాత్ర నిర్వహించాయి. నాయకులు కూడా అరెస్టులయ్యారు. కార్మికుల్లో మన పట్ల సదాభిప్రాయం ఏర్పడినప్పటికీ మన సంఘ కార్మిక పునాది పెరగడానికి ఇది పెద్దగా తోడ్పడలేదు. కార్మికులకు విశ్వాసం కల్గించగల్గే నిర్మాణ యంత్రం లేనప్పుడు ఎంత గౌరవం వున్నప్పటికీ సంస్కరణ వాద సంఘాలు బలంగా వున్న చోట్ల కార్మికులు మన వైపుకు రారనేది మనం గమనించవచ్చు.

**(బి) సార్వత్రిక సమ్మె:** 2003 మే 21వ తేదీన కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపిచ్చాయి. రాష్ట్రంలో వామపక్షాలు సంఘీభావంగా అదే రోజున బంద్‌కు పిలుపిచ్చాయి. ఈ కార్యక్రమం రాష్ట్రంలో జయప్రదంగా జరిగింది. 2004 ఫిబ్రవరి 24న సమ్మె హక్కు కోసం జరిగిన సార్వత్రిక సమ్మె రాష్ట్రంలో అత్యంత జయప్రదంగా జరిగింది.

# ముస్లిమ్‌ల రిజర్వేషన్లు.. పరిశీలించాల్సిన అంశాలు

**జోయా హసన్**

సామాజిక అలక్ష్యానికి గురైన వారికి తోడ్పడాలనుకొన్నపుడు కనీసం మూడు రకాలైన చర్యలను అందుబాటులోకి తేవలసి వుంటుంది. సుదృఢమైన చర్యలు, వివక్ష తొలగింపు, పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ, ఉద్యోగాలలోను కచ్చితమైన కేటాయింపులు ఉండాలి. ప్రత్యేక పాఠశాలలు లేదా వృత్తి శిక్షణా సౌకర్యాల ఏర్పాటు మొదలు, ఉద్యోగాలకు దరఖాస్తు చేయవలసిందిగా నిర్దిష్ట బృందాలకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వటం వరకు అనేక రూపాలలో తోడ్పాటు నందించవచ్చు. విద్యా సంస్థలలోను, శాసనసభలలోను, ప్రభుత్వ కార్యాలయాలలోను షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యుల్డ్ తెగల వారికీ కోటా ప్రాతిపదికపై స్థానాలు లభిస్తున్నాయి. ఎవరినైతే అప్రధానులుగా భావించి సామాజిక - ఆర్థిక వనరులకు దూరంగా ఉంచటం జరిగిందో, అలాంటివారికి సమాన అవకాశాలను కల్పించే మార్గంగా పై చర్యలను భావిస్తున్నారు. కులం పేరుతో అంతరాలు, ప్రత్యేకించి అస్పృశ్యత, బలవంతపు వెలి వంటివన్నీ వివక్షతా రూపాలుగా ఉన్నాయి. ఇలా వెలికి గురైన ప్రజాబృందాలు అత్యంత ప్రతికూలమైన పరిస్థితులను ఎదుర్కొన్నాయి. రిజర్వేషన్లు అనేవి ఈ అన్యాయానికి గుర్తింపు వంటివి, అన్నిటికన్నా ముఖ్యంగా ఇప్పటి వరకు వెలిగా బ్రతికిన బృందాలను సామాజిక, రాజకీయ ప్రధాన వాహినులలోకి తీసుకురావటానికి ఉపయోగపడతాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానం వల్ల షెడ్యూల్డ్ కులాల వారికీ, తెగల వారికీ కొంతమేరకు ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయన్న హామీ దొరికింది.


వెనుకబడిన వర్గాలను ఎంపిక చేయటంలో మతాన్ని గీటురాయిగా వినియోగించడంలో గల రాజ్యాంగ బద్ధతను ఎవరూ స్పష్టమైన రీతిలో సవాలు చేయనప్పటికీ, ఆచరణలో దానిని అమలు చేయటానికి ప్రభుత్వం, న్యాయస్థానాలు తిరస్కరిస్తున్నాయి. ఈ కారణంగా మైనారిటీ బృందాలను వెనుకబడినవారిగా గుర్తించటం లేదు. గతంలో అవకాశాలను కోల్పోయిన వారికి కల్పించే ప్రత్యేక రక్షణలు వీరికి వర్తించడం లేదు. ప్రధానంగా మూడు కారణాలను చూపుతున్నారు. (1) లౌకికత్వం దృష్ట్యా ఇది అసంగతమైనది (2) మహమ్మదీయులలో కుల వ్యవస్థ లేనందున వారు సామాజిక వివక్షతకు గురికానందున వారికి ప్రత్యేక చర్యలు సమర్ధనీయం కాదు (3) జాతీయ సమైక్యతను దెబ్బతీస్తుంది.

భారత రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనం ప్రకారం లౌకికత్వం అంటే, రాజ్యము తప్పనిసరిగా అన్ని మతాలకు సమాన గౌరవాన్ని ఇవ్వటం లేదా అన్ని మతాలకు సమాన దూరంలో ఉండటం. అయితే ఈ సిద్ధాంతం అన్ని మతాలకు ఒకే విధంగా వర్తించటం లేదు. దీనివల్ల రిజర్వేషన్ల విధానానికి చిక్కులు ఎదురవుతున్నాయి.

భారతదేశంలోని మహమ్మదీయులు, క్రైస్తవులు బయటివారంటూ బాగా ప్రచలితమైన అభిప్రాయాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అటు రాజ్యాంగంలో గానీ, ఇటు హిందూ కోడ్ బిల్లులో గానీ హిందువులలో జైనులను, బౌద్ధులను, సిక్కులను కలిపివేశారు. కాగా మహమ్మదీయులను, క్రైస్తవులను ఎడంగానే ఉంచారు. ఇందుకు కారణం ఆ మతాలు భారతదేశం వెలుపల ఆవిర్భవించి ఉండటమేనని చెప్పాలి.

రెండవ తరహాకు చెందిన వాదన కూడా ఉన్నది. దీని ప్రకారం నిర్దిష్టమైన అర్థంలో చూసినపుడు మైనారిటీ మతాలు విభిన్నమైనవి, అవి కుల వ్యవస్థను ఆమోదించవు. సూత్రరీత్యా రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి చెందినవి. లేదా హిందూ కుల వ్యవస్థ నుండి పుట్టుకొచ్చిన అణచివేత, వివక్షతలకు గురియైన బాధితులను ఉద్ధరించడానికి ఆవిర్భవించినవి. మహమ్మదీయులు కులాన్ని గుర్తించరు గనుక వివక్షతలకు వారు గురికాలేదు. ఇలాంటి వారికి ప్రత్యేక సౌకర్యాలు సమర్ధనీయం కాదు.

రిజర్వేషన్లకు మతాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నట్లయితే జాతీయ గుర్తింపుకు, రాజ్య సమగ్రతకు భంగం వాటిల్లగలదన్న ధోరణి మూడవది. జాతీయవాద వైఖరుల గురించి చర్చలు సాగుతున్నపుడు ఈ వాదన బలంగా ముందుకు వచ్చింది. మైనారిటీలకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని లేదా రిజర్వేషన్లను కల్పిస్తే అది వినాశకర ఫలితాలను ఇవ్వగలదని నిజానికి దేశ విభజనకు దారితీయగలదన్న ఆందోళన ప్రభుత్వ విధానంలో కన్పించింది.



స్వాతంత్ర్యం రాకముందు వివిధ శాసనసభలలో మహమ్మదీయులకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా రాజకీయ క్రమంలోకి విభిన్న మత బృందాలను బ్రిటిష్ వాళ్ళు ప్రవేశపెట్టారు. రాజ్యాంగ సభ చర్చలలో నిర్ణయాత్మకమైన మార్పు జరిగింది. మైనారిటీలకు, ప్రాథమిక హక్కులకు సంబంధించిన సభా సలహా సంఘం మహమ్మదీయులకు రిజర్వేషన్ల కొనసాగింపు గురించి పరిగణనలోకి తీసుకొన్నది. అయితే దేశ విభజనకు రిజర్వేషన్లు బలిపశువుగా మారాయి. తొలుత షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వలెనే మైనారిటీ మతాలు కూడా ఈ కేటగిరీ క్రిందకు వచ్చాయి. అయితే రాజ్యాంగ ముసాయిదా సమయంలో పరిస్థితి మారిపోయింది. దిగువ కులాలు హిందూ సమాజంలో భాగం కనుక మైనారిటీ మతస్తులు, దిగువ కులాలు వేర్వేరు అన్న వాదన ముందుకు వచ్చింది.

మైనారిటీలను వదిలి వేయాలని నిర్ణయించడం సరియైన చర్య కాదు. హిందూ కుల వ్యవస్థలోని బృందాలు సామాజిక వివక్షతకు గురియైనపుడు మాత్రమే వాటిని ప్రత్యేక సౌకర్యాలకు అర్హమని భావించారు. 1956లో సిక్కులు తమ హక్కుల కోసం పోరాడారు. హిందువులలో భాగంగా వారు రిజర్వేషన్ సౌకర్యాన్ని పొందారు. ఈ తరగతిలోకి బౌద్ధులు

కూడా 1990లో చేరారు. కేవలం మహమ్మదీయులు, క్రైస్తవులు మాత్రమే రిజర్వేషన్ సౌకర్యానికి దూరంగా ఉన్నారు. దళితులు క్రైస్తవం లేదా ఇస్లాంను స్వీకరించినట్లయితే షెడ్యూల్డ్ కులాలకు ఇచ్చే రిజర్వేషన్లు వారికి వర్తించకుండా పోతాయి.

సాంస్కృతిక గుర్తింపు పరిరక్షణకు సంబంధించిన రాజకీయ సూత్రాలకు, న్యాయమూ - సమత్వమూ వంటి అంశాలకు చెందిన సామాజిక సూత్రాలకు మధ్య విభజన ఉండాలని ప్రభుత్వ విధానాలు కోరుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఒక సామాజిక బృందం యొక్క గుర్తింపు పరిరక్షణను, ఆ బృందం యొక్క హక్కులు, ప్రయోజనాల పెంపునకు మధ్య వ్యత్యాసాన్ని చూడటం సమస్యలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. ఎందుకంటే ఏ సామాజిక బృందమైనా వీటిలో ఒక దానిని కలిగి వుండి మరొకటి లేకుండా ఉండజాలదు. ఇదొక విష వలయాన్ని సృష్టిస్తుంది. దాని ఫలితంగా ఒకవైపు సమత్వము, మరొకవైపు వివక్షత నెలకొంటుంది.


ఎవరో కొంతమంది కొన్ని విజయాలను సాధించినప్పటికీ, అలానే మరికొంతమంది సినిమా, క్రీడలు, సంగీతం వంటి రంగాల్లో ప్రముఖులుగా పేరొందినప్పటికీ మొత్తం మీద చూస్తే స్వాతంత్ర్యానంతరం విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రసార మాధ్యమం వంటి వాటిల్లో మహమ్మదీయులు చాలా తక్కువగా కన్పిస్తారు. ఆదాయమూ, ఆరోగ్యమూ, విద్య, ఉద్యోగం వంటి వాటిల్లో ఇతర సామాజిక బృందాలతో పోలిస్తే మహమ్మదీయులు నామమాత్రంగా ఉన్నారనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయి. వారు ప్రధానంగా పట్టణ ప్రాంతాలలో ఉన్నప్పటికీ వేతన ఉద్యోగాలలో తక్కువగా ఉన్నారు.

నెహ్రూ లేదా ఇందిరాగాంధీ హయాంలో కన్నా భారతదేశ వైఖరిలో చాలా మార్పు వచ్చింది. అయితే అందువల్ల ముస్లింలకు జరిగే మేలు ఏమీ లేదు. మండల్ కమిషన్ మాత్రం ఇందుకు మినహాయింపు. దాదాపు 80 పైగా ముస్లిం బృందాలను వెనుకబడినవిగా ఇది గుర్తించింది. ఆ రకంగా ముస్లిమ్‌లలో సగంమందిని వెనుకబడిన వారిగా గుర్తించింది. అప్పటిలో ఉపయోగించిన వివరాల ప్రకారం 27 శాతంగా ఉన్న ఓబిసి (ఇతర వెనుకబడిన కులాలు) జనాభాలో ముస్లింలు 8 శాతంగా ఉన్నారు. దేశ జనాభాలో దాదాపు 11.2 శాతంగా ఉన్న మొత్తం మహమ్మదీయులలో వెనుకబడిన కులాలకు చెందిన వారు దాదాపు సగభాగంగా ఉన్నారు. చేనేత కార్మికులు, నూనె గానుగలను ఆడించేవారు. వడ్రంగులు, రజకులు వంటివారిని వెనుకబడిన కులాలలో చేర్చారు. ఇలాంటి వారికి రిజర్వేషన్ సౌకర్యాలను మండల్ కమిషన్ కల్పించింది. రాష్ట్రాలకు కూడా తత్సంబంధిత ఆదేశాలు వెళ్లాయి.

ముస్లిమ్‌లందరినీ వెనుకబడిన బృందంగా గుర్తించటానికీ, అదేవిధంగా షెడ్యూల్డ్ కులాలతో లేదా తెగలతో సమానస్థాయిని కల్పించేటందుకు మండల్ కమిషన్ తిరస్కరించింది. ఏ తరగతి అయినప్పటికీ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిందన్న సూత్రంపై అధికారిక విధానం ఆధారపడి వుంటుంది. అయితే నిర్దిష్టమైన గీటురాళ్ళ ఆధారంగా ఈ వెనుకబాటు తనాన్ని నిర్ధారిస్తారు. వివిధ రాష్ట్రాలు రూపొందించిన ప్రమాణాలను ఆధారంగా చేసుకొని మతంతో నిమిత్తం లేకుండా నిర్దిష్ట సామాజిక బృందాలు వెనుకబడినవిగా గుర్తింపు పొందినవి. ఈ పద్ధతిని అనుసరించి ఏ మతసమాజమైనప్పటికీ వెనుకబడిన లేదా అభివృద్ధి చెందిన తరగతులను కలిగి ఉంటుంది. హిందువులలోనే కాక మహమ్మదీయులలో కూడా కులాన్ని పోలిన అంతరవులు ఉన్నాయి.

ఓబిసి ముస్లిమ్‌లను కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వెనుకబడిన జాబితాలో చేర్చారు. అయితే ఈ కేటగిరి క్రింద పొందవలసిన ప్రయోజనాలను మాత్రం పొందడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో ముస్లింల ప్రాతినిధ్యం అత్యల్పంగానే కొనసాగుతుండటాన్ని బట్టి దీనిని చెప్పవచ్చు. 1981లో మొత్తం 3,883 ఐఎఎస్ అధికారులుండగా వారిలో ముస్లిములు 2.98 శాతంగా ఉన్నారు. కాగా 2000లో 2.83 శాతంగా ఉన్నారు.

వెనుకబడిన కులాల / వర్గాల తరగతులలో ముస్లిములను కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేర్చాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కొన్ని ముస్లిము గ్రూపులు ప్రస్తుతం రిజర్వేషన్ సౌకర్యాన్ని అనుభవిస్తున్నాయి. ప్రస్తుతం కేరళలో 12 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను ముస్లిములకు రిజర్వు చేశారు. రాష్ట్ర జనాభాలో వీరు 22 శాతంగా ఉన్నారు. ఏడాదికి రూ.2.50 లక్షల లోపు ఆదాయం గల కుటుంబాలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. తమిళనాడులో ఓబిసిలకు 30 శాతంలో ముస్లిములకు కూడా రిజర్వేషన్ ఉన్నది. కర్ణాటకలో 1994లో ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్‌ను కల్పించింది. రెండు లక్షల రూపాయల వార్షిక ఆదాయము లేదా నిర్దిష్ట పరిమితికి లోబడిన భూమి కల కుటుంబాలకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది.



కులము-సామాజిక బృందం అన్న భావనల మధ్యగల వివాదం తరచుగా రిజర్వేషన్లపై జరిగే చర్చలో ప్రస్తావనకు వస్తూ ఉంటుంది. ప్రస్తుత సందర్భాన్ని పురస్కరించుకొని దానిని చూడవలసి ఉంది. సమానత్వం అనేది సామాజిక బృందం పరిధిలోపల ఉండాలని కొందరు, సామాజిక బృందాల మధ్య ఉండాలని మరికొందరు చెపుతున్నారు. మతాన్ని ప్రాతిపదికగా తీసుకొని రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలని కొందరు చెపుతుంటే మతంలోపల ఉన్న కుల వ్యత్యాసాలను ఆధారం చేసుకొని రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలని ఇంకొందరు చెపుతున్నారు.

ముస్లిములను వెనుకబడిన వర్గంగా గుర్తించాలని ఆరకంగా చేస్తే రిజర్వేషన్ల ఫలితాలను వారు కూడా పొందగలరన్న ప్రతిపాదన ఒకటి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పరోక్ష మద్దతును దృష్టిలో వుంచుకొని 1994లో న్యూఢిల్లీలో రిజర్వేషన్లపై జరిగిన సదస్సులో ఈ మేరకు డిమాండ్ ముందుకు వచ్చింది. మహమ్మదీయులలోని ఒక బృందం ఈ విధంగా ప్రతిపాదించింది.

1) ముస్లిం సమాజమంతటినీ దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గంగా ప్రకటించాలి. (2) ఓబిసిగా ప్రకటితమైన ముస్లిములకే ముందుగా రిజర్వేషన్ ఫలితాలు అందాలి. ముస్లిములకు ఉద్దేశించిన కోటా పూర్తికాని పక్షంలో ముస్లింలలోని ఇతర అనుబంధ బృందాలకు

చెందిన వారికి (ఉదాహరణకు అష్రాఫ్‌లు) వాటిని ఇవ్వాలి. ముస్లిములకు ప్రత్యేక కోటా ఉండాలనటాన్ని సమర్ధిస్తూ అయితే దానిని వర్గమూ, కులము పేరుతో కాక మత ప్రాతిపదికపై విభజించాలని అన్నారు. దేశంలోని మొత్తం ముస్లిమ్ సమాజం వెనుకబడిన వర్గంగా రూపుదిద్దుకోవాలన్న అభిప్రాయమే పైవిధంగా చెప్పటానికి కారణం.

ఇదిలా ఉండగా ముస్లిములలోని వెనుకబడిన కులాలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. ముస్లిమ్ సమాజంలోని సంపన్నులు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలను దక్కించుకుంటున్నారన్నది వీరి అభియోగం. ముస్లిములలోని వెనుకబడిన కులాలను పక్కకు నెట్టివేయటమంటే మొత్తం ముస్లిమ్ సమాజాన్ని హిందూ సమాజం పక్కకు నెట్టివేయటంవంటిదే అవుతుందని వారు అన్నారు. ఇలాంటి పరిణామం కారణంగా వెనుకబడిన ముస్లిములు శాసనసభలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు దూరంగా ఉండిపోవలసి వస్తున్నది. తత్కారణంగా ముస్లిమ్ సమాజమంతటినీ వెనుకబడిన వర్గంగా గుర్తించమనటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. విద్య, ఉద్యోగాలలో వెనుకబడిన తరగతులకు మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని వారు అంటున్నారు.

ముస్లిమ్ 'కోటా క్రింద రిజర్వేషన్ సౌకర్యాలను సంపన్న విద్యాధిక తరగతులకు చెందినవారు లాగివేసుకోగలరని, సమాజంలో ఉన్నతస్థాయికి వెళ్ళేందుకై తమకున్న అవకాశాలు హరించుకుపోగలవని ఓబిసి జాబితాలో ఇప్పటికే నమోదైన వెనుకబడిన కులాలకు చెందినవారు భయపడుతున్నారు చిట్టచివరి విషయమేమిటంటే ఈ వివాదంలో చిక్కుకున్న ఉభయపక్షాలు తమను వెనుకబడిన తరగతులలో చేర్చాలనే కోరుతున్నాయి. లేనిపక్షంలో జనరల్ స్థానాలలో అశేషంగా ఉండే హిందూ అగ్రకులాలతో పోటీ పడవలసి వస్తుందని వారి అభిప్రాయం.

ముస్లిములకు రిజర్వేషన్లను కల్పించాలన్న భావన అనేక విధాలుగా బలమైన రీతిలో ముందుకు వచ్చింది. ముస్లిములు వివక్షతకు గురికావడమే కాక ప్రభుత్వ ఉద్యోగాలలో అత్యల్పంగా ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ మతం పేరుతో నిర్ధారించే కోటాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వజాలవు. ముస్లిములకు ప్రత్యేకమైన కోటాను కల్పిస్తే అది వినాశకర ఫలితాలను ఇవ్వగలదు. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని హిందూ మితవాదులు మతాల మధ్య ద్వేషాన్ని రగుల్చుతారు. మైనారిటీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను కల్పించటాన్ని వీరు పూర్తిగా వ్యతిరేకిస్తారు. రిజరేషన్ల సౌకర్యం వల్ల ప్రభుత్వంలో వారి ప్రాతినిధ్యం నామమాత్రంగా పెరిగినప్పటికీ రాజకీయాలలో వీరు మరింతగా ఏకాకులయ్యే ప్రమాదం లేకపోలేదు.


పైగా 50 శాతానికి మించి రిజర్వేషన్లను కల్పించరాదని 1992లో సుప్రీంకోర్టు ఆంక్ష విధించింది. కనుక రాజ్యాంగ సవరణ లేకుండా ఈ పరిమితిని అధిగమించటం అసాధ్యమైన విషయం. మరో విషయం ఏమిటంటే మత బృందాలను రిజర్వేషన్‌కు అర్హమని తీర్మానించాలంటే అందుకు పార్లమెంటు ఆమోదం కావాలి. వీటిల్లో ఏ దారిని అనుసరించినా మతపరమైన ఉద్రిక్తతలను అవకాశం ఏర్పడుతుంది. కనుక వెనుకబడిన ముస్లిములను అధికారికమైన వెనుకబడిన వర్గాల జాబితాలో చేర్చటమే ఉత్తమం. రెండు విధాలుగా దీనిని సాధించవచ్చు. మొదటిదేమిటంటే ముస్లిములలో మతాలను గుర్తించి వాటిలో అట్టడుగున వున్నవాటిని పేర్కొనటం.

రెండవదేమిటంటే ఆర్థిక - సామాజిక గీటురాళ్ళ ప్రాతిపదికపై అట్టడుగు బృందాలను గుర్తించడం. వీటిల్లో మొదటిది వివేకయుతమైనదే కాక హిందువుల నుంచి వేరు చేసే శక్తి దానికి తక్కువగా వుంటుంది. అన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే ముస్లింలకు రిజర్వేషన్లను వర్తింపచేయటంలో మతం కన్నా కులాన్ని ప్రాతిపదికగా తీసుకోవటానికే ప్రభుత్వాలు సుముఖంగా ఉన్నాయి.

కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు రెండవ మార్గాన్నే చేపట్టాయి. ఆర్థిక, సామాజిక ప్రమాణాలను పాటిస్తూ ఈ ప్రాతిపదికపైనే ముస్లింలకు రిజర్వేషన్లను అమలు చేస్తున్నాయి. ఈ రాష్ట్రాలు ముస్లింలందరికీ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అయితే దామాషా ప్రకారం ముస్లింలకు ఉపాధిని కల్పించడంలో ఈ ప్రభుత్వాలు జయప్రదమయ్యాయి. ఇక్కడ ఉన్న ప్రధానమైన విషయమేమిటంటే సంపన్న ముస్లింలను ప్రక్కకు తప్పించి అట్టడుగున ఉన్నవారికి రిజర్వేషన్ సౌకర్యం అందేలా చేశారు.

పైన పేర్కొన్న రెండు వైఖరులూ ప్రభుత్వ నిర్మాణాత్మక పాత్రను నొక్కి చెపుతున్నాయి. మైనారిటీలకు కొంతమేరకు సమానావకాశాలను కల్పించగలిగాయి. దానివల్ల ముస్లింలలో అసమానతలను, అలానే ఇతర మత బృందాలతో పోల్చుకొన్నపుడు అట్టడుగున వున్నవారికి కొంత ఉపశమనాన్ని కల్గించటానికి ఈ చర్యలు పనికి వచ్చాయి. అట్టడుగున ఉన్న ప్రజల కోసం సానుకూల చర్యలు, రిజర్వేషన్లు కొనసాగటం చారిత్రక ఆవశ్యకత. అదే సమయంలో కుల ప్రమాణాన్ని దాటి వెనుకబాటుతనాన్ని నిర్వచించవలసిన ఆవశ్యకత ఉన్నది. అణచివేతకు సంబంధించిన వర్తమాన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుత ధోరణిలో మౌలికమైన రెండు లోపాలు ఉన్నాయి. మొదటిదేమిటంటే రిజర్వేషన్ విధానాలు ప్రత్యేకించి కుల ప్రాతిపదికపై మాత్రమే ఉన్నాయి. రెండవదేమిటంటే స్త్రీ, పురుష అసమానతలను, వర్గ అసమానతలను పరిగణనలోకి తీసుకోలేదు. సామాజిక న్యాయానికి సంబంధించిన వర్తమాన భావనలో వర్గ భేదాలకు తావు లేదు. అదేవిధంగా సామాజిక అసమానతలు కూడా పరిగణనలోకి రావటం లేదు.

(సెమినార్ పత్రిక వ్యాసం ఆధారంగా)



# తప్పులు ఒప్పుకోకుండా విమర్శలా!?

## మహానాడు తీరుపై పాఠకుల ప్రశ్న.. రాఘవులు జవాబు

***మహానాడులో కాంగ్రెస్-టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబడుతూ తెలుగుదేశం తీర్మానాలు చేసింది. ఈ తీర్మానాల గురించి మీరేమంటారు?***

సారధి, గుంటూరు

రాష్ట్ర ఆర్థిక మంత్రి కె రోశయ్య ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగుదేశం అనుసరించిన విధానాలనే కాంగ్రెస్ కొనసాగిస్తోందని స్పష్టంగా చెప్పారు. తెలుగు దేశం ప్రపంచబ్యాంకు నుండి సర్దుబాటు రుణం తెచ్చింది. తామూ అదే పని చేస్తున్నామన్నారు. కాబట్టి తన విధానాలనే అమలు చేస్తున్న కాంగ్రెస్‌ను భేష్ అని తెలుగుదేశం అభినందించాలి. ప్రజలకు సంబంధించిన సమస్యలపై కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికి తెలుగుదేశం ప్రయత్నించి చివరికి అదే ఇరకాటంలో పడుతోంది. చంద్రబాబు చేపట్టిన కరువు యాత్ర అపహాస్యం పాలైంది. రైతుల ఆత్మహత్యలు కాంగ్రెస్ పాలనలో కన్నా చంద్రబాబు పాలనలోనే ఎక్కువ జరిగాయి. వారికి ఎన్నడూ ఎక్స్ గ్రేషియా ప్రకటించని ఆయన ఇప్పుడు ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాల గురించి మొసలి కన్నీరు కార్చితే నరిపోతుందా? తెలుగుదేశం తన తొమ్మిదేళ్ల పాలనలో అనుసరించిన విధానాలు తప్పు అని అంగీకరించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే దానిని ప్రజలు హర్షిస్తారు.


***ఇయు రాజ్యాంగాన్ని ఆమోదించేది లేదని ఫ్రాన్స్ ప్రజలు రిఫరెండంలో ఇచ్చిన తీర్పు ప్రభావం ఎలా వుండబోతుంది?***

శేఖర్, తిరుపతి

ఇది అమెరికాకు ఒక రకంగా లాభం చేకూర్చుతుంది. ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యానికి బ్రేక్ వేయాలన్న ఉద్దేశంతో యూరోపియన్ దేశాలన్నీ ఒకే కరెన్సీ, ఒకే శక్తిగా నిలవడానికి చేసే ప్రయత్నమే ఈ ఇయు ఏర్పాటు. అయితే దీనిపై యూరపు దేశాల ప్రజల్లో ముఖ్యంగా ఫ్రాన్స్ ప్రజల్లో అనేక అనుమానాలు, భయాలు నెలకొన్నాయి. ఇయు రాజ్యాంగాన్ని అంగీకరిస్తే బ్రిటన్, జర్మనీ విధానాలు అమలు జరిగి సబ్సిడీలు, సంక్షేమంపై కోత, ప్రైవేటీకరణ, నిరుద్యోగం పెరిగిపోయే ప్రమాదముందన్న భావన ఫ్రెంచ్ ప్రజల్లో బలంగా నాటుకుంది. అందుకే దీనికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు తీర్పు చెప్పారు. దీని ప్రభావం ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలపై తప్పక పడుతుంది.

***నేపాల్ మావోయిస్టు నాయకుడు భట్టారాయ్‌తో ఢిల్లీలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ రహస్యంగా చర్చలు జరిపినట్లు వార్తలొచ్చాయి. దీనిని కరత్ వెంటనే ఖండించారనుకోండి. అయితే నేపాల్ మావోయిస్టుల పట్ల మార్క్సిస్టు పార్టీ వైఖరేమిటి?***

సమత, హైదరాబాద్



నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్)లో చీలిక వచ్చాక మావోయిస్టులు కొంత బలపడిన మాట నిజం. దీంతో ఇంకేముంది అధికారం తమ చేతిలోకి వచ్చేసిందన్నట్లుగా మావోయిస్టులు హింసాకాండను ఉధృతం చేశారు. దీనిని సాకుగా తీసుకుని నేపాల్ రాజు నిర్బంధాన్ని తీవ్రతరం చేశాడు. మావోయిస్టుల అణచివేత చర్యలు పెద్దయెత్తున చేపట్టాడు. ప్రజాస్వామ్యం పీక నులిమి రాచరికపాలనను రుద్దాడు. మావోయిస్టుల అణచివేతకు అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తోంది. భారత్ కూడా వీటిని సరఫరాచేయాలని ఒత్తిడి తెచ్చింది. దీనికి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఊగింది. అయితే వామపక్షాలు జోక్యం చేసుకుని హెచ్చరించడంతో ఆయుధాల సరఫరా ఆలోచన విరమించుకుంది. మళ్లీ ఇప్పుడు ఆయుధాల సరఫరా గురించి ఆలోచన చేస్తోంది. అదే సమయంలో మావోయిస్టుల మధ్య విభేదాలు తలెత్తాయి. అంతర్గతంగా ఒంటరిపాటైతే ఇటు రాచరికపు నిర్బంధచర్యలను, అటు అమెరికా కుట్రలను ఎదుర్కోవడం చాలా కష్టం. కనుక ప్రజాతంత్ర శక్తుల సహకారంతో ఈ నిర్బంధాన్ని ఎదుర్కోవాలన్న అభిప్రాయంతో ఒక గ్రూపు వుంది. నేపాల్ ప్రభుత్వంతో గతంలో చర్చలు జరిపింది ఈ గ్రూపే. ఈ విభేదాల నేపథ్యంలో వారు భారత్ వచ్చి తలదాచుకుని వుండొచ్చు. వారిలో కొందరు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరిలతో కలిసి చదివారు. కాబట్టి వారు కరత్‌తో సమావేశమై వుండొచ్చన్న ఊహాగానాలు వ్యాపించాయి. అంతకుమించి వీటికి ఎలాంటి ప్రాతిపదిక లేదు. నేపాల్ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ఒక దేశంలో విప్లవం విజయవంతం కావాలంటే అంతర్జాతీయంగా

కూడా పరిస్థితులు అనుకూలంగా వుండాలి. సామ్రాజ్యవాదంతోనూ పోరాడాలి.

**సిఎంపిని ప్రభుత్వం ఉల్లంఘిస్తే యుపిఎ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవచ్చు కదా? ఎందుకు ఆ పని చేయడం లేదు?**

**జగదీష్, బాలానగర్**

సిఎంపి అనేది సిపిఎం కార్యక్రమం కాదు. అందులో ప్రజానుకూల విధానాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ అనుకూల అంశాలూ వున్నాయి. సిఎంపిలోని ప్రజానుకూల విధానాలను అమలు చేయాలని మనం డిమాండ్ చేస్తున్నాము. జాతీయ ఉపాధి హామీ, గిరిజన భూ చట్టం, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటివి సిఎంపిలోని కొన్ని సానుకూలాంశాలు. ఈ ప్రభుత్వం పూర్తిగా మనం చెప్పినట్లు వింటుందన్న భ్రమలు లేవు. కాబట్టే మనం ఈ ప్రభుత్వానికి వెలుపల వుండాలని నిర్ణయించాము. ప్రభుత్వంలో వుండి ఏమీ చేయలేని దానికన్నా వెలుపల వుండి పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే మంచిదనుకున్నాము. ఈ ప్రభుత్వాన్ని ఇప్పుడే కూల్చివేయాలని కోరుకునే వారు ఏ పరిస్థితుల్లో ఈ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామో ఒక్కసారి ఆలోచించాలి. మహాభారతంలో శిశుపాలుడు వంద తప్పులు చేసేదాకా శ్రీకృష్ణుడు ఓపికపట్టాడు. వంద తప్పులు పూర్తికాగానే సుదర్శన చక్రం ప్రయోగించాడు. దానిని ఆఖరి ఆయుధంగానే కృష్ణుడు ప్రయోగించాడు. అలాగే యుపిఎ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరణ అనేది ఆఖరి అస్త్రంగా మాత్రమే వుంటుంది. మతతత్వ బిజెపిని అధికారానికి దూరంగా వుంచేందుకే కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎకు మద్దతు ఇచ్చాము. ఈ ప్రభుత్వ చర్యలు బిజెపి బలపడడానికి ఆస్కారమిచ్చినట్లైతే అప్పుడు దీనికి మద్దతు కొనసాగించడంపై పునరాలోచన చేయాల్సి వుంటుంది. దీనిని గమనంలోకి తీసుకోకుండా బిహెచ్ఇఎల్‌లో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణ లాంటి ఒకటి రెండు చర్యలకు ప్రభుత్వం పాల్పడినంత మాత్రానే ఈ ప్రభుత్వాన్ని కూల్చేయాలనడం సరికాదు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ఉద్యోగులతో కలిసి పోరాటాల ద్వారా ఒత్తిడి పెంచడంలో మన ప్రయత్న లోపం లేకుండా చూస్తాము.

**ఉచిత విద్యుత్ అందరికీ అవసరం లేదని సిపిఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ అన్నారు. మీరేమో అందరికీ ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని వై ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలంటారు?**

**ఈశ్వర్, హైదరాబాద్**

ఉచిత విద్యుత్‌ను రైతులందరికీ ఇవ్వాలని సిపిఎం ఎన్నడూ కోరలేదు. కాంగ్రెస్ అందరికీ ఉచిత విద్యుత్ అని నినాదం ఇచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ దానిని వ్యతిరేకించింది. మెట్ట ప్రాంత రైతులకు, చిన్న సన్నకారు రైతుల వరకే ఉచిత విద్యుత్ వుండాలని అన్నాము. ఆనాడు కాంగ్రెస్ వారు మనల్ని హేళన చేశారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ముఖ్యమంత్రి వై ఎస్ తన తొలి సంతకాన్ని ఉచిత విద్యుత్ ఫైలుపై సంతకం చేసి తన హామీని నిలబెట్టుకున్నానని ప్రకటించారు. తరువాత కొద్ది కాలానికే దాని నుంచి కొందరిని మినహాయిస్తున్నామన్నారు. ఆ నాడు సిపిఎం చెబితే అవహేళన చేసినవారు ఈ నాడు చేస్తున్నదేమిటి? అందుకే ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని వమ్ముచేయడం రాజకీయంగా తప్పు. అందుకే దాన్ని నిలబెట్టుకోవాలని కోరుతున్నాము. అంతే తప్ప ఉచిత విద్యుత్‌పై పార్టీ వైఖరిలో తేడా ఏమీ లేదు.

**సమైక్యాంధ్రను కాపాడుకోవడానికి వామపక్షాలు తమతో కలిసి రావాలని తెలుగుదేశం మహానాడు పిలుపు ఇచ్చింది కదా. దీనిపై మీ స్పందన ఏమిటి?**

**ఎస్. ప్రసాద్, పెడన**

ఇది అర్థ రహితమైనది. రాష్ట్రం ఇప్పుడు సమైక్యంగానే వుంది. దీనికి తక్షణం వచ్చే ప్రమాదమేమీ లేదు. తెలుగుదేశం సమైక్య రాష్ట్రానికి కట్టుబడి వుంటుందని గత ఏ మహానాడులోనూ తీర్మానం చేయకుండా ఇప్పుడే ఎందుకు చేసింది. ఇంతకన్నా ముఖ్యమైన ప్రజా సమస్యలు అనేకం ఉండగా వాటిని విస్మరించి దీనిపైనే అది తీర్మానం తేవడంలో ఔచిత్యమేమిటి? తెలంగాణా అనేది ఒక జారుడు బల్లలా తయారైంది. దీనిని ఉపయోగించుకుని రాజకీయంగా లబ్ధి పొందిన టిఆర్ఎస్ ఇప్పుడు భ్రష్టుపట్టిపోయింది. ఇటువంటి స్థితిలో తెలుగుదేశం సమైక్యరాష్ట్ర వాదాన్ని లేవనెత్తి ఏ ఆయుధం లేని టిఆర్ఎస్ చేతికి ఒక ఆయుధాన్ని ఇస్తుంది. తెలుగు దేశానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ప్రపంచబ్యాంకు విధానాలను అనుసరించి తప్పు చేశామని చెప్పి వాటిని మార్చుకోవడానికి సిద్ధపడితే దానితో కలిసి పని చేయడానికి మాకేమీ అభ్యంతరం లేదు. సినీ నటి విజయశాంతి కూడా తెలంగాణా నినాదంతో ముందుకొచ్చారు. ఆమెను వెనక నుండి నడిపిస్తున్నదెవరు అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఆమె ఏ జిల్లాకు చెందినదన్న అంశంపై చర్చ జరుగుతోంది. ఇది మున్ముందు ఎటువంటి రూపు దిద్దుకుంటుందో వేచి చూడాలి.

# భూపోరాట వీరుడు విన్‌స్టాన్లీ

(2వపేజీ తరువాయి)

చేతుల్లోకి పోయాయి. ఈ లోగా పట్టణాలకు, గ్రామాలకూ చెందిన పేదలు ఏమీ లబ్ది పొందకపోగా, యుద్ధ భారాల మూలంగా వెనుకటి కంటె మరింత హీన స్థితిలో పడ్డారు. అంతేకాకుండా విప్లవం అత్యంత విస్తృత జనసామాన్యంలో చైతన్యాన్ని రేకెత్తించకుండా ఉండజాలదు. దీర్ఘకాలిక వర్గ పోరాటాలు, వివిధ రాజకీయ ధోరణులకు చెందినవాళ్ల ప్రచార, ప్రతికూల ప్రచారాలు ఇవన్నీ జనాభాలో మిక్కిలి పేద విభాగాలలోని మరింత క్రియాశీలురు తమ సొంత నిర్దిష్ట ప్రయోజనాల అవగాహన చేసుకునేందుకు తోడ్పాడ్డాయి. బూర్జువాలు, 'కొత్త కులీనులూ' అధికార స్థానాల్లో స్థిరంగా బైఠాయించాక, ఎవరి సహాయంతో తాము రాజరిక బలగాలను నిర్మూలించారో, ఆ జనసామాన్యపు డిమాండ్లను తీర్చే విషయంలో అంత హడావిడి చూపలేదు. దానితో సహేతుకంగానే రైతుల్లో, చేతివృత్తుల వాళ్లల్లో , సైనికులలో అసంతృప్తి రేకెత్తింది.

1647 నాటికి అప్పటికే ఒకవైన 'కొత్త కులీనులు' బూర్జువాలకీ, మరోవైపున పట్టణ, గ్రామీణ పేదలతో కూడిన వైవిధ్య పూరితమైన సామాజిక విభాగాలకీ మధ్య తీవ్రమైన వైరుధ్యాలున్నట్లు స్పష్టపడింది. పార్లమెంటరీ పార్టీలోనే మిత బూర్జువాలు, తీవ్ర ప్రజాతంత్రవాదులు (లెవలర్లు, అంటే సమానత్వ వాదులు అనబడేవాళ్లు) అనే రెండు మౌలిక ధోరణుల మధ్య చీలిక ఏర్పడింది. లెవెలర్లు ఓటు హక్కునూ, రాజకీయ స్వేచ్ఛలను విస్తృతం చేయాలని, రిపబ్లిక్‌ను ప్రకటించాలని కోరగా, పార్లమెంటులోని మితవాద విభాగం రాజాధికారాన్ని నిలిపి ఉంచడం పట్ల విముఖత చూపలేదు. రాజాధికారం జనాన్ని అణచి ఉంచగలదని వాళ్లు భావించారు. సైనికులూ, లెవెలర్లూ రాజుపై మరణదండన విధించాలని డిమాండ్ చేశారు. విన్‌స్టాన్లీ దేశాన్ని కుదిపేస్తున్న ఈ వివాదాలకు దూరంగా ఉండిపోలేదు.

1648 డిసెంబర్‌లో 'బకింగ్ హామ్‌షైర్‌లో ఉజ్వల కాంతి' అనే శీర్షికతో 'బకింగ్ హామ్‌షైర్‌లో ఉజ్వల కాంతి లేక, ప్రధాన కారణాల ఆవిష్కరణ, ప్రపంచంలో ప్రధానంగా ఇంగ్లండ్‌లో సమస్త బానిసత్వానికి మూలకారణం: పేదలూ , పీడితులూ అయిన ఆంగ్లేయులందరికి అంతేకాక లార్డ్ ఫెయిర్‌ఫాక్స్ నాయకత్వంలో ఉన్న ప్రస్తుత సైన్యం పరిశీలనకీ చేసిన ప్రకటన అనే ఓ పెద్ద ఉప శీర్షికతో ఓ చిన్న పుస్తకం వెలువడింది. ఆ పుస్తకం మీద రచయిత పేరు లేకపోయినప్పటికీ, దాని రచనకు విన్‌స్టాన్లీ తోడ్పడి ఉంటాడని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే అందులోని విషయాలు చూస్తే మాత్రం స్టాన్లీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. మొదటి చార్లెస్ విచారణకు కొంచెం ముందు, రిపబ్లికన్ వ్యవస్థ సమస్యపై అంతిమ నిర్ణయం ఇంకా తీసుకోబడక ముందు అది వెలువడింది. దీన్ని బట్టి ఈ పుస్తకం లక్ష్యమేమిటో తేటతెల్లం అవుతుంది. దాని విషయాంశమంతా రాజాధికారానికి, చార్లెస్ నిరంకుశ పాలనను క్రియాశీలంగా సమర్ధించిన చర్చికి వ్యతిరేకంగా వెలువడింది. రచయిత పార్లమెంటును సైతం సమ్మవద్దని హెచ్చరించాడు. ఎవరినైతే రాజాధికారం ఎదుర్కోలేని స్థితిలో పడిందో, ఆ అసంతృప్త, పీడిత ప్రజల ఒత్తిడి మూలంగా పార్లమెంటు ఏర్పాటు చెయ్యబడిందన్న విషయాన్ని విషయాన్ని అతను వాళ్లకి జ్ఞాపకం చేశాడు. పార్లమెంటు చక్రవర్తి అధికారాన్ని పటిష్టం చేసింది అంత మాత్రవే. జనం తాము స్వేచ్ఛను సాధించుకున్నామని భావించారు. కానీ వాస్తవంలో వాళ్లు పార్లమెంటు అనే సాధనం ద్వారా తమ స్వేచ్ఛను కోల్పోయారు. విన్‌స్టాన్లీ రచించిన 'న్యాయానికి సంబంధించిన కొత్త నియమం ' అనే పుస్తకం 1649 జనవరిలో వెలువడింది. ఇందులో వ్యక్తిగత ఆస్తిని 'నాది', 'నీది' అనే విభజనను సమస్త సాంఘిక చెడుగులకూ ప్రధాన కారణంగా ఆయన పేర్కొన్నారు. విన్‌స్టాన్లీ ఇతర రచనలూ కూడా 1649లోనే వెలువడ్డాయి. వాటిలో కొన్ని వాల్టన్‌కి చెందిన విలియం స్టార్, జాన్ టేలర్‌ల రక్తప్లావిత, క్రీస్తుమత విరుద్ధ వర్తన గురించి ప్రకటన, లార్డ్ జనరల్‌కి, ఆయన యుద్ధ మంత్రి మండలికి, కామన్స్ సభకీ విజ్ఞప్తి అనే చిన్న పుస్తకాలు రాశారు.

1649లో విన్‌స్టాన్లీ డిగ్గర్ల ప్రత్యేక కాలనీ కోసం విశేష కృషి సాగించాడు. అధికారంలో ఉన్నవాళ్ల సహకారం సహజంగానే ఆయనకు అందలేదు. పైపెచ్చు వేధింపులు మొదలయ్యాయి. 1649లో విన్‌స్టాన్లీ తదితరులపై ప్రాసిక్యూషన్‌కు పూనుకున్నారు. కోర్టు వారికి భారీ జరిమానా విధించింది. అది డిగ్గర్ల మొత్తం ఆస్తికన్నా అధికంగా ఉంది. దాంతో చేసేదేమీ లేక వారు వేరే చోటకు పయనమైపోయారు. డిగ్గర్ల కార్యక్రమానికి అనుకూలంగా ప్రచారం చేస్తూ స్టాన్లీ ఆయన అనుచరులు "ఇంగ్లండ్ పేద, పీడిత ప్రజల ప్రకటన" పేరుతో ఒక కొత్త ప్రణాళికను ప్రచురించారు. 1649 తరువాత డిగ్గర్ల కమ్యూన్‌కు వ్యతిరేకంగా కఠినమైన చర్యలు తీసుకోబడ్డాయి. సెయింట్ జార్జి కొండ దగ్గరకు చేరుకున్న సైనిక దళాలు డిగ్గర్ల ఇళ్లను కూల్చివేసి కొయ్య పలకలను సైతం తమతో తీసుకుపోయారు. డిగ్గర్ల దయనీయమైన జీవితాల గురించి, వారి ఉద్యమ సహేతుకత గురించి సమాజానికి తెలియజెప్పేందుకు తన రచనల ద్వారా స్టాన్లీ విశేషమైన కృషి చేశాడు. 1652లో ఆయన చివరి రచన వెలువడింది. దాని పేరు "స్వేఛ్చా నియమం". భూమి, దాన్నుంచి లభించే సమస్త ఫలసాయాల ఉమ్మడి వినియోగం మీద ఆధారపడిన సమాజ నిర్మాణానికి ఆయన ఒక పథకాన్ని అందులో ఆయన విపులీకరించాడు.

రాజ్యానికి చెందిన భూమినంతటినీ, దానికి తోడు చర్చి భూములను, రాజు దగ్గర నున్న జప్తు చేసిన భూములు, పార్కులు, అటవీ భూములను పేదలకు పంచి ఇవ్వాలని నాటి పార్లమెంటు నాయకుడు క్రామ్‌వెల్‌కు స్టాన్లీ పలుమార్లు విజ్ఞప్తి చేశాడు. అలా చేయకపోతే ఆయన చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని కూడా స్టాన్లీ హెచ్చరించారు. ప్రతిమనిషికీ భూమి కలిగి ఉండే హక్కు ఉందన్నది ఆయన రచనల ప్రాథమిక సూత్రం. శ్రమను సంపదకు ఏకైక మూలంగా గుర్తించడం, భూమిపై వ్యక్తిగత స్వామ్యమే సామాజిక చెడుగులన్నిటికీ మూలమని ఆనాడే ఆయన గుర్తించడమే కాదు తన రచనలన్నిటిలోనూ ఈ విషయాలను పదేపదే ప్రస్తావించాడు. రెండు శతాబ్దాల తర్వాత ఇంగ్లండ్‌లో తలెత్తబోయే కష్టజీవుల ఇక్కట్లను ఆయన ముందుగానే దర్శించగలిగాడు. వాటిని తన రచనల్లో ప్రతిఫలించేట్లు చేయగలిగాడు.

1652 తరువాత విన్‌స్టాన్లీ జీవితం గురించి దాదాపు ఏమీ తెలియదు. ఆయన ఎక్కడ, ఎప్పుడు మరణించాడో ఎవరికీ తెలియదు. ఆయన 1676 సెప్టెంబర్ 10 వ తేదీన మరణించి ఉంటాడని భావిస్తున్నారు. అనంతర ఆంగ్ల ఊహాజనిత సోషలిస్టుల మీద విన్‌స్టాన్లీ అభిప్రాయాల ఖచ్చితమైన ప్రభావం ఉంది. రాబర్ట్ ఓవెన్ జాన్ బెల్లర్స్ అనుచరుడు కాగా, బెల్లర్స్ విన్‌స్టానీ భావాలను అభివృద్ధి చేశాడు.

# ఎవరేమన్నారు?

"యుపిఎ ప్రభుత్వ విజయాలు నాకు మాత్రం సంతృప్తికరంగా లేవు. నా ఏడాది పాలనకు పదికి ఆరు మార్కులే వేసుకున్నాను."

-ప్రధాని మన్మోహన్ సింగ్

" అది వారి ఉత్సవం వారితో మాకు కొన్ని భేదాభిప్రాయాలు ఉన్న దృష్ట్యా ఆ ఉత్సవంలో మేము పాలుపంచుకొనే పరిస్థితి లేదు."

- యుపిఎ ప్రభుత్వ ప్రథమ వార్షికోత్సవం గురించి సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతిబాసు

"తెలంగాణా వెనుకబాటుతనానికి చారిత్రిక, ప్రకృతిపరమైన కారణాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలవారు తెలంగాణాను దోచుకున్నారనడం దుష్ప్రచారమే."

- ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలోని తెలంగాణ ఉప కమిటీకి రాసిన లేఖలో సిపిఐ రాష్ట్ర సమితి

"నా జోలికి వస్తే అన్ని విషయాలూ బయటపెడతా. ఎన్నికల ముందు జరిగిన ఒప్పందాలన్నీ వెల్లడిస్తా. నేను నోరు విప్పితే టిఆర్ఎస్ పని ఖతం"

-కాంగ్రెస్ సీనియర్ నేత జి వెంకటస్వామి

"లాలూ ప్రసాద్ యాదవ్‌పై కొన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి వుందని ఎన్ గోపాలస్వామి చెప్పారు"

-బీహార్‌లోని చాప్రాఎన్నికలకు ప్రత్యేక పరిశీలకునిగా వ్యవహరించిన ఎల్ వి సప్తర్షి

" అవినీతి చాలావరకు రాజకీయనాయకుల నుంచే ప్రారంభమవుతుంది. తరువాత ఐఎఎస్ అధికారులు ఇందులో చేరతారు. ఈ రాజకీయ వ్యవస్థను గనుక సరిచేయగలిగితే బ్యూరోక్రసీ మీద దాని ప్రభావం చాలా వుంటుంది. అందుకే అన్ని అవినీతి చర్యలకు మూలం రాజకీయ అవినీతి అంటాను"

- మాజీ ప్రధాని వి పి సింగ్

"గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ దేశ ప్రజలు తమను గట్టిగా నిరాకరించారనే వాస్తవాన్ని ఇప్పటికీ జీర్ణించుకోని ప్రతిపక్షంతో మేము వ్యవహరించాల్సి వస్తోంది."

- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ.

" టిడిపి పుట్టక ముందునుంచే మేము విశాలాంధ్రకు కట్టుబడి వున్నాము. ఇప్పుడు టిడిపి సమైక్యాంధ్రకు కలిసి రండని మాకు పిలుపు ఇవ్వడం విడ్డూరంగా వుంది."

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి

" బీహార్ ఎమ్మెల్యేల బేరసారాలు నీచస్థాయిలో సాగినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. అందుకే అసెంబ్లీ రద్దుకు నిర్ణయం తీసుకున్నాం."

- ప్రధాని మన్మోహన్ సింగ్

"బీహార్ అసెంబ్లీని రద్దు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు"

- మాజీ ప్రధాని ఎ బి వాజ్‌పేయి

"భారతీయ మార్కెట్‌లో ఆహార ధాన్యాలు, కూరగాయలు సమృద్ధిగా వున్నాయి. కానీ వాటిని కొనే తాహతు ప్రజలందరికీ లేదు"

-ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం ఎస్ స్వామినాథన్

"రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని జూన్ ఒకటి నుంచి నిలిపివేస్తున్నాం. దానికి బదులు రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను సరఫరా చేస్తాం."

-మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్

" గోద్రా అనంతరం గుజరాత్‌లో జరిగిన మారణ కాండ గాంధీజీ హత్యతో సమానం. మోడీ సకాలంలో స్పందించకపోవడం వల్లే ఈ హత్యాకాండ యథేచ్ఛగా సాగిపోయింది"

-బిజెపి సీనియర్ నాయకుడు, గుజరాత్ మాజీ గవర్నరు సుందర్ సింగ్ భండారీ

"రాజ్యహింసను ఖండిస్తున్న మా మధ్య అపోహాలు, అగాధాలు సృష్టించడానికి పోలీసులు పన్నిన పథకంలో భాగమే ఈ లేఖలు"

-విరసం కార్యవర్గ సభ్యుడు వరవరరావు

"ఆర్థిక సంస్కరణలపై వామపక్షాల వాదంలో వాస్తవముంది."

-తెలుగుదేశం అధ్యక్షుడు ఎన్. చంద్రబాబు నాయుడు

" బిజెపి నాగుపాము అయితే కాంగ్రెస్ మామూలు పాము"

- తాజ్ కారిడార్ సమస్యపై కేంద్ర ప్రభుత్వ వైఖరి గురించి బిఎస్‌పి అధినేత మాయావతి

"వాజ్‌పేయి, అద్వానీల మార్గదర్శకత్వం కొనసాగుతుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకుడు ఒకరు పార్టీకి నాయకత్వం వహిస్తారు"

- బిజెపి ఉపాధ్యక్షుడు ముఖ్తార్ అబ్బాస్ నక్వీ

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | LPSA101M117 |
| పుస్తకం పేరు | ప్రజాశక్తి |
| తారీఖు | 14 March 2025 |
| ముందు అట్ట | YES |
| వెనుక అట్ట | YES |
| మొత్తం పేజీలు | 29 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | P. Jayamma |
| పేజీలు విడదీసినది | P. Jayamma |
| స్కాన్ చేసినది | Naveeda |
| పరీక్ష చేసినది | THASIN |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |